www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 350
గురువారం | 4-4-2024 | పేజీలు : 14 | వెల (Price) : Rs. 6.50

సినిమా టికెట్లు అమ్మించారుగా!
పింఛన్లు ఇవ్వడానికి ఉద్యోగులు లేరా..?
ఎక్స్‌లో సీఎస్‌ను ప్రశ్నించిన జనసేనాని
సీఎస్‌ను ఎన్నికల విధులకు దూరం పెట్టండి
పింఛన్ల పంపిణీలో రసాభాసకు ఆయనే కారణం
సీఈవో మీనాకు ఎన్డీయే కూటమి నేతల ఫిర్యాదు
11

వలంటీర్లు లేని రాష్ట్రాల్లోనూ పెన్షన్ ఇస్తున్నారు కదా?
పంపిణీ బాధ్యతల నుంచి తొలగించడం సబబే
ఈసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది
అనారోగ్య సమస్యలున్న, బయటకురాలేని లబ్ధిదారులకు ఇళ్ల వద్దే అందజేస్తామన్నారు
ఈసీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం: హైకోర్టు
ప్రజా ప్రయోజన వ్యాజ్యం కొట్టివేత

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: దశమి సా. 4.16 తదుపరి ఏకాదశి; నక్షత్రం: శ్రవణం రా. 8.13 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా. 11.52-1.19; దుర్ముహూర్తం: ఉ. 10.16-11.05, మ. 3.10-3.59; అమృతఘడియలు: ఉ. 10.30-11.59; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వైసీపీ ఐపీఎస్‌లు!


22 మందిని పక్కకు తప్పించండి
ఆ అధికారులతో 'ఓటుకు చేటు'.. ఈసీకి బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఫిర్యాదు

- నిర్దిష్టంగా పేర్లు, ఆరోపణలతో లేఖ
- డీజీపీ 'సీక్రెట్ ఫండ్స్' మింగేశారు
- ఎన్నికల మేనేజ్‌మెంట్ కోసం ఇంటెలిజెన్స్ చీఫ్‌కు కోట్లు
- రిషాంత్ రెడ్డి ద్వారా ఫోన్ ట్యాపింగ్
- విపక్ష అభ్యర్థులు, నేతలను అడ్డుకోవడమే లక్ష్యం
- వైసీపీ జేబులో మనుషులుగా మారారు
- నిష్పాక్షిక ఎన్నికలు జరగాలంటే ఈ ఐపీఎస్‌లను పక్కకు తప్పించాలి
- వినతిపత్రంలో పురందేశ్వరి స్పష్టీకరణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
అధికార పార్టీతో అంటకాగుతున్న ఐపీఎస్ అధికారులపై బీజేపీ గురిపెట్టింది. కీలక స్థానాల్లో ఉన్న ఈ ఐపీఎస్‌లు ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం పని చేస్తున్నారని మండిపడింది. వీరిని పక్కకు తప్పిస్తేనే ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికంగా, సజావుగా సాగుతుందని స్పష్టం చేసింది. ఇన్‌చార్జి డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి నుంచి నాన్ కేడర్ ఎస్పీ ఆనంద్ రెడ్డి వరకు ఏకంగా 22 మంది పేర్లు, వారిపై ఉన్న అభియోగాలు, అవినీతి చర్యలు, వైసీపీతో ఉన్న బంధం, విపక్షాలను వేధిస్తున్న వైనం... వివరిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశారు. 'నిష్పాక్షిక ఎన్నికల కోసం వీరిని విధుల నుంచి తప్పించాలని గట్టిగా భావిస్తున్నాం' అని తెలిపారు. ఆయా అధికారులు అనేక సందర్భాల్లో మాటలు, చేతల ద్వారా వైసీపీ పట్ల

మిగతా 12వ పేజీలో...

మలి వేటు ఎవరిపై!
- సీమలో ఓ డీఐజీ, కోస్తా ఐజీ బదిలీ ఖాయం.. అదనపు డీజీ ర్యాంకు అధికారిపైనా కన్ను
- అదే దారిలో మరో ముగ్గురు ఎస్పీలు కూడా?.. నేడో రేపో ఎన్నికల కమిషన్ నిర్ణయం
- వేటుపడిన ఐజీ, ఎస్పీల స్థానంలో ఎవరు?.. ఐపీఎస్ వర్గాల్లో జోరుగా చర్చ

12





ఇంటికే తెచ్చి ఇచ్చిన ఆనందం..
పెన్షన్ల సొమ్ము జమ అయిన చోట ప్రభుత్వ సిబ్బంది వయో వృద్ధులకు నేరుగా ఇంటికి వెళ్లి పింఛను ఇచ్చారు. విజయవాడలో తన నివాసంలోనే పెన్షన్ అందుకున్న ఒక వృద్ధురాలి ఆనందం ఈ చిత్రంలో చూడొచ్చు.



వృద్ధులను రోడ్లకీడ్చి పైశాచికం
బుధవారం ఉదయం అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలో మంచానికే పరిమితమైన వృద్ధులను.. ఇలా రోడ్లపైకి తీసుకొచ్చారు. విపక్షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆందోళన అక్కర్లేదు
6వ తేదీ దాకా పింఛన్ల పంపిణీ

నీచం.. జగన్!

అవ్వా తాతలతో క్రూర పరిహాసం

- అస్మదీయ కాంట్రాక్టర్లకు వేల కోట్లు
- వృద్ధాప్య పింఛనుకు మాత్రం 'కోతలు'
- నిధులు విడుదల చేయకుండా కుట్రలు
- బ్యాంకులకు జమకాని పింఛన్ నిధులు
- ఏ జిల్లాలోనూ పూర్తిగా అందని సొమ్ము
- సచివాలయాలకు వృద్ధులు బారులు
- డబ్బుల్లేవని చేతులెత్తేసిన సిబ్బంది
- ఎండ వేడిమికి వృద్ధులు విలవిల

ఈసారి 3వ తేదీ దాకా పెన్షన్లు ఇవ్వలేమని గతనెల 28వ తేదీనే జగన్ సర్కారు చేతులెత్తేసింది.

బుధవారం మధ్యాహ్నం తర్వాతే పెన్షన్ల పంపిణీ జరుగుతుందని యంత్రాంగం అధికారికంగానే ప్రకటించింది.

అస్మదీయ కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు ఇచ్చేసిన జగన్ సర్కారు.. అవ్వా తాతలకు అవసరమైన పెన్షన్ నిధులు 1,900 కోట్లను మాత్రం తొక్కిపెట్టింది.

బుధవారం సాయంత్రందాకా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా పూర్తిస్థాయిలో పెన్షన్లకు అవసరమైన సొమ్ము జమ చేయలేదు.

11

ఇంత నీచమా!?

అయినా సరే.. బుధవారం తెల్లవారగానే వైసీపీ నీచ రాజకీయానికి తెరలేపింది. అవ్వా తాతలను పాత్రధారులను చేస్తూ 'మంచాల నాటకం' మొదలుపెట్టింది.

నడవలేని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఇంటికే వెళ్లి పెన్షన్ ఇవ్వాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నా... కావాలనే వృద్ధులను రోడ్ల పాల్జేసి, మండుటెండలో ఊరేగింపు తీసి, మానవత్వాన్ని మంటగలిపింది.

ఓట్ల కోసం ఇంత నీచమా?
ఇదేనా అవ్వా తాతలపైన ప్రేమ?

ఓట్లే కావాలనుకుంటే శవాన్ని తీసుకెళ్లు!
- మనిషి పోయిన బాధలో మేముంటే మీ రాజకీయాలేంటి?
- వైసీపీ శవరాజకీయంపై వృద్ధురాలి బంధువుల ఆగ్రహం
- మంత్రి జోగి రమేశ్‌కు గట్టిగా బుద్ధి చెప్పిన వైనం
- పెనమలూరులో వడదెబ్బతో వృద్ధురాలి మృతి
- అంతకుముందు పింఛను కోసం 2సార్లు సచివాలయానికి
- సర్కారు నుంచి డబ్బు రాక సిబ్బంది నిస్సహాయత
- మృతదేహంతో బాబు ఇంటి వద్ద నిరసనకు జోగి పిలుపు
- ఓట్ల కోసం శవ రాజకీయాలు చేయవద్దన్న బంధువులు

అప్పుడు బాబాయిని..
ఇప్పుడు వృద్ధుల్ని..!
- చంపేసి డ్రామాలాడదామనుకుంటున్నాడు
- పింఛన్ల పంపిణీపై శవ రాజకీయం
- జగన్‌పై చంద్రబాబు ఫైర్
- సీఎస్‌కు, యంత్రాంగానికి బాధ్యత లేదా?
- నాటకాలాడేవారికి సహకరిస్తున్నారా?
- ఇంత మంది అధికారులు ఉన్నారు
- ఒక నెల పింఛను ఇంటింటికీ తిరిగి ఇవ్వలేరా?
- వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకిని కాదు
- వారి రాజకీయాన్నే వ్యతిరేకిస్తున్నా
- తటస్థంగా ఉంటే మేమొచ్చి మేలు చేస్తాం
- నెలకు 50 వేలు వచ్చేలా చేస్తాం: బాబు





కోనసీమ జిల్లా రామచంద్రాపురం సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న చంద్రబాబు

ఎస్.. నేను పశుపతినే!
- గరళాన్ని మింగిన శివుడి అవతారమెత్తా 2
- రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి
- అవమానాలైనా భరిస్తా.. ప్రజాగళంలో బాబు

అమలాపురం-ఆంధ్రజ్యోతి/రావులపాలెం, ఏప్రిల్ 3: 'అప్పుడు బాబాయిని చంపి డ్రామాలాడాడు.. ఇప్పుడు పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులను చంపేసి డ్రామాలు ఆడుదామనుకుంటున్నాడు. జగన్ వృద్ధులతో శవ రాజకీయం చేస్తున్నాడు' అని టీడీపీ అధినేత చంద్రబాబు విరుచుకుపడ్డారు. పింఛన్ల సజావు పంపిణీకి

మిగతా 11వ పేజీలో...



తైవాన్‌లో భారీ భూకంపం
2
- తొమ్మిది మంది దుర్మరణం
- 821 మందికి గాయాలు.. తీవ్రత 7.2
- కూలిన వంతెనలు.. ఒరిగిన భవనాలు
- శిథిలాల కింద 127 మంది

నేడు, రేపు పెరగనున్న వడగాల్పులు
2

తంటాలు పడి తరలించినా.. టాటా!
- జగన్ రాకముందే కొందరు.. వచ్చాక ఇంకొందరు
- మాట్లాడుతుండగా పూర్తిగా వెళ్లిపోయిన ప్రజలు
- పూతలపట్టు సభ కోసం 1500 బస్సులు
- ఎండదెబ్బకు బస్సు కూడా దిగని మహిళలు
- వేడెక్కిన వాటర్ ప్యాకెట్లను ముట్టుకోలేని స్థితి
- రోడ్‌షో పేరిట బస్సులో నుంచే అభివాదం
- రోడ్‌షో జరిగిన ప్రాంతాల్లో చెట్ల నరికివేత
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు

3






వైజాగ్‌లో విజృంభించారు
10
- కోల్‌కతా భారీ స్కోరు 272/7
- ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు
- నరైన్, రఘువంశీ, రస్సెల్ సూపర్ ఇన్నింగ్స్
- ఢిల్లీపై 106 పరుగులతో ఘన విజయం

తమిళనాట త్రిముఖ పోరు

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాట త్రిముఖ పోటీ నెలకొంది. డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి, విపక్ష అన్నాడీఎంకే కూటమి, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి పోరుకు సిద్ధమయ్యాయి. గత ఎన్నికల్లో రాష్ట్రంలోని 39 స్థానాలకుగాను 38 సీట్లు సొంతం చేసుకున్న డీఎంకే కూటమి ఈసారి కూడా అదే ప్రాభవాన్ని చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. ముందుగానే పొత్తులు ఖరారు కావడం, పాత స్నేహితులే ఈసారీ జట్టులో నిలవడం, సంప్రదాయ ఓటు బ్యాంకు తదితరాలు కూటమికి బలంగా మారాయి. దీనికితోడు స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు తమకు విజయం సాధించిపెడతాయని ఆ కూటమి నేతలు గట్టిగా భావిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో మొత్తం 39 స్థానాలు సాధించుకుంటామని ఆ కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

స్పీడు పెంచిన పళనిస్వామి



ఎన్నికల వ్యూహరచనలో ఎప్పుడూ ముందుండే అన్నాడీఎంకే ఈసారి కాస్త డీలా పడినట్లు కనిపిస్తోంది. పొత్తులు, సీట్ల సర్దుబాటు కాస్త ఆలస్యంగా ముగించిన ఆ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి.. వెంటనే వేగం పుంజుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తమకున్న సంప్రదాయ ఓటు బ్యాంకు ఈసారి అండగా నిలుస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీనికితోడు దివంగత నటుడు విజయకాంత్ స్థాపించిన డీఎండీకేతో పొత్తు అన్నాడీఎంకేకు ప్లస్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికితోడు పళనిస్వామికి చెందిన దేవర్ సామాజిక వర్గం అన్నాడీఎంకేకు అండగా ఉంది. ఈ ఎన్నికల్లో కనీసం 10-12 స్థానాలు సాధించుకుంటామని, అదే జరిగితే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుచేయడం ఖాయమని సీనియర్లు పేర్కొంటున్నారు. స్టాలిన్ కేబినెట్‌లోని కొందరు మంత్రులు అవినీతి కేసుల్లో ఇరుక్కుపోవడం, ప్రభుత్వానికీ అవినీతి మకిలి అంటుతున్నట్లు జరుగుతున్న ప్రచారం తమకు ఓట్లు సాధించిపెడతాయని భావిస్తున్నారు.

ఓట్ల శాతం పెంచుకోవడమే లక్ష్యంగా...

వన్నియార్లలో గణనీయ ఓటు బ్యాంకు కలిగిన పీఎంకేను జత చేర్చుకుని, జోష్‌లో కనిపిస్తున్న బీజేపీ.. ఈసారి ఎన్నో కొన్ని స్థానాలు సంపాదించుకోవడంతో పాటు ఓట్ల శాతం పెంచుకోవాలని పట్టుదలగా ఉంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎల్.మురుగన్ (కేంద్ర మంత్రి), డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ (మాజీ గవర్నర్), పొన్ రాధాకృష్ణన్ (కేంద్ర మాజీ మంత్రి) తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. డీఎంకే ప్రభుత్వం హిందూ ఆలయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, అవినీతి బురదలో కూరుకుపోయిందని విస్తృతంగా చేపట్టిన తమ ప్రచారం ఓట్లు సంపాదించిపెడుతుందని కమలనాథులు బలంగా నమ్ముతున్నారు. దీనికితోడు తమిళ సంస్కృతి సంప్రదాయాలు, భాషను ప్రధాని మోదీ ప్రతిసారీ విపరీతంగా పొగుడుతుండటం, తరచుగా రాష్ట్ర పర్యటనలకు వస్తుండటం తమకు ఓటు శాతం పెంచుతుందని విశ్వసిస్తున్నారు. ప్రముఖ నటుడు శరత్‌కుమార్ దంపతులు తమ పార్టీని బీజేపీలో విలీనం చేయడం, అన్నాడీఎంకే ఓట్లను గణనీయంగా చీల్చగలిగిన మాజీ సీఎం ఒ.పన్నీర్ సెల్వం, శశికళ సమీప బంధువు, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అధినేత టీటీవీ దినకరన్ వంటివారు తమ కూటమిలో చేరడంతో ఈసారి తమ ఓటు బ్యాంకు పెరుగుతుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా.. ఒకప్పుడు జయలలిత మాటున అన్నాడీఎంకేను శాసించి, ఆనక పార్టీ నుంచి బహిష్కృతురాలై, జైలుపాలై.. ఏకాకిగా మిగిలిన చిన్నమ్మ శశికళ.. ఈ ఎన్నికల్లో ఏం చేయబోతున్నారన్నది ఆసక్తిగా మారింది. చిన్నమ్మ నుంచి ఎలాంటి సంకేతాలు వెలువడకపోవడంతో ఆమె అనుచర గణం డైలమాలో పడ్డారు.

రాజ్యాంగ నాశనానికి మోదీ యత్నం

అది జరక్కుండా 'ఇండియా' ఆపుతోంది: రాహుల్.. వయనాడ్ అభ్యర్థిగా అట్టహాసంగా నామినేషన్

- వెంట సోదరి ప్రియాంక
- పట్టణంలో భారీ రోడ్‌షో



వయనాడ్ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాహుల్

వయనాడ్, ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికలు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రయత్నిస్తున్నారని, అది జరక్కుండా ఆపేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి కృషి చేస్తున్నాయని చెప్పారు. సోదరి ప్రియాంకా గాంధీ వాద్రా వెంట రాగా.. బుధవారం వయనాడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 10.45 గంటలకు కన్నూర్ నుంచి ఇక్కడికి సమీపంలోని ముప్పయ్‌నాడ్ గ్రామంలోని హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్లో దిగారు. అక్కడ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాల్‌పేటలోని కొత్త బస్టాండ్ వద్దకు రోడ్డుమార్గంలో చేరుకున్నారు. అక్కడి నుంచి 11.30 గంటలకు భారీ రోడ్‌షోతో వయనాడ్‌లో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సివిల్ స్టేషన్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ఆయన ఓపెన్ వాహనంపై నిలబడి కార్యకర్తలు, మద్దతుదారులకు అభివాదం చేశారు. ఆయన పక్కన ప్రియాంక, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, దీపా దాస్‌మున్షీ, ఎన్ఎస్‌యూఐ ఏఐసీసీ ఇన్‌చార్జి కన్హయ్యకుమార్, కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, కేపీసీసీ యాక్టింగ్ అధ్యక్షుడు ఎంఎం హసన్ తదితరులు కూడా ఉన్నారు. సివిల్ స్టేషన్ వద్ద రాహుల్ పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు. వయనాడ్ కలెక్టర్-రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశాక విలేకరులతోనూ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, దేశ రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకునే శక్తులు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఒక వైపు. వాటిని కాపాడే శక్తి (కాంగ్రెస్, ఇండియా కూటమి) మరోవైపు మోహరించాయని తెలిపారు. వయనాడ్ సమస్యల గురించీ ప్రస్తావించారు. గత దశాబ్ద కాలంలో ఏనుగులు, పెద్దపులుల దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గ సమస్యలను ఎప్పటికప్పుడు దేశం దృష్టికి తీసుకొస్తున్నానని చెప్పారు. అద్భుతమైన చరిత్ర, సంప్రదాయాలు కలిగిన వయనాడ్ తనకు వెలుగు దివ్వెలా నిలిచిందన్నారు. గత ఐదేళ్లగా నియోజకవర్గ ప్రజలు అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞుడినని.. ఇప్పుడు 'న్యాయ్' శకంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో వారందరికీ తన శక్తి మేరకు సేవ చేసేందుకు తిరిగి కంకణబద్ధుడినవుతానని చెప్పారు. వయనాడ్ ప్రజలను చెల్లెలు ప్రియాంక మాదిరిగా తన కుటుంబంగానే పరిగణిస్తున్నానని.. ఓటర్లుగా చూడడం లేదని ఆ తర్వాత 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. క్రూర జంతువుల దాడులు, రాత్రివేళ ప్రయాణాలు, వైద్య కళాశాల సమస్యల పరిష్కారానికి కేంద్ర సర్కారు, కేరళలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చానని.. కానీ అవి సానుకూల చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. కాగా.. గత ఎన్నికల్లో రాహుల్ తన సమీప సీపీఐ అభ్యర్థి పీపీ సునీర్‌పై 4 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ దఫా సీపీఐ నేత అన్నీ రాజా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్‌తో తలపడుతున్నారు. కేరళలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకు 26న పోలింగ్ జరుగనుంది.

వయనాడ్‌లో స్మృతి ప్రచారం

కేరళ బీజేపీ అధ్యక్షుడు సురేంద్రన్ రాహుల్‌కు పోటీగా వయనాడ్ లోక్‌సభ స్థానానికి గురువారం నామినేషన్ వేయనున్నారు. తర్వాత, రోడ్ షో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్మృతి ఇరానీ కూడా పాల్గొనున్నారు. 2019లో అమేథీలో స్మృతి ఇరానీ రాహుల్ గాంధీని ఓడించిన సంగతి తెలిసిందే. అప్పుడు వయనాడ్‌లో కూడా పోటీ చేసి గెలిచిన రాహుల్‌పై ఈసారి ఒత్తిడి పెంచడానికి ఆమె వయనాడ్‌లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్

- 'ఘర్ ఘర్ గ్యారంటీ' ప్రారంభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ.. కాంగ్రెస్ పార్టీ తమ 'పాంచ్ న్యాయ్- పచ్చీస్ గ్యారెంటీ'లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సరికొత్త కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగానే తాజాగా.. 'ఘర్ ఘర్ గ్యారంటీ' పేరిట మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్‌తో కలిసి బుధవారం ఢిల్లీలోని ఉస్మాన్‌పూర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ హామీలపై సుమారు ఎనిమిది కోట్ల కుటుంబాలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఖర్గే తెలిపారు. 14 భాషల్లో ముద్రించిన 'పాంచ్ న్యాయ్ - పచ్చీస్ గ్యారెంటీ' కరపత్రాలను దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రతి కుటుంబానికీ చేరుస్తారని, వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తారని చెప్పారు. మోదీ గ్యారెంటీని ప్రజలు విశ్వసించట్లేదన్నారు. తప్పుదోవ పట్టించి, భ్రమల్లోకి నెట్టి మళ్లీ అధికారంలోకి రావాలనే వారికి ఈసారి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

బైడెన్ వర్సెస్ జిన్ పింగ్

ఫోన్‌లో అమెరికా, చైనా అధ్యక్షుల సంవాదం

హైటెక్ టెక్నాలజీ గురించి మాటల తూటాలు

వాషింగ్టన్, ఏప్రిల్ 3: టిక్‌టాక్‌పై చర్యల నుంచి తైవాన్ వరకు.. రష్యాకు సాయం నుంచి హైటెక్ టెక్నాలజీ వరకు.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ మధ్య సంవాదం సాగింది. ఫోన్‌లో ఇరు దేశాధినేతలు దాదాపు రెండు గంటలపాటు వాదులాడుకున్నారు. నవంబరులో కాలిఫోర్నియాలో జరిగిన శిఖరాగ్ర సదస్సు తర్వాత వీరిద్దరి మధ్య ఇదే తొలి సంభాషణ. అత్యంత వాడివేడిగా సాగిన మాటల సమరం ఓ దశలో పరస్పర హెచ్చరికల వరకూ వెళ్లింది. చైనాకు అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల అమ్మకంపై బైడెన్ ప్రభుత్వం నిషేధం విధించడాన్ని జిన్ పింగ్ తీవ్రంగా ఆక్షేపించారు. ఇది ఆర్థిక ముప్పును పెంచే విధానం అని మండిపడ్డారు. ఈ రంగంలో తమను అణచివేసేందుకు, హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తే సహించబోమని స్పష్టం చేశారు. తైవాన్ విషయంలో గీత దాటొద్దని హెచ్చరించారు. కాగా, జిన్ పింగ్ వ్యాఖ్యలకు బైడెన్ అంతే తీవ్రంగా స్పందించారు. ఆధునిక టెక్నాలజీ తమ భద్రతకు ముప్పుగా మారితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. తమ పౌరుల డేటా పరిరక్షణ అన్నిటికంటే ముఖ్యమని.. టిక్‌టాక్‌పై చర్యల విషయంలో వెనక్కుతగ్గేది లేదని ప్రకటించారు. మే 20న తైవాన్ అధ్యక్షుడి బాధ్యతల సందర్భంగా శాంతి-సుస్థిరతలను కాపాడాలని సూచించారు. అంతేగాక.. రష్యాకు చైనా సైనిక, పారిశ్రామిక సాయంపై బైడెన్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. డ్రాగన్ వైఖరి యావత్ యూరప్‌నకే ముప్పుగా పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	42.7	29.0
అనంతపురం	42.0	27.0
ఏలూరు	40.0	22.0
గుంటూరు	40.0	26.0

నేడు, రేపు పెరగనున్న వడగాల్పులు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎండతీవ్రతతో పాటు వడగాల్పులు మరింత పెరుగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం 130 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉండగా, మన్యం జిల్లా కొమరాడలో తీవ్ర వడగాల్పులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం 253 మండలాల్లో వడగాల్పులు, 5 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని పేర్కొంది. వివిధ జిల్లాల్లోని 59 మండలాల్లో వడగాల్పులు వీచగా, కడప జిల్లా వీరపునాయుని మండలంలో తీవ్ర వడగాల్పులు వీచాయి.

అక్షయ పాత్ర @ 400 కోట్ల భోజనాలు

ఐక్యరాజ్యసమితి, ఏప్రిల్ 3: అక్షయపాత్ర ఫౌండేషన్ మరో ఘనతను సాధించింది. 400 కోట్ల భోజనాలను అందించి చరిత్రాత్మక మైలురాయిని సాధించింది. ఇందుకు సంబంధించిన కార్యక్రమానికి న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వేదికగా మారింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత కమిషన్ 'ఆహార భద్రతలో విజయాలు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా భారత్ ముందడుగు' పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అక్షయ పాత్ర బృందాన్ని ప్రధాని మోదీ అభినందించారు.



అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెంలో బుధవారం ప్రజాగళం సభకు హాజరైన జనం



బతికేందుకు వైసీపీ నాయకులు ఇసుక తింటారంటూ ప్లకార్డును ప్రదర్శిస్తున్న చంద్రబాబు

ఎస్.. నేను పశుపతినే!

- రావులపాలెం, ద్రాక్షారామలో ప్రజాగళం సభలో బాబు

అమలాపురం/కాకినాడ-ఆంధ్రజ్యోతి/రావులపాలెం, ఏప్రిల్ 3: 'సీఎం జగన్ నిన్న నన్నో మాట అన్నారు. నన్ను పశుపతి అని సంబోధించారు. ఆ మాట విని నవ్వుకున్నాను. పశుపతి అంటే ప్రపంచాన్ని కాపాడే పరమశివుడు. గరళాన్ని గొంతులో పెట్టుకుని మానవాళిని కాపాడాడు. అందుకే నేను శివావతారం ఎత్తాను' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. బుధవారం సాయంత్రం కోనసీమ జిల్లాలోని కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలో, రాత్రికి రామచంద్రపురం ద్రాక్షారామలో జరిగిన ప్రజాగళం సభల్లో పాల్గొన్నారు. రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఎన్ని అవమానాలైనా భరిస్తానని చెప్పారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి ఒక్కడే బాగుంటే చాలు.. ఇంకా ఎవ్వరూ బాగుపడకూడదనేది ఆయన ఉద్దేశమని ఆక్షేపించారు. 2014లో తండ్రి మరణాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయం చేశాడని.. 2019లో బాబాయి హత్యను రాజకీయం చేశాడని.. ఇప్పుడేమో వృద్ధుల పేరుతో రాజకీయాలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. బాబాయిని హత్య చేసిన హంతకులెవరో చెప్పి జగన్ ఓట్లడగాలని డిమాండ్ చేశారు. గొడ్డలి గుర్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీచేయాలని ఎద్దేవాచేశారు. జగన్ చర్యలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయిందన్నారు. ఫేక్ ప్రచారాలతో రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాడని.. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇవ్వకుండా వేధిస్తున్నాడని విమర్శించారు. ఐదేళ్లలో ఎన్నో దాడులు, ఎన్నెన్నో దోపిడీలు చేశారని ధ్వజమెత్తారు. తనతో పాటు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై కూడా ఎన్నో ఆరోపణలు చేసి ఇబ్బందులకు గురిచేశారని.. అయినా తాము భయపడలేదని.. అరెస్టులకు కూడా సిద్ధపడ్డామని చెప్పారు.

తొలి సంతకం మెగా డీఎస్సీపైనే...

రాష్ట్రంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేని అసమర్థ సీఎం ఈ జగన్. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణపైనే. ఏడాదికి 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాది(జాబు రావాలంటే బాబు రావాలని జనం నినదించారు). నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తాం. రైతులను ఆదుకుంటాం. విద్యుత్ చార్జీలు పెంచం. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా వారికి ఒక్కొక్కరికి రూ.15 వేలు వంతున ఇస్తాం. మహిళలకు ఏడాది మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. ఈ 40 రోజులూ మీరు కష్టించాలి. 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలి. జగన్ జైలుకు పోతాడో.. ఆస్పత్రికి వెళ్తాడో ఇంకా తెలియదు. సైకో పోవాలని అందరూ అంటున్నారు. ఈ ఐదేళ్లలో ఎవరినీ ప్రశాంతంగా బతకనివ్వలేదు. నాకు గోదావరి జిల్లాలంటే ఇష్టం. ఈ ప్రాంతంలో రెడ్లు కూడా ఉన్నారు. వారు ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో పనులు చేశారు. వారెవరికైనా బిల్లులు వచ్చాయా? ఆక్వా రంగం కుదేలైంది. జగన్ విధానాలతో మేత, విద్యుత్ రేట్లు పెరిగాయి. మేమొచ్చాక ఈ రంగానికి రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తాం. నా బీసీలంటూ 30 పథకాలను నిలిపివేశారు. కోనసీమ జిల్లాలో అంబేడ్కర్‌కే అవమానం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై ఎన్నో దాడులు జరిగాయి. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తి ఎమ్మెల్సీ అనంతబాబు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఏమయ్యాయి? కాపులకు జగన్‌రెడ్డి ప్రభుత్వంలో తీరని అన్యాయం జరిగింది. వారి కోసం ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తానన్నాడు. చేశాడా? కనీసం పది కోట్లయినా ఇచ్చాడా? నేను అధికారంలో ఉన్నప్పుడు ఏడాదికి రూ.1,000 కోట్లు కేటాయించాను. కాపుల్లో పేద వర్గాలకు న్యాయం చేసింది మేమే. మాదిగలకు న్యాయం చేసేలా ఆ సామాజికవర్గానికి ఎమ్మెల్సీ ఇస్తాం. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి పొలిట్‌బ్యూరో పదవి ఇచ్చాం.

పిల్లల జీవితాలతో ఆటలు..

గంజాయి, డ్రగ్స్‌కు రాష్ట్రాన్ని బలిచేస్తారా? మన పిల్లల జీవితాలతో ఆటలు ఆడుకునే పరమదుర్మార్గులు వీరు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే పిల్లలు ఎవరి చెప్పు చేతల్లోనూ ఉండరన్నదే నా బాధ. రావులపాలెంలో ఎక్కడ చూసినా గంజాయి దొరుకుతోంది. ఈ వ్యాపారంలో కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాత్ర ఉంది. మేమొచ్చాక ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తా. మద్య నిషేధం చేస్తానని ఐదేళ్ల క్రితం హామీ ఇచ్చి జగన్ మహిళలను మోసం చేశాడు. నాణ్యత లేని మద్యం తెచ్చి ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నాడు. ప్రజాగళం సభలకు ఎక్కడ చూసినా మహా స్పందన. గెలుపు మనదే.. ఆకలి మీద సింహం వేట కోసం ఎలా వేచి చూస్తుందో నేడు ప్రభుత్వం మీద వ్యతిరేకతతో ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ ఒక జట్టుగా మీ ముందుకొచ్చాం. రాష్ట్రాన్ని దొంగలపరం చేస్తారో.. కాపాడుకుంటారో మీ ఇష్టం.

ఫ్యాన్ అరిగిపోయి.. తిరగడం మానేసింది

వైసీపీ ఫ్యాన్ అరిగిపోయింది.. తిరగడం మానేసింది. ముక్కలు ముక్కలు చేసి ప్రజలు దాన్ని చెత్త బుట్టలో పడేయడానికి సిద్ధంగా ఉన్నారు. జగన్ చరిత్ర తెలియని ఓ బచ్చా. ఆయనది ఫేక్ బతుకు. బాబాయిని హత్య చేసిందెవరో చెప్పి ఓట్లడగాలి. మద్యనిషేధం చేయకపోతే ఓట్లు అడగనని చెప్పి.. ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారు? జగన్ లిక్కర్ మాఫియా డాన్, ఇసుక మాఫియా డాన్. అధికారంలోకి వచ్చాక అన్నీ కక్కిస్తాం. మాట్లాడితే బటన్ నొక్కుతున్నా అంటున్నాడు. ప్రధాని మోదీ కూడా బటన్ నొక్కుతున్నారు. అప్పులు తెచ్చి పంచా పంచా అంటున్నావు. ఏం పంచావు? ఇప్పుడు పంచె కూడా ఉండదు. కర్నూలులో అయితే అక్కడి జనం వారానికోసారి స్నానాలు చేస్తున్నారు. పెళ్లిళ్లు వాయిదా పడుతున్నాయి. మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు లేవు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో జగన్‌కు భయం పట్టుకుంది. రోజూ మమ్మల్ని తల్చుకుని భయపడుతున్నాడు. ప్రతి ఒక్కరూ ఎన్నికలయ్యే వరకు సైకిల్ ఎక్కండి. గ్లాసు పట్టుకోండి. కమలం గుర్తును వాహనాలకు కట్టుకోండి. వైసీపీని బంగాళాఖాతంలో కలపాలి.

నేడు కొవ్వూరు, నల్లజర్లల్లో సభలు

చంద్రబాబు గురువారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు కొవ్వూరులో, 6 గంటలకు గోపాలపురం నియోజకవర్గ పరిధి నల్లజర్లలో జరిగే ప్రజాగళం సభల్లో పాల్గొంటారు.

తైవాన్‌లో భారీ భూకంపం

తొమ్మిది మంది దుర్మరణం.. 821 మందికి గాయాలు



తైపీ, ఏప్రిల్ 3: ద్వీపదేశం తైవాన్‌ను భారీ భూకంపం అతలాకుతలం చేసింది. తైవాన్ కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8 గంటలకు సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.2గా నమోదైంది. 1999 తర్వాత ఇదే అతిపెద్ద భూకంపం అని తైవాన్ వాతావరణ శాఖ తెలిపింది. హువాలియన్ తీరంలో తీవ్ర నష్టం సంభవించిందని.. తొమ్మిది మంది చనిపోగా, 821 మంది గాయపడ్డారని, మరో 127 మంది శిథిలాల కింద చిక్కుకున్నారని వివరించింది. భూకంపం కారణంగా తైవాన్ తూర్పు జిల్లాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి. కొండచరియలు విరిగిపడి ఏకంగా ఓ భారీ బ్రిడ్జి కూలిపోయింది. ఓ వంతెనపై భారీగా వాహనాలు నిలిచిపోవడం.. ఆ బ్రిడ్జ్ ఊగుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. హువాలియన్ నగరంలో 26 ఇళ్లు కూలిపోయాయని, రెండు భవనాలు పక్కకు ఒరిగిపోయాయని తైవాన్ అగ్నిమాపక శాఖ వెల్లడించింది. "మృతుల్లో కాలినడకన వెళ్తున్న వారు ముగ్గురు ఉన్నారు. మరో ఇద్దరు రోడ్డు టన్నెల్స్ పెచ్చులు కూలి చనిపోయారు. టారోకో నేషనల్ పార్క్ వద్ద ముగ్గురు పర్యాటకులు, పార్క్‌కు చెందిన ఓ వ్యాన్ డ్రైవర్ ఉన్నారు" అని పేర్కొంది. తూర్పు జిల్లాల్లో భూకంప తీవ్రత 7.2గా ఉండగా.. భూకంప కేంద్రం (హువాలియన్ కౌంటీ) వద్ద 6గా నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది. తైవాన్ వ్యాప్తంగా భూమి కంపించిందని తెలిపింది. దేశవ్యాప్తంగా రైళ్ల సేవలను నిలిపివేశామని, సబ్‌వేలను మూసివేశామని వెల్లడించింది. భూగర్భంలో 15.5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రకం ఉందని, దీని ప్రభావం పొరుగు దీవుల్లోనూ కనిపించిందని తైవాన్ భూకంప కేంద్రం డైరెక్టర్ వూచియెన్‌ఫూ వెల్లడించారు. కాగా.. ఈ భూకంప తీవ్రత 7.4గా ఉన్నట్లు అమెరికా జియలాజికల్ సర్వే అధికారులు ప్రకటించారు.

భూకంప ప్రమాదం ఎక్కువ

తైవాన్‌కు భూకంప ప్రమాదం ఎక్కువ అని నిపుణులు తెలిపారు. హువాలియన్-హువాడాంగ్ రిఫ్ట్‌వ్యాలీ మధ్య భూకంపాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇందుక్కారణం.. యురేషిన్ ఫలకం, ఫిలిప్పైన్స్ ఫలకంలో కదలికలని పేర్కొన్నారు. ఫిలిప్పైన్స్ ఫలకం వాయవ్యం వైపు ఏడాదికి 8 సెంటీమీటర్ల చొప్పున కదులుతూ.. యురేషియన్ ప్లేట్‌లో కలుస్తుందని వివరించారు. ఈ కారణాల వల్లే తైవాన్ వ్యాప్తంగా స్కూలు విద్యార్థులకు భూకంపాలపై అవగాహన ఉంటుంది. స్కూళ్లలో పసుపు రంగు హెల్మెట్లు అందుబాటులో ఉంటాయి. బుధవారం ఉదయం కూడా భూమి కంపించగానే.. తైవాన్ వ్యాప్తంగా స్కూళ్లలో ఉన్న విద్యార్థులు.. పసుపురంగు హెల్మెట్లు ధరించి, బయటకు పరుగులు తీశారు.

ఏ చట్ట ప్రకారం ప్రైవేటీకరిస్తున్నారు?

- విశాఖ ఉక్కుపై కేంద్రానికి హైకోర్టు ప్రశ్న

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఏ చట్టం కింద చేస్తున్నారో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రైవేటీకరణ నిర్ణయానికి ముందు కర్మాగారం ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర స్టేక్ హోల్డర్స్‌ను సంప్రదించారా అని ప్రశ్నించింది. ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం వివిధ వర్గాల నుంచి సేకరించిన భూముల విక్రయం, తదితర విషయాలపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉక్కు కర్మాగారానికి అవసరమైన నిధులను విదేశాల నుంచి తెచ్చేందుకు, ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్ట్ కింద ప్రత్యేక ఖాతా తెరిచేందుకు అనుమతించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఇచ్చిన వినతిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఆర్ఐఎన్ఎల్ ప్రైవేటీకరణకు బదులు ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర సీఎం రాసిన లేఖపై ఏ నిర్ణయం తీసుకున్నారని ఆరా తీసింది. లేఖపై స్పందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. కేంద్రం వేసిన కౌంటర్‌లో సీఎం లేఖను ప్రస్తావించకపోవడాన్ని ఆక్షేపించింది. తమ సొంత నిధులతో కొనుగోలు చేసిన 25 ఎకరాల భూమిని మాత్రమే విక్రయిస్తామని ఆర్ఐఎన్ఎల్ చెప్పిన వివరాలను నమోదు చేసింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది.

రూ.8 వేల కోట్ల నిధులు తెస్తా: పాల్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.లక్ష్మీనారాయణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇదే వ్యవహారంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో పాటు సువర్ణరాజు అనే వ్యక్తి వేర్వేరుగా పిల్స్ వేశారు. పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ వాదనలు వినిపించారు. కేంద్రం అనుమతిస్తే విదేశాల నుంచి రూ.8 వేల కోట్లు తెప్పిస్తానన్నారు. యథాతథ స్థితి పాటించేలా ఆదేశాలివ్వాలని కోరారు. మరో పిటిషనర్ తరఫు న్యాయవాది యలమంజుల బాలాజీ వాదనలు వినిపిస్తూ... కర్మాగారం ప్రైవేటీకరణ విషయంలో ప్రభుత్వాలు తమ వైఖరిని తెలుపుతూ కౌంటర్లు వేశాయన్నారు. ధర్మాసనం కలగజేసుకుంటూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాలు ఏమైనా సూచించిందా? అని ప్రశ్నించింది. ప్రైవేటీకరణకు బదులు ప్రత్యామ్నాయాలు సూచిస్తూ సీఎం కేంద్రానికి లేఖ రాశారన్నారు. ఆర్ఐఎన్ఎల్ తరఫున న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ స్పందిస్తూ... పెట్టుబడులు ఉపసంహరణ పూర్తిగా కేంద్రం పరిధిలోని వ్యవహారం అన్నారు. న్యాయవాది వై.కోటేశ్వరరావు స్పందిస్తూ... భూముల అమ్మకాన్ని అడ్డుకోవాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది సీవీఆర్ రుద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లది కేవలం ఆందోళనేనన్నారు.



ప్రమాదం జరిగిన ఎస్‌బీ ఆర్గానిక్స్

తెలంగాణలోని బల్క్‌డ్రగ్స్ పరిశ్రమలో భారీ పేలుడు

- ఎస్‌బీ ఆర్గానిక్స్ డైరెక్టర్ సహా.. ఐదుగురి దుర్మరణం

హత్నూర, ఏప్రిల్ 3: బల్క్ డ్రగ్స్ పరిశ్రమలో రియాక్టర్లు పేలిన ఘటనలో ఐదుగురు దుర్మరణం పాలవ్వగా.. 20 మంది కార్మికులు తీవ్ర గాయాలపాయ్యారు. ఈ ఘటన తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో చోటుచేసుకుంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో బుధవారం సాయంత్రం రియాక్టర్లు ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయాయి. చూస్తుండగానే మంటలు వ్యాపించి.. దట్టమైన పొగ అలుముకుంది. ఈ ఘటనలో పరిశ్రమ డైరెక్టర్, వ్యవస్థాపక యజమానుల్లో ఒకరైన రవికుమార్(45), ప్రొడక్షన్ ఇన్‌చార్జులు సుబ్రమణ్యం(38), దయానంద్(46), మెయింటెనెన్స్ మేనేజర్ సురేశ్‌పాల్(45), చాకలి సురేశ్(35) అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు కార్మికులు కూడా మృతిచెంది ఉంటారని అగ్నిమాపక సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. 20 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న సీజే ఠాకూర్ దంపతులు

ఘనంగా జస్టిస్ గోపాలకృష్ణారావు కుమారుడి వివాహం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు, సౌజన్య దంపతుల కుమారుడు రఘునాథ్ వివాహం బుధవారం విజయవాడలోని ఎ.కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దంపతులు వివాహానికి హాజరై నూతన వధువరులు శ్రావణి, రఘునాథ్‌లను ఆశీర్వదించారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తులు కుటుంబ సమేతంగా పెళ్లి వేడుకకు హాజరైన నూతన వధువరులను ఆశీర్వదించారు.

లీజుకు స్టీల్‌ప్లాంటు గెస్ట్‌హౌస్‌లు!

- ఉక్కు హౌస్, గంగవరం గెస్ట్‌హౌస్‌లను 30 ఏళ్ల లీజుకివ్వడానికి నోటిఫికేషన్ జారీ
- నిధుల కోసం ఆస్తుల అప్పగింతకు సిద్ధం
- యాజమాన్యం చర్యలపై కార్మికుల్లో ఆగ్రహం
- ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు
- జీతాల కోసం 16 వేల మంది ఎదురుచూపులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటుపై బీజేపీ నాయకులు చెబుతున్న మాటలకు, సంస్థ యాజమాన్యం చేతలకు పొంతన కుదరడం లేదు. తాజాగా ఉక్కు హౌస్ (116 గదులతో కూడిన హోటల్ అండ్ రెస్టారెంట్), గంగవరం గెస్ట్‌హౌస్‌లను దీర్ఘకాలిక లీజుకు ఇస్తామని, ఆసక్తి కలిగినవారు ముందుకు రావాలంటూ స్టీల్‌ప్లాంటు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంటు నిలదొక్కుకునేలా చేయడానికి అవసరమైన


ఉక్కు హౌస్

సాయం చేస్తున్నామని, ప్రస్తుతం ప్రైవేటీకరణ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లడం లేదని బీజేపీ నేతలు పదేపదే చెబుతున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ముడిపదార్థాల కొరతతో 18నెలలు మూతపడిన బ్లాస్ట్ ఫర్నేస్-3ను జిందాల్ కంపెనీకి కట్టబెట్టారు. కేవలం ముడిసరుకు సరఫరా చేయడానికి ముందుకొచ్చిందని ఆ సంస్థతో ఎంవోయూ చేసుకున్నారు. తర్వాత హెచ్‌బీ కాలనీలో ఉద్యోగుల క్వార్టర్లను కూలగొట్టి ఆ భూములను వేలం వేశారు. తొలి విడతలో రూ.250కోట్లకు పైగానే సమకూరింది. ఇవన్నీ చేయక ముందు అంటే రెండు బ్లాస్ట్ ఫర్నేసులతో ప్లాంటు నడిచినప్పుడు ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీకి ముందే జీతాలు ఇచ్చేవారు. కానీ జిందాల్ సాయం చేసిన తరువాత పరిస్థితి దిగజారింది. గతనెలలో అధికారులకు 14న జీతాలు ఇచ్చారు. 20వ తేదీ తరువాత పెన్షన్లు జమ చేశారు. ఈ నెల ఇప్పటివరకు 16వేల మందిలో ఒక్కరికి కూడా జీతం ఇవ్వలేదు. నిధులు లేవని, స్టీల్‌ని అమ్మితే, ఆ డబ్బులు వస్తే అప్పుడు జీతాలు ఇస్తామని చెబుతున్నారు. ప్లాంటును పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా ప్రస్తుత యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు తెర వెనుక ఢిల్లీ పెద్దలు సహకరిస్తున్నారు.

ఇదేం దుస్థితి?

విశాఖ స్టీల్‌ప్లాంటుకు నిత్యం దేశ, విదేశాల నుంచి అధికారులు వస్తుంటారు. అలాగే ఉక్కు టౌన్‌షిప్‌లోని ఉద్యోగుల కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి. వీరందరి సౌలభ్యం కోసం 'ఉక్కు హౌస్' పేరుతో పెద్ద హోటల్, రెస్టారెంట్లు కొన్ని దశాబ్దాలుగా నడుపుతున్నారు. ఇప్పటివరకు యాజమాన్యమే దీనిని నిర్వహిస్తోంది. ఇందులో 116 రూమ్‌లు, బ్యాంకెట్ హాళ్లు, రెస్టారెంట్, కిచెన్ ఉన్నాయి. ఇదికాకుండా గంగవరం సముద్ర తీరాన కొండపై ఒక గెస్ట్‌హౌస్ నిర్మించారు. కేంద్ర మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు వస్తే అక్కడ బస చేస్తారు. అందులో ఐదు సూట్‌లు ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండింటినీ దీర్ఘకాలికంగా అంటే 30ఏళ్ల లీజుకు ఇచ్చేస్తామని స్టీల్‌ప్లాంటు ప్రకటన జారీ చేసింది. హోటల్ యాజమాన్యాలు, ఆసక్తి కలిగినవారు ఎవరైనా వస్తే వాటిని ఉన్నపళంగా ఫర్నీచర్‌తో సహా లీజుకు ఇస్తామని పేర్కొంది. స్టీల్‌ప్లాంటు పరిసరాల్లో ఎన్‌టీపీసీ విద్యుత్ కర్మాగారం, ఏపీ మెడ్‌టెక్ జోన్, రాంకీ ఫార్మాసిటీ వంటి పరిశ్రమలతో పాటు యారాడ, గంగవరం, అప్పికొండ బీచ్‌లు ఉన్నాయి. ఈ ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు ఉక్కు హౌస్, గంగవరం గెస్ట్‌హౌస్‌లు బాగా ఉపయోగపడతాయి. నిజంగా మంచి ఆదాయం ఇచ్చేవారికి వీటికి కట్టబెడతారా?... అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టీల్‌ప్లాంటును కేంద్రానికి సన్నిహితులైన కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు. ఇప్పుడు ఈ గెస్ట్‌హౌస్‌లను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు కావాల్సినవారికి ఇచ్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటాలు వేసుకొని స్టీల్‌ప్లాంటు ఆస్తులు చేజిక్కించుకుంటున్నాయనడానికి ఈ ఘటనలే నిదర్శనమని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి.

తంటాలు పడి తరలించినా.. టాటా!

జగన్ రాకముందే కొందరు.. వచ్చాక ఇంకొందరు..
మాట్లాడుతుండగా పూర్తిగా వెళ్లిపోయిన ప్రజలు

- పూతలపట్టు సభ కోసం 1500 బస్సులు
- మధ్యాహ్నం 3.30 గంటలకని 5.30కు సభ
- అంతవరకు అల్లాడిన కార్యకర్తలు, జనం
- ఎండదెబ్బకు బస్సు కూడా దిగని మహిళలు
- వేడెక్కిన వాటర్ ప్యాకెట్లను ముట్టుకోలేకపోయిన వైనం
- రోడ్‌షో పేరిట బస్సులో నుంచే అభివాదం
- రోడ్‌షో జరిగిన ప్రాంతాల్లో చెట్ల నరికివేత
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు


సీఎం మాట్లాడుతుండగా ఖాళీ అయిన గ్యాలరీ

చిత్తూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తన బలం నిరూపించుకునేందుకు వైసీపీ నానా తంటాలు పడినా ఫలించలేదు. ఏకంగా వెయ్యికిపైగా ఆర్టీసీ బస్సులు, వందల సంఖ్యలో ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు, జీపులు, కార్లలో జనాల్ని పెద్దఎత్తున తరలించారు. స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడి మేరకు బస్సుల్లో జనాలు వచ్చినా సీఎం జగన్ బహిరంగ సభ ప్రాంగణానికి వెళ్లలేదు. వెళ్లిన వారిలోనూ చాలామంది జగన్ ప్రసంగానికి ముందే వెనుతిరిగారు. ఇక జగన్ ప్రసంగించే సమయంలో ప్రాంగణమంతా ఖాళీ అయిపోయింది. చిత్తూరు జిల్లా పూతలపట్టులో జరిగిన 'మేమంతా సిద్ధం' ఎన్నికల ప్రచార బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. చిత్తూరు నగరంలోని పలు నర్సింగ్, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థుల్ని కూడా బస్సుల్లో తరలించారు. వారితో జగన్ ప్లకార్డులను పట్టించి నినాదాలు చేయించారు.

మండుటెండ.. వేడి వేడి వాటర్ ప్యాకెట్లు..

షెడ్యూల్ మేరకు పూతలపట్టు మండలం మూర్తిగారిపూరు సమీపంలోని బహిరంగ సభ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించాల్సి ఉంది. జగన్ సభా ప్రాంగణానికి సుమారు 5.45 గంటలకు చేరుకున్నారు. దీంతో సభా ప్రాంగణం వద్ద ప్రజలు సుమారు ఆరు గంటలు వేచి చూశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మహిళలు బస్సుల్లో నుంచి కిందికి కూడా దిగలేదు. వచ్చిన బస్సులో నుంచి కిందికి దిగకుండా అలాగే మళ్లీ వెనక్కి వెళ్లిపోయారు.

బస్సు దిగని సీఎం

చిత్తూరు జిల్లాలో బుధవారం జరిగిన బస్సు యాత్రలో సీఎం జగన్ బహిరంగ సభ వద్ద తప్ప.. ఎక్కడా బస్సులో నుంచి దిగలేదు. బస్సులో నుంచే అభివాదం చేసుకుంటూ వెళ్లారు. మార్గమధ్యంలో బస్సుపైకి ఎక్కి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించలేదు. బస్సులో నుంచి బయటికి రాకపోవడంతో ప్రజల్లో, వైసీపీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఇదిలాఉండగా, ఆయన ప్రయాణించే ప్రాంతాల్లో చెట్లను తొలగించేశారు. సదుం మండలంలో భారీ చెట్ల కొమ్మలు కత్తిరించారు. సదుం- కల్లూరు ప్రధాన రహదారిలో తాతల నాటి చింత చెట్టు కొమ్మలూ పూర్తిగా తొలగించారు. సదుం- సోమల రహదారిలో జాండ్రపేట వద్ద చెట్ల కొమ్మలు తీసేశారు.

4 గంటలు హైవే స్తంభన

మంత్రి పెద్దిరెడ్డి సొంతూరు సదుం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర రోడ్ షో పూతలపట్టు మండలం తేనెపల్లె టోల్ గేట్ వద్ద భోజన విరామానికి ఆగింది. రోడ్ షో అంతా చిత్తూరు-పీలేరు నేషనల్ హైవే మీద సాగడంతో పోలీసులు ఆ మార్గాన్ని పూర్తిగా క్లోజ్ చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రంగంపేట క్రాస్ వద్ద వాహనాలను పీలేరు వైపు వెళ్లకుండా ఆపేశారు. జగన్ కాన్వాయ్ 5.30 గంటలకు బహిరంగ సభకు బయల్దేరాక వాహనాలను అనుమతించారు. సుమారు నాలుగు గంటల పాటు వాహనదారులు ఎండలో ఇబ్బందులు పడ్డారు.

బాబు వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయించారట!

- పూతలపట్టు సభలో సీఎం జగన్ అబద్ధాలు
- పవన్ సరిపోడని మోదీని తెచ్చుకున్నారు
- చంద్రబాబును చంద్రముఖి పెట్టెలో బంధించాలి

పూతలపట్టు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పూతలపట్టులో జరిగిన 'మేమంతా సిద్ధం' సభలో సీఎం జగన్ కళ్లు ఆర్పకుండా అబద్ధాలు వల్లించారు. చంద్రబాబు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయించారని వ్యాఖ్యానించారు. నిజానికి, వలంటీర్లు వైసీపీ ప్రచారాల్లో నేరుగా పాల్గొంటూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. దీనిపై టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం, ఎన్నికలసంఘం పెన్షన్లు, రేషన్ పంపిణీలో వలంటీర్లను దూరం పెట్టాలని ఆదేశించడం తెలిసిందే. దీన్ని అదునుగా చేసుకుని వైసీపీ రాజకీయం చేస్తోంది. తాజాగా జగన్ మరో నాటకానికి తెర తీశారు. అసలు వలంటీర్ల వ్యవస్థ రద్దు కాకున్నా, చంద్రబాబు ఆ వ్యవస్థను రద్దు చేశారని అబద్ధాలు చెప్పారు. మళ్లీ వైసీపీ వస్తే వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలను ఇంటికి అందిస్తానన్నారు. చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో పవన్ కల్యాణ్ మద్దతు సరిపోక మోదీని కూడా తెచ్చుకున్నారన్నారు. చంద్రబాబును చంద్రముఖిలా పెట్టెలో పెట్టి బంధించి తాళం వేయాలన్నారు.


కల్లూరు వద్ద చిత్తూరు- పీలేరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

6 కిలోమీటర్లు... 35 నిమిషాలు

- మండుటెండలో ప్రయాణికులు, జనాలకు నరకం

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆరు కిలోమీటర్ల స్వల్ప దూరాన్ని దాటడానికి అరగంటకుపైగా సమయం తీసుకున్న సీఎం జగన్ బస్సుయాత్ర తీరుతో సామాన్య జనం, ప్రయాణికులు గంటల కొద్దీ నరకం చవిచూశారు. చిత్తూరు జిల్లాలో బుధవారం పుంగనూరు నియోజకవర్గం నుంచి పూతలపట్టు నియోజకవర్గానికి వెళ్లే క్రమంలో మార్గ మధ్యంలో ఆరు కిలోమీటర్ల దూరం తిరుపతి జిల్లా మీదుగా బస్సు యాత్ర సాగింది. పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సదుం మండలం అమ్మగారిపల్లి నుంచి పూతలపట్టుకు వెళ్లడానికి చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పదిపుట్లవారిబైలు గ్రామం వద్ద తిరుపతి జిల్లాలో ప్రవేశించాలి. షెడ్యూలు ప్రకారం ఉదయం 10.30 గంటలకు బస్సు యాత్ర ఇక్కడకు చేరుకోవాలి. అయితే, జగన్ మధ్యాహ్నం 1.45 గంటలకు వచ్చారు. అక్కడనుంచి ఆరు కిలోమీటర్లు ప్రయాణించి అదే మండలం పత్తిపాటివారిపల్లి వద్ద జిల్లా దాటి తిరిగి చిత్తూరు జిల్లాలో ప్రవేశించాలి. ఈ దూరాన్ని అధిగవించడానికి ఆయనకు 35 నిమిషాలు పట్టింది. 2.20గంటలకు సీఎం బస్సు జిల్లా దాటిన తర్వాత ట్రాఫిక్ పునరుద్ధరణకు మరో గంట పట్టింది. అయితే, సీఎంకు పోలీసులు బందోబస్తు పేరిట అతికి పోయి ఉదయం 11 గంటల నుంచే చిత్తూరు-కడప జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. ఈ మార్గంలో కల్లూరు వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేసే పుంగనూరు-తిరుపతి ప్రధాన రహదారిలో కూడా వాహనాల రాకపోకలను ఆపేశారు. దీంతో సుమారు నాలుగున్నర గంటల పాటు కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగిపోయి ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వేసవిలో మధ్యాహ్నం గంటలకొద్దీ ఎండకు, ఉక్కపోతకు నానా అగచాట్లు పడ్డారు. మరోవైపు ఇదే పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుంచే మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సీఎం బస్సు ప్రయాణించే మార్గంలో పలుచోట్ల విద్యుత్ తీగలు రోడ్డును క్రాస్ చేస్తున్న కారణంగా ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో రోడ్డుపై చిక్కుకుపోయిన ప్రయాణికులతోపాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పదిపుట్ల బైలు, పేరసానిపల్లి, గుండ్లగుట్టపల్లి, దామలచెరువు, పత్తిపాటివారిపల్లి తదితర గ్రామాల ప్రజలు ఐదున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా లేక అసౌకర్యానికి లోనయ్యారు. ఆ మార్గంలోని ప్రభుత్వ స్కూళ్లను మధ్యాహ్నం 12.30 గంటలకు మూయాల్సి ఉండగా 11 గంటలకే పిల్లలను పంపించేశారు.

డబ్బు, మద్యం పంపిణీ

జగన్ సభకు ప్రజలను తరలించడానికి వైసీపీ నాయకులు డబ్బుల వరద పారించారు. వార్డుల్లో, గ్రామాల్లో స్థానిక నాయకులకు లక్షలు పెట్టి మరీ జనాల్ని తరలించారు. ఒక్కో వార్డుకు, ఒక్కో పంచాయతీకి రూ.లక్ష వరకు చెల్లించి జనాల్ని తరలించినట్లు తెలుస్తోంది. హాజరైన ప్రతి వ్యక్తికి రూ.300తో పాటు బిర్యానీ, బగారా రైస్, మద్యం అందించారు. మరోవైపు కనీసం తాగేందుకు మంచి నీళ్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు వైసీపీ నాయకుల్ని తిట్టుపోశారు.

పాత తేదీలతో పట్టాలివ్వండి!

- ఎన్నికల ప్రచారంలో వైసీపీ ఎమ్మెల్యే కొడాలి హైడ్రామా
- ఇన్నాళ్లూ పట్టాలు ఎందుకివ్వలేదని జనం నిలదీయడంతో ఆర్డీవోకు నాని ఫోన్.. జనం మధ్యలో స్పీకర్ ఆన్ చేసి ఆదేశాలు
- కోడ్ కారణంగా కుదరదన్న ఆర్డీవో


ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, నిలదీస్తున్న గుడ్‌మెన్‌పేట మహిళలు

గుడివాడ, ఏప్రిల్ 3 : నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలిచ్చామని, ఇవ్వలేదని ప్రతిపక్షాలు నిరూపించినా, ఏ ఒక్క లబ్ధిదారు అడిగినా తాను ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్యే కొడాలి నాని బీరాలు పలికారు. అయితే ఆయన సవాల్ విసిరి 48 గంటలు గడవకముందే నియోజకవర్గ ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. దానిని కప్పిపుచ్చుకునేందుకు పాత తేదీలతో పట్టాలు ఇవ్వాలని ఆర్డీవోకు ఫోన్‌లో స్పీకర్ ఆన్ చేసి మాట్లాడుతూ దొరికిపోయిన వీడియో హల్‌చల్ చేస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక గుడ్‌మెన్‌పేటలో మంగళవారం రాత్రి పర్యటించిన కొడాలి నానికి నిరసన ఎదురైంది. ఇళ్ల పట్టాల కోసం రెవెన్యూ కార్యాలయాలు, వైసీపీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నామని స్థానిక మహిళలు నిలదీశారు. తమకు అర్హత ఉన్నా ఇళ్ల పట్టాలు ఎందుకి వ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొడాలి నీళ్లు నమిలారు. వెంటనే ఆర్డీవో పద్మావతికి ఫోన్ చేసి స్పీకర్ ఆన్ చేసి ఇళ్ల పట్టాలు, లేఅవుట్ చేయకపోవడంపై ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఆర్డీవో సమాధానమిచ్చారు. పాత తేదీలు వేసి వెంటనే పట్టాలను పంపిణీ చేయాలని కొడాలి హుకుం జారీ చేశారు. దాంతో ఆర్డీవో సమాధానం చెప్పటేక వాట్సాప్ కాల్‌లో మాట్లాడతానని కాల్ కట్‌చేసి తప్పించుకున్నారు. తదనంతరం కొడాలి మహిళలతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో అందరికీ పట్టాలు వచ్చేలా చూస్తానని హామీ యిచ్చారు. అయినా సంతృప్తి చెందని స్థానిక మహిళలు ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని గట్టిగా నిలదీశారు. దాంతో కొడాలి అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధిం

ముగిసిన మూడు రాజధానుల డ్రామా

- తెరవెనుక సూత్రదారులకుప్రధాన పాత్రధారి ఝలక్
- లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన గురునాథం
- అమరావతి రైతులకే మద్దతు అని ప్రకటన


లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన గురునాథం

గుంటూరు, విజయవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): "అమరావతి వద్దు.. మూడు రాజధానులు ముద్దు" అంటూ సుమారు 1300 రోజులుగా నిర్వహిస్తున్న శిబిరం ఎట్టకేలకు మూతపడింది. తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు తెరవెనుక ఉండి ఇంతకాలం నడిపించిన మూడు రాజధానుల డ్రామా అనూహ్యంగా ముగిసింది. ఇప్పటివరకు కిరాయి వ్యక్తుల ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నడిపించిన బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు మాదిగాని గురునాథం హఠాత్తుగా పార్టీ ఫిరాయించడంతో మూడు రాజధానుల నినాదం మూగబోయింది. విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో బుధవారం చంద్రబాబు నివాసంలో నారా లోకేశ్‌ను కలిసిన గురునాథం టీడీపీ కండువా కప్పుకొన్నారు. అమరావతి రైతుల పోరాటాన్ని నీరుగార్చేందుకు జగన్ మూడు రాజధానుల నాటకాన్ని తెరపైకి తెచ్చారు. మందడం సమీపంలోని తాళ్లాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో 2020 ఫిబ్రవరి 9న మూడు రాజధానుల శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి గురునాథం నాయకత్వం వహించారు. టీడీపీలో చేరిన సందర్భంగా గురునాథం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మూడు రాజధానుల మాటలు నమ్మి తాము మోసపోయామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాజధాని అమరావతిలో పేదలకు పూర్తి న్యాయం చేసే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని చంద్రబాబు తనకు హామీ ఇవ్వడంతో పార్టీలో చేరినట్లు గురునాథం తెలిపారు. అమరావతి రాజధాని రైతులకు మద్దతు పలుకుతున్నట్లు వెల్లడించారు. బహుజన రాజకీయ యాత్ర చేపట్టి జగన్ రాజకోట రహస్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కాగా.. అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. బుచ్చెయ్యపేట మండలానికి చెందిన సుమారు వెయ్యి మందికిపైగా నాయకులు, కార్యకర్తలు బుధవారం టీడీపీలో చేరారు.

15 నుంచి చేపల వేట నిషేధం.. జూన్ 14 వరకు అమలు

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటపై మత్స్యశాఖ తాత్కాలిక నిషేధం విధించనుంది. ఇది ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు మొత్తం 61 రోజులు అమలులో ఉంటుంది. చేపలు, రొయ్యల సంతానోత్పత్తి సమయం కావడంతో వాటిని రక్షించడానికి, సముద్ర ఉత్పత్తులు పెరగడానికి వేటపై నిషేధం విధించడం ఆనవాయితీగా వస్తోంది. ఇది తూర్పుతీరంలో ఏప్రిల్ 15వ తేదీ నుంచి, పశ్చిమ తీరంలో జూన్ ఒకటో తేదీ నుంచి కేంద్రం అమలు చేస్తోంది.

పిలిస్తే ప్రచారానికి వస్తా: జయప్రద



తిరుమల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'నాకు పవన్ కల్యాణ్, బాలయ్య అంటే చాలా ఇష్టం. అలాగే చంద్రబాబు అంటే ప్రత్యేకమైన గౌరవం. వారు పిలిస్తే తప్పకుండా ఎన్నికల ప్రచారానికి వస్తా' అని ప్రముఖ నటి, బీజేపీ నాయకురాలు జయప్రద తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని ఆమె బుధవారం దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అవకాశం ఇస్తే ఏపీ నుంచి పోటీ చేసి ప్రజలకు సేవ చేయాలనుందని తెలిపారు. ఇక్కడ టికెట్ ఇవ్వలేదంటే అధిష్ఠానానికి ఇంతకంటే మంచి ఆలోచన ఉండి ఉండవచ్చన్నారు.

విజయమ్మ ఎవరి వైపు..?

- కూతురు షర్మిల వైపా.. మరిదిని చంపిన అవినాశ్ వైపా..?
- ప్రశ్నించిన టీడీపీ పులివెందుల అభ్యర్థి బీటెక్ రవి

కడప, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి విజయమ్మ ఎవరి వైపు..? కొడుకు జగన్ వైపా, కూతురు షర్మిల వైపా, లేదంటే వివేకాను చంపిన అవినాశ్‌రెడ్డి వైపా..? చెప్పాలని పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి డిమాండ్ చేశారు. "కడప ఎంపీ టికెట్ కోసమే వివేకా హత్య జరిగిందని షర్మిల స్పష్టంగా చెప్పారు. చిన్నాన్నను చంపిన వారిని పోటీ పెట్టినప్పుడు తాను పోటీ చేయాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకే ఇక్కడి నుంచి పోటీ చేస్తానని క్లారిటీ ఇచ్చారు. విజయమ్మను సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్నా.. మీ ఇద్దరు బిడ్డలు మేనిఫెస్టో, అభ్యర్థుల జాబితా విడుదల చేసినప్పుడు వైఎస్ సమాధి వద్దకు వెళ్లారు కదా.. నీబిడ్డ అని చెప్పుకొనే జగన్... రాజశేఖరరెడ్డి బిడ్డ షర్మిల పోటీ చేస్తున్నారు.. వైఎస్‌కు ఆత్మ ఉంటే తన కూతురు వైపు నిలబడతాడా నిలబడరా..? తమ్ముడు వివేకాను చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని తన కూతురుపై పోటీకి నిలబెడితే వైఎస్ ఆత్మ ఎంత క్షోభిస్తుందో పులివెందుల ప్రజలు, రాష్ట్ర ప్రజలు ఆలోచించాలి" అన్నారు. "విజయమ్మ..మీరు కూతురు షర్మిల వైపు ఉంటారా, లేదా మీ కొడుకు, కోడలు మాటలు విని మీ మరిదిని చంపిన అవినాశ్ వైపు ఉంటారా..? ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. కనీసం పులివెందుల వాసులకైనా తెలపాలి" అని కోరారు.

క్వార్ట్జ్‌లో కొల్లగొట్టారు!

- వైసీపీ నేతల దోపిడీ విలువ 350 కోట్లకు పైమాటే
- అరుదైన ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించారు
- లక్షన్నర టన్నుల వరకూ విదేశాలకు ఎగుమతులు
- మైనింగ్ అధికారుల తనిఖీల్లో విస్తుగొలిపే నిజాలు
- టన్నుకు రూ.661 చొప్పున 10 కోట్ల పెనాల్టీ విధింపు
- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కొనసాగుతున్న తనిఖీలు

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అరుదైన ఖనిజం క్వార్ట్జ్‌ను వైసీపీ నాయకులు అడ్డంగా కొల్లగొట్టిన వైనం బట్టబయలైంది. మొన్నటివరకూ ప్రభుత్వ పెద్దల భయానికి అక్రమ మైనింగ్ వైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహసించని మైనింగ్ అధికారులు, కేంద్రం ఆదేశాలతో ఇప్పుడు కదిలారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తూ జరిగిన దోపిడీని కొలతలు వేసి తేలుస్తున్నారు. ఇప్పటివరకూ దాదాపు లక్షన్నర టన్నుల వరకు క్వార్ట్జ్, ఫెల్‌స్పార్ ఖనిజాలను అక్రమంగా తవ్వి తరలించినట్లు నిర్ధారించారు. ఇప్పటివరకు తరలిపోయిన ఖనిజం విలువ బహిరంగ మార్కెట్లో రూ.350 కోట్ల పైమాటే అని అంచనా వేస్తున్నారు. ఇందులో వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు వాటాలు అందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. అవి మొత్తం పూర్తయితే ఇంకెంత దోపిడీ బట్టబయలవుతుందో చూడాలి.

ఇష్టానుసారంగా తవ్వకాలు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పొదలకూరు, సైదాపురం, రాపూరు, గూడూరు రూరల్ మండలాల్లో అరుదైన క్వార్ట్జ్ నిక్షేపాలున్నాయి. పొదలకూరు, సైదాపురం ప్రాంతాల్లో మరింత నాణ్యమైన ఖనిజం దొరుకుతోంది. ఈ ప్రాంతాల్లో అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపినందుకు మైనింగ్ శాఖ అధికారులు క్వార్ట్జ్ టన్నుకు రూ.661, ఫెల్‌స్పార్ ఖనిజం టన్నుకు రూ.1,111 చొప్పున పెనాల్టీ వేస్తున్నారు. ఇప్పటివరకు రూ.10 కోట్లకు పైగా జరిమానా విధించారు. అందులో సింహభాగం క్వార్ట్జ్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో క్వార్ట్జ్ టన్ను ధర రూ.25 వేల వరకు పలుకుతోంది. దీని ప్రకారం ఇప్పటివరకు అక్రమంగా తరలించిన ఖనిజం విలువ సుమారు రూ.350కోట్ల వరకు ఉంటుంది. పొదలకూరు, సైదాపురం మండలాల్లో కోడ్ అమల్లోకి వచ్చాక 12వేల టన్నుల క్వార్ట్జ్ ఖనిజాన్ని సీజ్ చేశారు. దీని విలువ రూ.30కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు.


పొదలకూరు మండలం మొగళ్లూరులో సీజ్ చేసిన క్వార్ట్జ్ డంప్(ఫైల్ ఫొటో)

సోమిరెడ్డి ఫిర్యాదుపై స్పందించిన కేంద్రం

గతేడాదికి ముందు వరకు క్వార్ట్జ్ టన్ను రూ.2వేలు లోపే కొనుగోలు చేసేవారు. కానీ అంతర్జాతీయ మార్కెట్లో ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడటంతో టన్ను రూ.20వేల నుంచి 30వేల వరకు ధర పలికింది. దీంతో వైసీపీ నేతలు గద్దల్లా వాలిపోయారు. అప్పటికే లైసెన్స్ ఉన్న క్వార్ట్జ్ వ్యాపారులను బెదిరించి వారి వ్యాపారాలను తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఒక్కో నేతకు ఒక్కో మండలాన్ని అప్పగిస్తూ తాడేపల్లి పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. సైదాపురం మండలాన్ని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌కు, పొదలకూరు మండలాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అప్పగించినట్లు ప్రచారం జరిగింది. గతేడాది అక్టోబరు నుంచి తవ్వకాలు ప్రారంభించి తవ్వి తీసిన ఖనిజాన్ని దర్జాగా చెన్నైకు తరలించి అక్కడినుంచి విదేశాలకు ఎగుమతి చేశారు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు గగ్గోలు పెట్టినా ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు. నేరుగా మైనింగ్ జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి వాహనాలను పట్టుకొని సమాచారమిచ్చినా అక్కడకు వెళ్లేందుకు కూడా అధికారులు సాహసించలేదు. పొదలకూరు మండలం వరదాపురం సమీపంలోని రుస్తుం, భారత్ మైన్సలో తవ్వకాలపై హైకోర్టు స్టే ఇచ్చినా లెక్కచేయకుండా అక్రమంగా క్వార్ట్జ్‌ను తరలించారు. దీనిని గత డిసెంబరులో అడ్డుకున్న టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సత్యాగ్రహ దీక్షకు కూర్చున్నారు. జీపీఎస్ ఫొటోలతో సహా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ (డీఎంజీ), కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. కానీ ఏ ఒక్కరూ స్పందించలేదు. దీంతో ప్రధాని మోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీకి సోమిరెడ్డి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. స్పందించిన కేంద్ర గనుల శాఖ.. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జరుగుతున్న క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌పై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫలితంగా కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే జిల్లా అధికారులు కదిలారు. కొన్ని రోజులుగా అక్రమంగా మైనింగ్ చేసిన ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. అక్రమ మైనింగ్‌పై తనిఖీలు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు రూ.10కోట్ల వరకు పెనాల్టీలు విధించినట్లు మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్ చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హింసావలయం..!

మావోయిస్టులు లేని భారతదేశం ఎంతో దూరంలో లేదంటూ కేంద్రహోంమంత్రి అమిత్ షా ఇటీవల ఓ వ్యాఖ్య చేశారు. సాయుధ బలగాలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సందర్భం కనుక, వారిని కర్తవ్యోన్ముఖులను చేసేందుకు ఆయన ఈ మాటలు అనివుంటారు. నానావిధ బలగాలను మోహరించి వామపక్ష తీవ్రవాదంమీద ప్రభుత్వం సాగిస్తున్న పోరు ఆఖరు అంకానికి చేరిందని, కాస్తంత గట్టిగా, ఒక్కసారిగా ఓ తోపుతోస్తే శత్రుశిబిరం పూర్తిగా కుప్పకూలిపోతుందని అమిత్ షా ఆ సందర్భంలో అత్యంత విశ్వాసం ప్రదర్శించారు. హోంమంత్రి చిత్రీకరిస్తున్నంతగా మావోయిస్టులు చితికిపోయారో లేదో తెలియదు కానీ, ఇటీవలికాలంలో సాయుధబలగాలు ఏకబిగిన సాగిస్తున్న యుద్ధంలో వీరు భారీగా నష్టపోతున్న విషయం కనిపిస్తూనే ఉంది. ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్‌జిల్లా కొర్చోలీ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13మంది మావోయిస్టులు మరణించిన ఘటన ఇటీవలికాలంలో అతిపెద్దది. కుప్పకూలినవారిలో చెప్పుకోదగ్గ స్థాయి నాయకులు ఉన్నారని కూడా అంటున్నారు. వారం క్రితం ఇదే జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సలైట్లు మరణించిన విషయం తెలిసిందే. మూడునెలల్లోనే యాభైమంది ప్రాణాలు కోల్పోయారన్న లెక్కలు నిజమైతే కేంద్రహోంమంత్రి లక్ష్యానికి అనుగుణంగా అడుగులు వేగంగా పడుతున్నాయని అనుకోవచ్చు.

ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని మావోయిస్టు పార్టీ చేస్తున్న వాదనను పోలీసు అధికారులు ఖండిస్తున్నారు. సంఘటనాస్థలంలో అత్యాధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం, ఇంకా ఏవేవో దొరకడం వంటి ఆనవాయితీలు కూడా పూర్తయ్యాయి. నరేంద్రమోదీ పదేళ్ళపాలనలో మావోయిస్టులు దాదాపుగా తుడిచిపెట్టుకుపోయారని, దేశాభివృద్ధికి, నిర్మాణానికి కట్టుబడిన తమ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చినప్పుడే మిగిలిన ఆ కాస్త పని పూర్తవుతుందని ఇటీవల అమిత్ షా చత్తీస్‌గడ్‌లో అన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం జరుగుతూనే ఉంది. కానీ, ఇటీవలికాలంలో వేర్వేరు పేర్లతో ప్రత్యేక సాయుధ దళాల ఏర్పాటు, హెలిప్యాడ్ల నిర్మాణం, డ్రోన్ల వినియోగం, మావోయిస్టుల ఆధిపత్యం ఉన్న ప్రాంతాలమీద వైమానిక, డ్రోన్ దాడులు ఇత్యాదివి గమనించినప్పుడు శత్రు నిర్మూలన మరింత నిర్దిష్టంగా, వేగంగా జరుగుతున్న విషయం అర్థమవుతుంది. సరిగ్గా మూడేళ్ళక్రితం ఇదే జిల్లాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై మావోయిస్టులు దాడిచేసి పెద్దసంఖ్యలో వారిని చంపివేసిన విషయం తెలిసిందే. ప్రతీ ఎన్‌కౌంటర్‌తోనూ ఒక ప్రతీకారదాడిముడిపడి ఉండటం, ఈ పరస్పర హింసలో ఇరుపక్షాలకు చెందినవారు పెద్దసంఖ్యలో మరణించడం జరుగుతున్నదే. నక్సలైట్లు తుడిచిపెట్టుకుపోయారని, ఆ ఉద్యమం ముగిసిపోయిందని ఎప్పటికప్పుడు అంటున్నప్పటికీ, ఈ యాభైయేళ్ళకాలంలో అది కొన్ని కొత్తప్రాంతాలకు విస్తరించింది, స్థావరాలు మార్చుకుంటోంది.

మావోయిస్టుల ఉనికికి, ఆదివాసుల్లో వారికి గల ఆదరణకు కారణమైన అంశాలను గుర్తించకుండా, పరిపాలనావైఫల్యాలను సరిదిద్దుకోకుండా భద్రతాబలగాల సాయంతో ఆ ఉద్యమాన్ని అణచివేయాలనుకోవడం ఆశించిన ఫలితాన్నివ్వదు. ఆదివాసుల హక్కులు హరించుకుపోతూ, వారి వనరులు అపరకుబేరుల, కార్పొరేట్ సంస్థల వశమైపోతున్నప్పుడు మావోయిస్టు ఉద్యమానికి స్థానిక ప్రజల సహకారం అందుతూనే ఉంటుంది. వేలాది ఎకరాల అటవీభూమిని అస్మదీయ పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తూపోతున్నప్పుడు, ఈ సైనికదాడులూ ఎన్‌కౌంటర్లన్నీ ఆ వనరుల నిరంతర దోపిడీకేనని ఆదివాసులు నమ్మకుండా ఉండరు. ఈ హింసావలయాన్ని ఛేదించడానికి ఇప్పటికైనా చత్తీస్‌గడ్ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలకు సిద్ధపడటం మంచిది. అడపాదడపా రెండు పక్షాలనుంచి చర్చలకు సానుకూలమైన ప్రకటనలు వస్తున్నప్పటికీ, ఎందుకోగానీ నిర్దిష్టంగా అడుగుముందుకు పడటంలేదు. చత్తీస్‌గడ్ ప్రభుత్వం ఇటీవల కూడా చర్చలకు సిద్ధమేనని ప్రకటించి, ఆ తరువాత ఆ ఊసే ఎత్తలేదు. లక్షలాదిమంది ఆదివాసీల జీవితాలతో ముడిపడిన అంశం కనుక, పౌరసమాజం పెద్దలు కాస్తంత చొరవతీసుకుంటే సమస్యకు శాంతియుత పరిష్కారమార్గాలు అన్వేషించవచ్చు.

జాతీయ పార్టీలకు జవజీవాలు!

ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్లపాటు ఉనికి కోల్పోయిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు 2024 ఎన్నికలు మళ్లీ ఊపిరి పోయబోతున్నాయి. ఈసారి ఈ రెండుపార్టీలు గతంలో కంటే మెరుగ్గా ఓట్లు, సీట్లు సాధించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలే దీనికి ప్రధాన కారణం.

ఉమ్మడిరాష్ట్రం విడిపోవడానికి ప్రధానకారణం కాంగ్రెస్ ప్రభుత్వం, అందుకు సహకరించినది బీజేపీ అని భావించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆ రెండు పార్టీలపై విపరీతమైన ఆగ్రహాన్ని పెంచుకున్నారు. 2014లో పార్లమెంట్‌తోపాటు, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేసేయాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. రాష్ట్రం విడిపోవడానికి కారణం కావడంతో పాటు తనపై అక్రమంగా కేసులు పెట్టి జైలుపాలు చేసిన కాంగ్రెస్‌ను ఓడించి తనకే అధికారం అప్పగించాలని జగన్ ఆ ఎన్నికల సందర్భంగా ప్రజలను కోరారు. అయినా చంద్రబాబుకు ఉన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పట్లో తెలుగుదేశం, ఎన్డీయే కూటమికే ప్రజలు అధికారాన్ని అప్పగించారు. పవన్‌కల్యాణ్ సారథ్యంలోని జనసేన ఎన్నికల్లో పోటీచేయకపోయినా మద్దతు ఇవ్వడం ఆ కూటమికి మరింతగా కలిసివచ్చింది. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం 44.9 శాతం ఓట్లతో 102 ఎమ్మెల్యే, 40.8 శాతం ఓట్లతో 15 ఎంపీ స్థానాలు, వైసీపీ 44.6 శాతం ఓట్లతో 67 ఎమ్మెల్యే, 45.7 శాతం ఓట్లతో 8 ఎంపీ స్థానాలు, బీజేపీ 2.2 శాతం ఓట్లతో నాలుగు ఎమ్మెల్యే స్థానాలు, 7.2 శాతం ఓట్లతో రెండు ఎంపీ స్థానాలు గెలుచుకున్నాయి. నవోదయపార్టీ ఒక ఎమ్మెల్యే స్థానాన్ని, స్వతంత్ర్య అభ్యర్థి ఒక స్థానాన్ని దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే స్థానాన్నీ గెలుచుకోలేక ఘోర పరాజయం పొందిన కాంగ్రెస్ 2.9 శాతం ఓట్లు మాత్రమే సాధించింది. ఎన్నికల ప్రచారంలో తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాలకు, రాజధాని నిర్మాణానికి నిధులు, ప్రత్యేక రైల్వే జోన్ వంటి అనేక హామీలు ఇచ్చిన మోదీ ఒక్కదాన్నీ నెరవేర్చలేదు. దాంతో బీజేపీపై కూడ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. 2018లో తెలుగుదేశం, ఎన్డీయే కూటమి విచ్ఛిన్నమై కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఆయాప్రభుత్వాలకు అవి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ మళ్లీ ఉద్యమాలు మొదలయ్యాయి. దీని ప్రభావం 2019 ఎన్నికలపై పడింది.



గట్టి ఓటుబ్యాంకు కలిగిన తెలుగుదేశం, జనసేనలతో పొత్తు పెట్టుకోవడం ద్వారా ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతాన్ని పెంచుకోనుంది. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో జత కలవడంతో వారికున్న కొద్దిపాటి ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ అవుతాయి కాబట్టి ఆ పార్టీ గతంకంటే ఓట్ల శాతాన్ని పెంచుకుంటుంది. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి అన్యాయం చేశాయని భావించిన ప్రజలు వాటికి శాశ్వత సమాధి కట్టాలని నిర్ణయించినప్పటికీ, 2024 ఎన్నికలు వాటికి ఊపిరి పోస్తున్నాయి.

'ఇరవైఐదు మంది ఎంపీలను ఇవ్వండి ప్రత్యేక హోదా సాధిస్తా, మెజారిటీ ఎమ్మెల్యేలను ఇస్తే రాష్ట్రంలో పరిపాలన స్వరూపం మారుస్తా, ఒక్క అవకాశం ఇవ్వండి' అని వేడుకున్న జగన్‌ను నమ్మి రాష్ట్రప్రజలు అనూహ్యంగా స్పందించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ తమకు అన్యాయం చేశాయని గాఢంగా విశ్వసించిన ప్రజలు వాటిని చావుదెబ్బ కొట్టారు. వైసీపీకి బ్రహ్మరథం పడుతూ 50.6 శాతం ఓట్లతో 151 మంది ఎమ్మెల్యేలను, 49.9 శాతం ఓట్లతో 22మంది ఎంపీలను గెలిపించారు. కాగా తెలుగుదేశం 39.7 శాతం ఓట్లతో 23 మంది ఎమ్మెల్యే, 40.2 శాతం ఓట్లతో మూడు ఎంపీ స్థానాలు దక్కించుకుంది. 5.6శాతం ఓట్లతో జనసేన ఒక ఎమ్మెల్యేను మాత్రమే గెలుచుకుంది. కాంగ్రెస్ 1.2 శాతం ఓట్లు సాధిస్తే బీజేపీ 0.9 శాతం ఓట్లు సాధించింది. ఈ రెండు పార్టీలకంటే అధికంగా నోటాకు 4,01,324 (1.3 శాతం) ఓట్లు పడడం ఆ రెండు పార్టీల మీద ప్రజలకున్న అక్కసును వెల్లడిస్తోంది.

సీఎంగా గద్దెనెక్కిన జగన్, కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజారిటీ ఉండడం వల్ల ప్రత్యేకహోదా తేలేమని తొలి వారంలోనే చేతులెత్తేశారు. అనంతర కాలం నుంచి ఇప్పటి వరకు సంక్షేమానికి పెద్దపీట వేసి అభివృద్ధిని పూర్తిగా విస్మరించడం, అమరావతి స్థానంలో మూడు రాజధానుల అంశాన్ని లేవనెత్తడం, పోలవరం ప్రాజెక్టు పూర్తికాకపోవడం, రైల్వే జోన్ రాకపోవడం, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం, కేంద్రంలోని మోదీ సర్కార్‌తో రహస్య అవగాహనతో వ్యవహరించడం తదితర అంశాల కారణంగా వైసీపీపైనా ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది.

ఈ నేపథ్యంలో 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. జగన్ సర్కార్ నియంతృత్వ పోకడలు, ప్రతిపక్షాలపై దాడులు, అరెస్టులతో ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఓట్లు చీలనివ్వనని ప్రతిజ్ఞ చేశారు. అప్పటికే బీజేపీతో పొత్తులో ఉన్న ఆయన టీడీపీతో కూడ సయోధ్య కుదుర్చుకున్నారు. ఫలితంగా తెలుగుదేశంకు 17 ఎంపీ, 144 ఎమ్మెల్యే స్థానాలు, బీజేపీకి ఆరు ఎంపీ, పది అసెంబ్లీ స్థానాలు, జనసేనకు రెండు ఎంపీ, 21 అసెంబ్లీ స్థానాలతో సీట్ల పంపకాలు పూర్తయ్యాయి. వైఎస్ జగన్ ఒంటరిగా 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాలకు పోటీకి దిగారు. ఇండియా కూటమి తరపున ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో కాంగ్రెస్ జతకట్టి పోటీకి సై అంటోంది.

గట్టి ఓటుబ్యాంకు కలిగిన తెలుగుదేశం, జనసేనలతో పొత్తు పెట్టుకోవడం ద్వారా ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకోనుంది. ఈ క్రమంలోనే కొన్ని సీట్లు సాధించే అవకాశం కూడా ఉంది. అయితే కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతున్నవారు, ముస్లిం, మైనారిటీ వర్గాలు ఈ కూటమికి దూరమయ్యే ప్రమాదం వుంది. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, కమ్యూనిస్టుల వైపు మొగ్గుచూపే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు జగన్‌తో విభేదించిన ఆమె సోదరి వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంగ్రెస్‌శ్రేణుల్లో కాస్త హుషారు కనిపిస్తోంది. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలోనూ తమకు అధికారం ఇస్తే ప్రత్యేక హోదాతోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామని షర్మిళ ప్రచారం చేస్తున్నారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో జత కలవడంతో వారికున్న కొద్దిపాటి ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ అవుతాయి కాబట్టి ఆ పార్టీ గతంకంటే ఓట్ల శాతాన్ని పెంచుకుంటుంది. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి అన్యాయం చేశాయని భావించిన ప్రజలు వాటికి శాశ్వత సమాధి కట్టాలని నిర్ణయించినప్పటికీ, 2024 ఎన్నికల్లో వైసీపీ, తెలుగుదేశం వాటికి అనివార్యంగా ఊపిరి పోస్తున్నాయి.

▪ దేవగళ్ల రామకృష్ణ

కేసీఆర్ కర్తవ్యం గెలవడం కాదు, మిగలడం!

బీజేపీ అనుబంధ సంస్థ అని భావించే ఉపాధ్యాయసంఘంలో పనిచేసే ఒక మిత్రుడు ఈ మధ్య తారసపడ్డాడు. 'కేసీయార్‌ను దించవలసి ఉండె కాబట్టి, మా టీచర్లందరూ మొన్న కాంగ్రెస్‌కు ఓటేసిన్రు, ఆ పని అయిపోయింది, ఇప్పుడు అందరూ మోదీనే' అన్నాడు. 'పదీ, పన్నెండు, అంతకు తగ్గవు, చూస్కోండి' అని నమ్మకంగా చెప్పాడు. ఆ సంఘానికి పెద్ద సంఖ్యలో సభ్యత్వాలేమీ లేవు. ఉపాధ్యాయసంఘాల సభ్యులు ఆ సంఘ రాజకీయ అనుబంధాన్ని బట్టి ఓట్లు వేయరని, టీచర్ల లెక్కలు వేరే ఉంటాయని అందరికీ తెలుసు. సంఘాలతో సంబంధం లేకుండా, మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో టీచర్లు అత్యధికసంఖ్యలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేశారు. తమ పనిపరిస్థితులతో, జీతభత్యాలతో నిమిత్తం లేని లోక్‌సభ ఎన్నికలలో వారి ఎంపికలు ఎట్లా ఉంటాయన్నది ప్రశ్న. మా మిత్రుడి ఉపాధ్యాయపరిషత్తు సభ్యులే కాదు, తక్కిన అన్ని సంఘాల సభ్యులూ, చివరకు వామపక్ష ఉపాధ్యాయ సంఘాల సభ్యులు కూడా మోదీ ప్రభావంలో ఉన్నారేమో తెలియదు. లేకపోతే, పదీ, పన్నెండూ లెక్క ఎట్లా కుదురుతుంది?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గారన్న దాన్ని తాను కాదనడంలేదని, కానీ, పార్లమెంటు ఎన్నికల విషయానికి వస్తే దేశమంతా మోదీకి అనుకూలంగా ఒకే అభిప్రాయంతో ఉన్నదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ మధ్య ఒక ఇంగ్లీషు పత్రికతో అన్నారు. జాతీయవాదం ఒక మతంతోను, ఒక నాయకుడితోనూ ముడిపడితే, ఇటువంటి రాజకీయ ప్రభావాలు సహజమే. దేశవ్యాప్త ప్రభావానికి ఎదురుగా మరొక సమస్థాయి జాతీయ ప్రభావాన్ని నిర్మించగలిగే శక్తి ప్రతిపక్ష కూటమికి లేదు. ఇప్పుడు జరుగుతున్న సాధారణ ఎన్నికలలో, ఒక దేశవ్యాప్త రాజకీయ మహాశక్తిని, రాష్ట్రస్థాయి, స్థానిక రాజకీయాల కూటమితో ఎదుర్కొనడానికి ప్రయత్నించడం చూస్తున్నాము. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతను ప్రదర్శించారు. ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నది జాతీయపార్టీయే అయినా, ఎన్నికలు జాతీయ అంశాల ప్రాతిపదికన జరగలేదు. మరి రాష్ట్ర అంశాల ప్రాతిపదిక మీదనే లోక్‌సభ ఎన్నికల పోరాటం సాగేటట్టు కాంగ్రెస్ చేయగలదా? జాతీయ ప్రభావానికి తెలంగాణలో అడ్డుగోడ వేయగలదా?

'పది, మేం గెలిచి తీరతాం' అన్నారు, ఒక కాంగ్రెస్ పెద్ద నాయకుడు. ఆయన మాజీ ఎంపీ, రాహుల్ గాంధీకి దగ్గర కూడా. 'బీజేపీ అంచనాలు ఆరు నుంచి మొదలై పది దాకా పెరుగుతున్నాయి, మీరు పదెట్లా గెలుస్తారు?' అని అడిగాను. 'అసెంబ్లీ లెక్కల ప్రకారం గెలవాలి. బీఆర్ఎస్ పడిపోతున్న తీరును బట్టి చూస్తే కూడా గెలవాలి'— అని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలోని విజయోత్సాహంతో కాంగ్రెస్ వాళ్లు ధీమాగా ఉన్నారు కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులను నిర్దిష్టంగా చర్చిస్తే, మోదీ ప్రభావం ఎంత ఉన్నదో వాళ్లకు కూడా లెక్క తెలియడం లేదు. చిన్నపట్టణాలలో, జిల్లా కేంద్రాలలో యువకులు, ముఖ్యంగా వెనుకబడిన తరగతుల యువకులు పెద్ద ఎత్తున మోదీకరణ చెందారని అందరూ గుర్తిస్తున్నారు కానీ, అందుకు తమ వద్ద ఉన్న విరుగుడేమిటో వాళ్లు చెప్పడం లేదు, బహుశా వాళ్ల దగ్గర ఏమీ లేదేమో కూడా! డిసెంబర్ విజయం ఇంకా అదేరూపంలో భద్రంగా ఉన్నదని, కొత్తగా జరిగిన చేరికలతో అది మరింత జనబలంగా మారిందని అనుకుంటున్నారు. బాగా ఖర్చు పెట్టగలిగిన ఆసాములను రంగంలోకి దింపితే, ఆ ధనశక్తి కూడా తోడై పది విజయాలు ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. ఉపన్యాసాలు ఇచ్చి పోవడం తప్ప అధిష్ఠానం చేయగలిగే సాయం ఏమీ లేదు. చిన్నదో పెద్దదో ఒక 'హవా' సృష్టించే ఉద్దేశమూ సామర్థ్యమూ కూడా రాహుల్ బృందంలో కనిపించడం లేదు. చూడాలి, తుక్కుగూడ జనజాతరలో ఒక మందపవనమో మలయమారుతమో చెలరేగుతుందేమో?



గెలుపు ఓటములను పక్కనబెట్టి, ఉనికి పోరాటం చేయడమొక్కటే బీఆర్ఎస్ చేయగలిగింది. రంగంలో మిగలడానికి చేసే జీవన్మరణ యుద్ధంలో, ఆ పార్టీకి కావలసింది ఒక గట్టి రాజకీయ ఆయుధం. ఇప్పుడే నిద్రనుంచి మేల్కొన్నట్టు, రైతు ఆత్మహత్యల గురించి మాట్లాడడం వల్ల హేళనలు ఎదుర్కొనడమే తప్ప, ప్రయోజనం ఉండదు. సాధికారంగా, నైతికబలంతో మాట్లాడగలిగే అంశాలను వారు అన్వేషించాలి. ఓడిపోయే ఎన్నికల కోసం ఖర్చు దండగని అనుకోకుండా, భవిష్యత్తు యుద్ధాల కోసం వర్తమానంలో ఆత్మరక్షణ చేసుకోవాలి. బంగారు లక్ష్యం అచ్చిరానప్పుడు, రజతపతకంతో అయినా పోటీలో నిలవాలి.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

బీఆర్ఎస్ పతనం రేవంత్‌కు కూడా ఆశ్చర్యం కలిగిస్తోందట. 'వాళ్ల పతనవేగాన్ని చూసి ఆయన చాలా డిజప్పాయింట్ అవుతున్నారు' అన్నారు ఆ కాంగ్రెస్ నాయకుడు. ఎన్నికలలో ఓటమి పొందిన బీఆర్ఎస్‌ను ఇప్పట్లో మరి లేవకుండా చేయాలని కాంగ్రెస్ అనుకోవడంలో తప్పులేదు. అందుకు పరిపాలనాపరంగాను, రాజకీయంగానూ ప్రక్రియలను ప్రారంభించినప్పుడు, వాటి పర్యవసానాల వేగం వారి నియంత్రణలో ఉండకపోవచ్చు. కేసీఆర్ పడిపోతూ, తనను తాను కాంగ్రెస్‌కు దిగువన, బీజేపీకి ఎగువన నిలబడేట్టు, నిగ్రహించుకోవడం సాధ్యమయ్యేపని కాదు. పైగా, ఏదో ఒకటి చేసి, పాతాళంలోకి జారిపోకుండా నిలదొక్కుకోవాలన్న ప్రయత్నమే లేనప్పుడు, ఆ పతనగతిని ఆపలేము. తాను సమకూర్చుకున్న బలగం అంతా వదిలిపెట్టి వెడుతుంటే, అలనాడు భారతంలో స్వర్గారోహణ పర్వంలో ధర్మరాజుకు కలిగినంత నిర్వేదం కేసీఆర్‌కు కలగడంలో ఆశ్చర్యం లేదు. కానీ, నువ్విప్పుడు మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోవడం లేదు కదా? రణరంగం మధ్యలో వైరాగ్యం వల్ల ఏమిటి ఉపయోగం? ఇప్పుడు పూనుకుని ప్రజలను పలకరించే పని బాగానే ఉంది కానీ, మిగిలిన కార్యకర్తలకు మనోబలాన్ని ఇచ్చే పనిచేయాలి కదా, ముందు? డబ్బుల్లేవని, సొంతఖర్చు పెట్టుకోవాలని, పోటీచేయడానికి ముందుకువచ్చే అభ్యర్థులను విదిలిస్తే, అది శల్యసారథ్యమే అవుతుంది. ఎంతెంత డబ్బు ఎవరెవరు ఇచ్చారో మొన్ననే కదా ఎలక్షన్ కమిషన్ బయటపెట్టింది?

గెలిచే నమ్మకం లేనప్పుడు ఖర్చు పెట్టుకోవడం ఎందుకని కేసీఆర్ ఆలోచన కావచ్చు. గెలవడానికి కాదు, రెండో స్థానంలో నిలబడడానికే బీఆర్ఎస్ పోరాడాలి. ముగ్గురు ఆటగాళ్లున్న ఈ క్రీడలో కాంస్యపతకం లేదు. పది గెలిచితీరతామని చెబుతున్న కాంగ్రెస్ నేత కూడా రెండోస్థానంలో బీజేపీయే వస్తుందని బెంగపడుతున్నారు. తెలంగాణ రాజకీయరంగం మీద కాంగ్రెస్, బీజేపీ స్థిరపడితే, బీఆర్ఎస్ తెరమరుగు కావడమే జరుగుతుంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో 8 చోట్ల గెలిచిన బీజేపీ మరో 18 స్థానాలలో మాత్రమే రెండో స్థానంలో ఉండింది. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి 103 స్థానాలలో గెలిచి, 99 చోట్ల రెండోస్థానంలో ఉన్నాయి. మొత్తంగా 14 స్థానాలలో మూడోస్థానం లేదా ఆ దిగువన ఉండిపోయిన కాంగ్రెస్, కనీసం తొమ్మిది స్థానాలలో బీఆర్ఎస్, బీజేపీల తరువాతి స్థానాల్లో ఉండింది. అధికారం దక్కలేదనేది వేరే సంగతి కానీ, బీఆర్ఎస్ గౌరవనీయమైన స్థాయిలోనే జన బలాన్ని నమోదుచేసుకున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లే తెలంగాణలోని ప్రధాన ప్రత్యర్థి పక్షాలని తాజా అసెంబ్లీ ఎన్నికలు చాటాయి. లోక్‌సభ ఎన్నికలతో ఈ స్థితి నుంచి పూర్తిగా తారుమారు కానున్నదా?

2018 అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ 7.1 శాతం ఓట్లను, ఒక ఎమ్మెల్యేను గెలుచుకోగలిగింది. 2019 పార్లమెంటు ఎన్నికలలో తన ఓటింగ్ శాతాన్ని అదనంగా 12 శాతం, అంటే 19.45 శాతం ఓట్లకు పెంచుకోగలిగింది. బీజేపీ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ 2023కు వచ్చేసరికి దాదాపుగా రెట్టింపు (13.9) అయింది. అదే లెక్కను వర్తింపజేస్తే, 2024 పార్లమెంటు ఎన్నికలలో ఆ పార్టీ ఓటింగ్ శాతం కూడా రెట్టింపై 24 శాతానికి చేరాలి. అదనపు హంగులు కూడా చేరినందున, ఇంకా పెరిగినా పెరగవచ్చు. కాంగ్రెస్ కోల్పోయే ఓట్లు బీజేపీ ఖాతాలోకి వెడతాయి. కాంగ్రెస్ గెలిచే చోట్ల బీజేపీయే రన్నర్ అప్‌గా ఉంటుంది. మరి బీఆర్ఎస్ ఎక్కడ? బీఆర్ఎస్ జోరు బాగా ఉన్న 2018—2019 కాలంలోనే, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల మధ్య ఆ పార్టీ ఓట్లు సుమారు ఆరుశాతం తగ్గి, బీజేపీ ఎదుగుదలకు దోహదం చేశాయి. 2023లో బీఆర్ఎస్ సాధించిన 37.5 శాతం ఓట్లలో ఎన్ని బీజేపీకి వెళతాయి? బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు తరలివెళ్లే ఓట్లు అతి తక్కువ ఉంటాయని, ఆ రెండు పార్టీల మధ్య నడుస్తున్న యుద్ధాన్ని చూస్తే అర్థమవుతుంది. పుట్టి మునిగిపోతున్న పార్టీకి మొన్న పడ్డ ఓట్లలో అత్యధికం బీజేపీకి పడితే, ఆ వలస ఓటింగ్ శాతాన్ని, ఫలితాలను కూడా గణనీయంగా ప్రభావితం చేయవచ్చు. కేంద్రప్రభుత్వపు కోరలు కలిగిన బలమైన ప్రతిపక్షం అధికార పార్టీని ఎంతో కాలం ఉండనివ్వదు. బీఆర్ఎస్ అవశేషాన్ని అసలే మిగలనివ్వదు.

కాసేపు బీజేపీని, మరి కాసేపు కాంగ్రెస్‌ను బలపడేట్టు చేసి కేసీఆర్ ఆడిన ఆట, చివరకు ఆయనకే ముప్పుతెచ్చింది. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి ఉమ్మడిగా బీఆర్ఎస్ మీద జరుపుతున్న రాజకీయయుద్ధం కాంగ్రెస్‌కే ప్రమాదం తెస్తుంది. కాంగ్రెస్ కోరుకున్నట్టే, బీఆర్ఎస్ కూడా వ్యవహరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మీదనే కత్తులు నూరడం వల్ల తన చాప కిందికి నీరు తానే తెచ్చుకుంటున్నది. కాంగ్రెస్ మీద తాను పెంచే వ్యతిరేకత ఫలితాలు కూడా బీజేపీకే వెడతాయని బీఆర్ఎస్ గుర్తించాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర అజెండానే పార్లమెంటు ఎన్నికలకు విస్తరించాలనుకోవడం బాగానే ఉన్నది కానీ, ప్రచారపర్వం ఉధృతమై జాతీయఅంశాలు వేదికమీదకు వచ్చేసరికి, బీఆర్ఎస్ నిరాయుధంగా మిగలవలసివస్తుంది. గెలుపు ఓటములను పక్కనబెట్టి, ఉనికి పోరాటం చేయడమొక్కటే బీఆర్ఎస్ చేయగలిగింది. రంగంలో మిగలడానికి చేసే జీవన్మరణ యుద్ధంలో, ఆ పార్టీకి కావలసింది ఒక గట్టి రాజకీయ ఆయుధం. ఇప్పుడే నిద్రనుంచి మేల్కొన్నట్టు, రైతు ఆత్మహత్యల గురించి మాట్లాడడం వల్ల హేళనలు ఎదుర్కొనడమే తప్ప, ప్రయోజనం ఉండదు. సాధికారంగా, నైతికబలంతో మాట్లాడగలిగే అంశాలను వారు అన్వేషించాలి. ఓడిపోయే ఎన్నికల కోసం ఖర్చు దండగని అనుకోకుండా, భవిష్యత్తు యుద్ధాల కోసం

బాగా ఖర్చు పెట్టగలిగిన ఆసాములను రంగంలోకి దింపితే, ఆ ధనశక్తి కూడా తోడై పది విజయాలు ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. ఉపన్యాసాలు ఇచ్చి పోవడం తప్ప అధిష్ఠానం చేయగలిగే సాయం ఏమీ లేదు. చిన్నదో పెద్దదో ఒక 'హవా' సృష్టించే ఉద్దేశమూ సామర్థ్యమూ కూడా రాహుల్ బృందంలో కనిపించడం లేదు. చూడాలి, తుక్కుగూడ జనజాతరలో ఒక మందపవనమో మలయమారుతమో చెలరేగుతుందేమో?

అమ్మభాష రక్షణకు అజెండాలలో చోటివ్వాలి

లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభకు త్వరలో ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో జాతీయ, ప్రాంతీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే ప్రాధాన్యం ఇచ్చే అంశాలపై అజెండాలను రూపొందించుకుని ప్రజల ముందుకు రాబోతున్నాయి. ఈ క్రమంలో అమ్మభాష అయిన మన తెలుగుభాషను సంరక్షించడానికి ఉపకరించే దిగువ అంశాలను ఆయా పార్టీలు తమ అజెండాలలో చేర్చి భాషా పరిరక్షణలో తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి.

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమంలోనే ప్రాథమిక విద్యను బోధించాలి. పదో తరగతి వరకు తెలుగుభాషను ప్రథమభాషగా చదివి, ఇంటర్మీడియట్‌లో మార్కులకోసం తెలుగుకు మారుగా సంస్కృత భాషను ఎంపిక చేసుకోవడాన్ని అనుమతించకూడదు. రాష్ట్రంలోని అల్పసంఖ్యాకవర్గాలు, ఇతర మాతృభాషలవారికి వారి వారి భాషల్లో విద్యావకాశం కల్పించాలి. వారి పాఠశాలలకు సరైన ప్రోత్సాహం అందించాలి. గిరిజన భాషలలోను ప్రాథమికస్థాయిలో తోడ్పాటు ఇచ్చి చదువు పట్ల భయం లేకుండా గిరిజనుల్లో ఆత్మవిశ్వాసం కల్పించాలి. తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర తదితర ప్రాంతాలలో తెలుగుభాషలో చదివే విద్యార్థులకు వారి మాతృభాషా మాధ్యమ హక్కులను చట్టబద్ధంగా కాపాడాలి. డిగ్రీ రెండవ సంవత్సరంలో కూడ గతంలో-మాదిరి తెలుగు భాష, సాహిత్య అంశాలను కొనసాగించాలి. పాఠశాల నుంచి ఉన్నతవిద్య వరకు నిపుణులైన తెలుగుబోధకులతో ఉద్యోగఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి అన్ని ఉద్యోగాలలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్ర కేంద్ర స్థాయిలలో అన్ని పోటీపరీక్షలను మాతృభాషలలో రాసే అవకాశం కల్పించాలి.

విశ్వవిద్యాలయాలన్నిటిలో తెలుగును ఒక పాఠ్యాంశంగా కొనసాగించాలి. శ్రీశైలంలో ఇప్పుడున్న తెలుగు విశ్వవిద్యాలయం కేంద్రాన్ని పూర్తిస్థాయిలో విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలి. తిరుపతిలో తాళపత్ర పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటుచేసి వెలుగులోకి రాని తాళపత్రాలపై అధ్యయనం జరిపించాలి. ప్రాచీన రాతప్రతులు, పత్రికలు, శాసనాల సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. అలాగే విభజన చట్టంలో పేర్కొన్న విధంగా తెలుగు, సంస్కృత అకాడమీలు వేరువేరుగా, సమగ్రంగా తమ బాధ్యతలు నిర్వహించేందుకు కృషిచేయాలి. తెలుగు భాష ఆధునికీకరణకు- సాంకేతికీకరణకు తోడ్పడేలా ఒక ప్రత్యేక సంస్థను, తెలుగు భాష మాండలికాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయడం కోసం మరో సంస్థను ఏర్పాటు చేయాలి. అన్ని స్థాయిలలో పాలనా అధికారిక భాషగా తెలుగును కట్టుదిట్టంగా అమలుచేయాలి. న్యాయస్థానాలలోనూ తెలుగు వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. అధికార భాషాసంఘం స్థానంలో తెలుగు ప్రాధికార సంఘాన్ని స్వతంత్ర



ప్రతిపత్తితో పూర్తిస్థాయి వ్యవస్థగా కొనసాగించాలి.

తెలుగుభాషా మంత్రిత్వశాఖను కొనసాగించాలి. నెల్లూరులో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సమర్థవంతంగా పనిచేసేలా రెండు తెలుగు రాష్ట్రాలు సమన్వయంతో వ్యవహరించి తగిన చర్యలు తీసుకోవాలి. మైసూరులోని భారతీయ భాషల కేంద్రం, నేషనల్ బుక్‌ట్రస్ట్, కేంద్ర సాహిత్య అకాడమీ తదితర సంస్థలలోని తెలుగు విభాగాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలి. తెలుగు పుస్తకాల ప్రచురణకు, గ్రంథాలయాల్లో పుస్తకాల కొనుగోలుకు తోడ్పడాలి. రచయితల రచనా వ్యాసంగానికి అవసరమైన తోడ్పాటునందించాలి. తెలుగు నుంచి ఇతర భాషలకు, ఇతర భాషల నుంచి తెలుగులోకి ప్రామాణిక అనువాదాలకు సహకారం అందించాలి. ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగు భాషా మహాసభలు, రచయితల మహాసభలను క్రమం తప్పకుండా నిర్వహించాలి. ప్రముఖ తెలుగు భాషా సాహిత్య నిలయాలు, సంస్థలు, వేమన తదితర కవుల స్మృతికేంద్రాలను సంరక్షించాలి.

— --------------డా. అప్పిరెడ్డి

బెదిరించడం సాధ్యం కాదనే పించన్ల రాజకీయం

'నేరుగా నగదు పంపిణీ చేసే బాధ్యతల నుంచి వాలంటీర్లు తప్పుకోవాలి. ప్రభుత్వం వారికి ఇచ్చిన సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు తక్షణమే అధికారులకు అప్పగించాలి' — ఇదీ ఇటీవల ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వు. అంతే, ఇక ఆ క్షణం నుంచి రాష్ట్రంలో రాజకీయాలు అకస్మాత్తుగా వేడెక్కాయి. వాలంటీర్లు లేకపోతే అసలు ప్రభుత్వం నడపడమే కష్టం అన్నట్లు అధికార పార్టీ నుంచి వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. ఉద్దేశ్యపూర్వకంగానే వాలంటీర్లపై చర్యలు తీసుకున్నారని ఒకరు, సంక్షేమ పథకాలు పేదలకు అందకుండా చేయడం కోసమే ఈ చర్య అని మరొకరు దుయ్యబడుతున్నారు. అధికార పార్టీ నాయకుడికి చెందిన పత్రికలో ఈ అంశానికి సంబంధించి ఏకంగా తెలుగుదేశం పార్టీని దుమ్మెత్తిపోశారు. అంతటితో ఆగక మరో అడుగు ముందుకు వేసి ఎన్నికల సంఘంపై కూడ విరుచుకుపడ్డారు. దాని ఉత్తర్వులను వక్రీకరించి ప్రజల్ని ఇంతగా ఏమార్చే ప్రయత్నం అవసరమా? వాలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ ఆగిపోతుందా? అసలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లే లేవా? అనే ప్రశ్నలకు మాత్రం అధికారపక్షం నుంచి సమాధానమే లేదు.

వాలంటీర్లంతా వైసీపీ కార్యకర్తలేనని 2019 సెప్టెంబరులో ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. గతేడాది జూలైలో జరిగిన ఒక బహిరంగసభలో మంత్రి అంబటి రాంబాబు కూడ ఇదే విషయాన్ని పేర్కొంటూ, వాలంటీర్లలో ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే వారిని తీసేసి విశ్వాసంగా పనిచేసే వారిని నియమించుకుంటామని ప్రకటించారు. అనేకమంది అధికారపార్టీ నాయకులు సైతం వాలంటీర్లను అదేస్థాయిలో వెనకేసుకొచ్చారు. అందుకే అధికారపార్టీకి మద్దతిస్తూ ఓటర్లను ప్రభావితం చేసే వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలని, ఎన్నికల విధుల్లో వాళ్లు పాల్గొనకుండా చూడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. ఆ మేరకు ఎన్నికలసంఘం నిర్ణయం తీసుకుంది. దీంతో వాలంటీర్లు లేకపోతే అసలు సంక్షేమ పథకాలను అమలు చేయడమే సాధ్యం కాదన్నట్లు అధికారపక్షం గగ్గోలు పెడుతోంది. ఇక ప్రభుత్వ సలహాదారు ఒక మెట్టు పైకెక్కి సచివాలయాల వద్దే పింఛన్లు అందజేస్తారని ఎన్నికల సంఘం ఉత్తర్వులు వెలువడడానికి ముందే చెప్పారు. అదే సమయంలో ముఖ్యగమనిక పేరిట వాలంటీర్ల గ్రూపుల్లో సందేశాలు హల్‌చల్ చేయడం మొదలైంది. 'ఏప్రిల్ నెల పెన్షన్లు ఆలస్యంగా అందుతాయి. ప్రతిపక్షం పన్నిన కుట్ర కారణంగా వాటిని సచివాలయల్లోనే అందుకోవాలి' అంటూ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలకు చెప్పాలనేది ఆ వాట్సప్ సందేశం సారాంశం.

ప్రభుత్వ ఖజానాలో నిధులు లేవు అనే నిజాన్ని దాచిపెట్టి, ప్రతిపక్షాల కుయుక్తుల కారణంగానే పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని ప్రభుత్వపెద్దలు చేస్తున్న బూటకపు ప్రచారం చూసి జనం నవ్వుకుంటున్నారు. గడచిన ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి కేవలం బటన్ నొక్కడానికే పరిమితమయ్యారు తప్ప రాష్ట్రాభివృద్ధి శూన్యం. ఆయన బటన్ నొక్కిన వెంటనే ఎప్పుడూ ఏ ఒక్కరికీ నగదు జమ కాలేదు. రాష్ట్రంలోని ఏ లబ్ధిదారుడిని అడిగినా ఆ విషయం చెబుతాడు. ఆసరా పేరుతో జనవరి 23న జగన్ రెడ్డి బటన్ నొక్కారు. చేయూత పేరుతో ఫిబ్రవరి 16న, విద్యాదీవెన పేరుతో ఫిబ్రవరి 29న, ఈబీసీ నేస్తం పేరుతో మార్చి 14న ఆయన బటన్లు నొక్కారు. వీటికి సంబంధించిన డబ్బులు ఇంతవరకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. పింఛన్లు సహా వివిధ పథకాల కింద లబ్ధిదారులకు అందజేయాల్సిన మొత్తం రూ.13 వేల కోట్లకు పైగానే ఉంటుంది. నిధుల కొరత కారణంగా డబ్బులు జమచేయలేకపోతున్నామని చెబుతున్న రాష్ట్రప్రభుత్వం అదే సమయంలో ఎన్నికలను దృష్టిలో

వాస్తవానికి వాలంటీర్లను పక్కన పెట్టడంవల్ల పింఛన్ల పంపిణీకి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ వాళ్లు లేకుండా పింఛన్‌దారులను, ఓటర్లను బెదిరించడం సాధ్యపడదనే కలవరపాటుతోనే ప్రభుత్వం ప్రతిపక్షంపై దుమ్మెత్తిపోస్తోందనే విషయం సుస్పష్టం.



ఉంచుకుని ఆగమేఘాలమీద మార్చి 16 నుంచి మార్చి 30 మధ్య 15 రోజుల్లో తమ తాబేదార్లయిన కాంట్రాక్టర్లకు దాదాపు రూ.15 వేల కోట్ల మేరకు బిల్లులు చెల్లించింది.

రాష్ట్రంలో సుమారు 15 వేలకు పైచిలుకు గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ప్రతి సచివాలయంలోనూ సగటున 11 మంది చొప్పున 1.35 లక్షల మంది ఉద్యోగులున్నారు. రాష్ట్రంలో మొత్తంగా ఇస్తున్న పింఛన్ల సంఖ్య 65.39 లక్షలు. సచివాలయ ఉద్యోగులతో వాటి నగదు పంపిణీ మొదలుపెడితే సగటున ఒక్కో ఉద్యోగి 48 మంది పింఛన్‌దారులకు అందజేయవచ్చు. ఇదంతా ఒక్క పూటలోనే ముగిసే వెసులుబాటు ఉన్నా ఆ పని చేయకుండా నెపాన్ని తెలుగుదేశంపై నెట్టివేస్తూ దుష్ప్రచారం సాగిస్తూ ప్రజలలో వ్యతిరేకత కూడగట్టడానికి యత్నిస్తోంది. ఆర్థికసంవత్సరం ముగింపు కారణంగా పింఛన్లు రెండురోజులు ఆలస్యంగా అందుతాయని వైసీపీ అధినేతకు చెందిన పత్రికలో నెల క్రితమే కథనం వచ్చింది. నిజంగా అదే కారణమైతే గత ఏడాది ఎందుకు ఆలస్యం కాలేదు అన్న ప్రశ్నకు సమాధానం లేదు. వాస్తవానికి వాలంటీర్లను పక్కన పెట్టడంవల్ల పింఛన్ల పంపిణీకి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ వాళ్లు లేకుండా పింఛన్‌దారులను, ఓటర్లను బెదిరించడం సాధ్యపడదనే కలవరపాటుతోనే ప్రభుత్వం ప్రతిపక్షంపై దుమ్మెత్తిపోస్తోందనే విషయం సుస్పష్టం.

పింఛన్ల విషయంలో రాజకీయంగా ప్రయోజనం పొందాలనే ఆలోచన తప్ప ప్రజలకు నిజంగా లబ్ధి చేకూర్చాలనే ఆలోచన ఏ రోజూ అధికార పార్టీకి లేదు. అధికారంలోకి వస్తే మూడువేల రూపాయలు పింఛన్ ఇస్తానని పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలోనూ హోరెత్తించిన జగన్ అధికారంలోకి వచ్చాక ఏటా పెంపు అంటూ ఆ హామీకి తిలోదకాలు ఇవ్వడంలోనే ఈ విషయం స్పష్టమయింది. తన వాగ్దానం నెరవేర్చకుండా ఆయన ఒక్కో పింఛన్‌దారుడికి రూ. 31,500 మేరకు ఎగనామం పెట్టారు. ముఖ్యమంత్రి మాటల్లోనే చెప్పాలంటే ఎన్నికలకు మూడునెలల ముందు వరకు వైసీపీ ప్రభుత్వం పెంచింది రూ.750 మాత్రమే. ఈ విషయాన్ని దాచిపెట్టి తెలుగుదేశం పార్టీపై నిందలేస్తున్నారు. చంద్రబాబు హయాం ఐదేళ్లకాలంలో పింఛన్‌ను రూ.200 నుంచి రూ.2000కి పెంచారు. అంటే ఏకంగా ఈ పెరుగుదల రూ.1800. అదే ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పెంచింది కేవలం రూ.750 అనే నిజాన్ని ఒప్పుకోవడం లేదు. పింఛన్ లబ్ధిదారుల సంఖ్యను చూసుకున్నా తెలుగుదేశం సర్కార్ పెంచినదే ఎక్కువ. 2014 నాటికి రాష్ట్రంలో 39 లక్షల పింఛన్లు ఉండగా 2019 మే నాటికి వాటిని 54.25 లక్షలకు పెంచారు. కిడ్నీ, తలసేమియా బాధితులకు పింఛన్లు ఇచ్చారు, మత్స్యకారులు, కల్లుగీత, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మకారులకు, హిజ్రాలకు కూడా కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వయోపరిమితిని 65 నుంచి 60 సంవత్సరాలకు తగ్గించినప్పటికీ, గత ఐదేళ్లలో కొత్తగా ఇచ్చిన పింఛన్లు కేవలం 11 లక్షలే. చేయని అభివృద్ధిని, సంక్షేమాన్ని కూడా చేశానని చెప్పుకోవడం తప్ప జగన్‌రెడ్డి తెలుగుదేశం ప్రభుత్వానికి మించి చేసిందేమీ లేదని గణాంకాలే తెలియజేస్తున్నాయి. వాలంటీర్లను ఎన్నికల సంఘం పక్కనపెట్టేయడంతో ఇప్పుడు పింఛన్ల పంపిణీ పేరిట అదే రాజకీయం చేస్తున్నారు. ఈ నీతిమాలిన చర్యలను ఇకనైనా మానుకుని తక్షణమే సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేయాలని తెలుగుదేశం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం.

• కొల్లు రవీంద్ర
టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు



చల్లపల్లిలో సొమ్మసిల్లిపడిపోయి..

- కంకిపాడు మండలం గంగూరులో వజ్రమ్మ (75) అనే వృద్ధురాలు పింఛన్ కోసం ఎదురుచూస్తూ ఇంటి వద్దే కింద పడిపోయి చనిపోయింది.
- చల్లపల్లిలో పొన్న సుబ్బారావు అనే వృద్ధుడు పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.
- బాపులపాడు మండలం కొత్తపల్లిలో ఓ వృద్ధురాలు నడవలేని పరిస్థితిలో ఉన్నా.. ఆమెను స్థానిక వైసీపీ నాయకులు సచివాలయానికి తీసుకొచ్చారు. నడవలేని పరిస్థితిలో ఉన్న ఆమెను యాంగ్యులర్ సాయంతో అలాగే నిలబెట్టారు. వైసీపీ నాయకులు కావాలనే ఆ వృద్ధురాలిని తీసుకొచ్చారని తెలిసింది.

..ఇలా అనేక నరకయాతనల నడుమ వైసీపీ నాయకుల యాక్షన్‌లో, వలంటీర్ల డైరెక్షన్‌లో బుధవారం రెండు జిల్లాల్లో పెన్షన్ల పంపిణీ జరిగింది. ఇదిగో అదిగో.. అంటూ ఎండలో వృద్ధులు, దివ్యాంగులను సచివాలయాల సిబ్బంది ముప్పుతిప్పలు పెట్టగా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు పెన్షన్‌దారులను ఆటోల్లో సచివాలయాలకు తరలించారు. ఇక చాలాచోట్ల వలంటీర్ల పర్యవేక్షణలోనే పింఛన్లు ఇప్పించడం వివాదాస్పదమైంది.



యనమలకుదురు సచివాలయం వద్ద రద్దీ

ఎండలో ఏదీ పింఛెన్



యనమలకుదురు సచివాలయం వద్ద నడవలేని స్థితిలో వృద్ధురాలు, కానూరులో నడవలేక వచ్చిన వృద్ధుడికి పెన్షన్ అందక నిరాశతో వెనక్కి వెళ్లిపోతూ..

సచివాలయాల సిబ్బంది ఓవరాక్షన్

- పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులకు ముప్పుతిప్పలు
- ఎండలో అష్టకష్టాలు పడిన ముదుసలులు
- పింఛన్‌దారులను ఆటోల్లో తిప్పిన వైసీపీ నాయకులు
- సచివాలయాల వద్దే వలంటీర్ల తిష్ట
- నడవలేని స్థితిలోనూ వచ్చిన దివ్యాంగులు
- రాత్రి 7.30 గంటల వరకూ సాగిన పంపిణీ
- కొన్నిచోట్ల అరకొరగానే.. వచ్చినవారు వెనక్కి.

వలంటీర్ల డైరెక్షన్.. వైసీపీ నాయకుల యాక్షన్..

విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : రెండు జిల్లాల్లో కొన్నిచోట్ల బుధవారం మధ్యాహ్నం, మరికొన్నిచోట్ల సాయంత్రం పింఛన్ల పంపిణీ జరిగింది. కదల్లేని స్థితిలో ఉన్న వారందరికీ ఇంటికి వెళ్లి పెన్షన్లు ఇవ్వాల్సి ఉన్నా.. అలా చేయలేదు. సచివాలయాలకు రావాల్సిందేనని ఆదేశించారు. కొందరు తాము ఆసుపత్రుల్లో ఉన్నామని, రాలేమని చెప్పినా వినిపించుకోలేదు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సహనానికి పరీక్ష పెట్టారు. కొన్నిచోట్ల పింఛన్లు ఎప్పుడిస్తారో తెలియక బుధవారం ఉదయం నుంచే పింఛన్‌దారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఉదయం 10.30 గంటలకు సచివాలయాలు తెరిచినా.. ఇంకా నగదు చేతికందలేదని, మధ్యాహ్నం లేదా సాయంత్రం ఇస్తామని సచివాలయ సిబ్బంది చెప్పి పంపేయడంతో వృద్ధులు, దివ్యాంగులు వెనుదిరిగారు. కొన్నిచోట్ల రాత్రి 7.30 గంటల వరకూ పెన్షన్ పంపిణీ జరిగింది. చాలా సచివాలయాల పరిధిలో డబ్బు సరిపడా తీసుకురాలేదు.

ఎక్కడికక్కడ వైసీపీ మాయ

ఎక్కువ మంది వృద్ధులను రప్పించేందుకు అధికార పార్టీ నాయకులు ఫోన్లు మీద ఫోన్లు చేశారు. దీంతో సచివాలయాల వద్ద రద్దీ ఏర్పడింది.

- మిగతా 6లో



కానూరు సచివాలయంలో నిలబడిన వృద్ధులు







పెన్షన్ కోసం కాళ్లు ఈడ్చుకుంటూ వస్తున్న ముదుసలులు, మచిలీపట్నం సచివాలయం వద్ద వలంటీర్ల పర్యవేక్షణ

జిల్లాలో ఇలా..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభించినా విజయవాడ నగరం, జగ్గయ్యపేటలో మాత్రం సాయంత్రం నుంచి చేపట్టారు. కేవలం 43 శాతం మేర పెన్షన్లను పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 2,72,000 మంది పెన్షనర్లు ఉన్నారు. వీరికి రూ.71 కోట్ల మేర పెన్షన్ ఇవ్వాల్సి ఉంది. బుధవారం రాత్రి 8 గంటల నాటికి 1,15,000 మందికి అందించారు. సచివాలయాలకు పూర్తిస్థాయిలో డబ్బు జమ కాలేదు. సచివాలయాలకు పెన్షన్ల డబ్బు రాక ఇబ్బందులు పడుతుంటుంటే, మరోపక్క పెన్షన్ల కోసం రావాల్సిందిగా గ్రామాల్లోని వైసీపీ నాయకులు పెన్షనర్లకు ఫోన్లు చేసి చెప్పారు. దీంతో బుధవారం ఉదయమే వచ్చినవారితో రద్దీ పెరిగింది. వృద్ధులను ఉద్దేశపూర్వకంగా గంటల తరబడి కూర్చోబెట్టారు.

కాల్‌కూట విషం

పెన్షన్ల జాప్యంపై ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్

- ప్రతిపక్షాల వల్లే ఈ పరిస్థితి అని రికార్డింగ్
- మంగళవారం నుంచి ప్రతి పెన్షన్‌దారుడికి..
- వైసీపీ సోషల్ మీడియాలో నకిలీ వీడియోలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పెన్షన్ల పంపిణీపై కుట్రకు తెరలేపిన అధికార పార్టీ.. ప్రతిపక్షాలే టార్గెట్‌గా విషం చిమ్మింది. ఇందుకు వీలుగా ఐవీఆర్ఎస్ అస్త్రాన్ని ప్రయోగించింది. పెన్షన్ల పంపిణీ జాప్యానికి టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణే కారణమని వేర్వేరుగా ఫోన్‌కాల్స్ చేసింది. అపరిచిత ఫోన్ నెంబర్లతో వచ్చిన కాల్స్‌ను లిఫ్ట్ చేయగానే.. పెన్షన్ల పంపిణీలో జాప్యం ప్రతిపక్షాల వల్లేనని అధికార పార్టీ తయారు చేయించిన రికార్డింగ్ వినిపించింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఈ కాల్స్ వస్తూనే ఉన్నాయి. ప్రతిపక్షాల కుట్రల వల్ల పెన్షన్‌దారులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, వలంటీర్ల ద్వారా ఇంటింటికీ మంచి జరుగుతుంటే, ఎన్నికల సమయంలో కక్షకట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆ కాల్స్‌లో వినిపించారు. అధైర్యపడొద్దని, సచివాలయాల్లో పంపిణీ చేయటానికి అన్ని ఏర్పాట్లు చేశామని, ఆధార్ కార్డులను తీసుకుని రావాలని చెప్పారు. వాస్తవానికి వలంటీర్ల నిలుపుదల అనేది ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం. ఓటర్లను ప్రభావితం చేసేలా, రాజకీయ సంఘర్షణలకు తావిచ్చేలా వచ్చిన ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తాయి. వీటిపై తక్షణం ఎన్నికల సంఘం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వైసీపీ సోషల్ మీడియా విభాగం కూడా విష ప్రచారం చేసింది. నకిలీ వీడియోలు కూడా హల్‌చల్ చేశాయి. తమ వద్దకు వచ్చిన వృద్ధుల పట్ల ప్రేమ నటించడం, వృద్ధులు రాగానే వారిని లోపలికి తీసుకెళ్లడం, కుర్చీల్లో కూర్చోబెట్టడం, మంచినీరు, మజ్జిగ ఇవ్వటం వంటివి చేశారు. వీటిని కూడా వైసీపీ సోషల్ మీడియా విభాగం చిత్రీకరించింది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (గురు)

సహర్ (ఉదయం) : 4-46 (శుక్ర)

డీజిల్ దోపిడీ



భవానీద్వీపంలో బోట్లకు వినియోగించే డీజిల్ పక్కదారి

భవానీ ద్వీపంలో దొంగలు పడ్డారు. బెర్మ్‌పార్కును, ద్వీపాన్ని దోచేస్తున్నారు. ద్వీపాన్ని ప్రైవేటుపరం చేయబోతుండటంతో ఈ ఇంటిదొంగలకు మరింత కలిసి వస్తోంది. తాజాగా పర్యాటక బోట్లలో డీజిల్‌ను పక్కదారి పట్టించేసి భారీగా సొమ్ము చేసుకుంటున్న విషయం బయటపడింది.

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న డివిజనల్ అధికారులు
- నాలుగేళ్లుగా ఇదే వరస..!
- ఉన్నతాధికారి కనుసన్నల్లో ఇంటిదొంగల పనే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ద్వీపంలో డీజిల్ దొంగల ముఠా అడ్డంగా దొరికింది. గోనె సంచుల్లో డీజిల్ బాటిళ్లు నింపుకొని తరలిస్తున్న విషయం బుధవారం ఏపీటీడీసీ డివిజనల్ అధికారుల తనిఖీల్లో బయటపడింది. పర్యాటక బోట్లలో ఉపయోగించాల్సిన డీజిల్ నాలుగేళ్లుగా బయటకు తరలిపోతోందని తెలుస్తోంది. వందలకొద్దీ లీటర్ల డీజిల్‌ను ఇలా పక్కదారి పట్టించారని సమాచారం. తప్పు చేసింది రోజువారీ కార్మికులే అయినా, చేయించేది మాత్రం బోటింగ్ యూనిట్‌లో ఇటీవల ప్రవేశించిన కొంతమంది అని తెలుస్తోంది. బోటింగ్ విభాగం ఉన్నతాధికారి ఆశీర్వాదంతో ఇక్కడికి వచ్చినవారే ఈ దారుణానికి ఒడిగట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికీ బోటింగ్ యూనిట్ విభాగ ఉన్నతాధికారి బెర్మ్‌పార్కునే నివాసంగా మార్చేసుకున్నారు. బోటింగ్ విభాగంలోకి తన మనుషులను ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో సస్పెండ్ అయిన వారిని, కేసులు ఉన్న వారిని అవసరం లేకపోయినా యూనిట్‌లోకి తీసుకొస్తున్నారు. హెవీ వెహికల్ డ్రైవర్లుగా ఉన్న వారిని బోటింగ్ యూనిట్‌లో నియమించారు. సాక్షాత్తూ ఉన్నతాధికారి అభయంతో వీరిలో కొందరు రెచ్చిపోతున్నారు. బోట్లలో డీజిల్ దొంగతనాలకు వీరే ప్రేరేపిస్తున్నారని తెలుస్తోంది. బోట్లలో ఉపయోగించాల్సిన డీజిల్‌ను రోజువారీ కార్మికులతో గుట్టుచప్పుడు కాకుండా తరలించటాన్ని విజయవాడ డివిజనల్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దొంగతనానికి పాల్పడిన వారిని విచారణ చేస్తున్నారు.

డీజిల్ వినియోగంపై పర్యవేక్షణేదీ..?

పర్యాటక బోట్లలో డీజిల్ వినియోగంపై ఏపీటీడీసీలోనే ఒక పర్యవేక్షణ విధానమే లేదు. ఇది ఇంటిదొంగలకు వరంగా మారింది. స్పీడ్ బోట్లు మినహా మిగిలిన బోట్లన్నింటికీ డీజిల్‌ను వినియోగిస్తారు. స్పీడ్‌బోట్లకు మాత్రం పెట్రోల్ ఉపయోగిస్తారు. డీజిల్‌ను వినియోగించే బోట్లలోని ట్యాంకులు 200 లీటర్లు, మెకనైజ్‌డ్ బోట్లు అయితే 400 లీటర్ల చొప్పున ట్యాంకుల్లో నింపుతారు. బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్ అయితే, 800 లీటర్ల చొప్పున నింపుతారు. వీటికి సంబంధించి సరైన పర్యవేక్షణ లేదు. ఏ బోటుకు ఎంత ఆయిల్ అవసరమవుతుందో కూడా తెలియదు. ఫలితంగా డీజిల్ పక్కదారి పడుతోంది. పెట్రోల్‌ను కూడా ఇలాగే తరలిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కొంత పెట్రోల్‌ను అప్పుడప్పుడు సదరు అధికారి ఉపయోగించే కారు ట్యాంకులో కూడా నింపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రైవేటీకరణ ముసుగులో..

భవానీ ద్వీపాన్ని త్వరలో ప్రైవేట్ చేతుల్లో పెట్టబోతున్న నేపథ్యంలో ఇంటిదొంగలకు బాగా కలిసి వస్తోంది. డీజిల్‌ను దిగమింగటం ద్వారా లక్షలాది రూపాయలను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏపీటీడీసీ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు రెగ్యులర్ ఉద్యోగుల పర్యవేక్షణను తగ్గించి, ప్రైవేట్ వారితో పెత్తనం చేయిస్తున్నారు. వీరిద్వారా విచ్చలవిడి అవినీతి చేయించటం కోసమే ఉన్నతాధికారులే ఇలాంటి దారుణాలకు తెగబడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

చంద్రబాబు గెలుపు ఖాయం

- దుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ రఘురామకృష్ణరాజు



వన్‌టౌన్, ఏప్రిల్ 3 : ఈ ఎన్నికల్లో చంద్రబాబు విజయం సాధించి, ముఖ్యమంత్రి కావడం ఖాయమని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు (ఆర్ఆర్ఆర్) పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై బుధవారం దుర్గమ్మ పంచహారతుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సామాన్య భక్తులతో కలిసి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మాట్లాడుతూ దుర్గమ్మను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పంచహారతుల కార్యక్రమం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో కూటమి అభ్యర్థిగా తనను ప్రకటిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రకటన వెలువడిన వెంటనే ఆ నియోజకవర్గంలో పర్యటిస్తానన్నారు. ఎన్నికలను అడ్డుపెట్టుకుని పెన్షన్‌దారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. కావాలనే పెన్షన్‌దారులను ఇబ్బందుల్లోకి నెట్టి, నెపాన్ని చంద్రబాబుపైకి తోసేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇబ్బంది పడుతూ పెన్షన్ తీసుకున్న వారి ఉసురు జగన్‌కు తగులుతుందన్నారు.

శ్రీరాంపురం పీఏసీఎస్‌లో రూ.30 లక్షలు స్వాహా

- రైతుల సొమ్ము జమ చేయకుండా పరారైన పీఏసీఎస్ కార్యదర్శి.. అధికారుల విచారణ

రెడ్డిగూడెం, ఏప్రిల్ 3 : రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం పీఏసీఎస్ కార్యదర్శి వి.ప్రభుదాస్ రైతుల సొమ్ము రూ.30 లక్షలతో పరారైన విషయం వెలుగుచూసింది. పీఏసీఎస్ నుంచి పొందిన పలు రకాల రుణాల తాలుకా బకాయిల సొమ్ము రూ.30 లక్షలను ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో పీఏసీఎస్‌లో జమ చేయాల్సి ఉంది. ఆ మొత్తాన్ని విస్సన్నపేట కేడీసీసీ బ్యాంకులో మార్చి 31లోగా జమ చేయాల్సి ఉండగా, బుధవారం వరకూ చేయలేదు. దీంతో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు.. కార్యదర్శి ప్రభుదాసుకు ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కార్యదర్శి సొంత గ్రామమైన కృత్తివెన్ను మండలం కొమ్మలపూడిలోని నివాసంలో విచారణ చేయించారు. అక్కడ ఇంటికి సైతం తాళాలు వేసి ఉండటంతో కార్యదర్శి పరారైనట్లు గుర్తించారు. అనంతరం శ్రీరాంపురం పీఏసీఎస్‌కు వచ్చి రికార్డులు పరిశీలించగా, రైతుల వద్ద నుంచి సుమారు రూ.30 లక్షలు రికవరీ చేసినట్లు గుర్తించారు. ఇంకా రికార్డులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సొమ్మును వసూలు చేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. కాగా, సొసైటీల్లో వరుసగా జరుగుతున్న స్వాహా పర్వాలతో మండల రైతుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొంటున్నాయి. ఇప్పటికే మండలంలోని రెండు సొసైటీల్లో ఇలాంటి ఘటనలు జరిగాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సొసైటీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళా వలంటీర్‌తో పాదపూజ

ఎమ్మెల్యే కొడాలి నానిపై మండిపడుతున్న మహిళా సంఘాలు



గుడివాడ, ఏప్రిల్ 3 : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లను ఎన్నికల కమిషన్ విధుల నుంచి తొలగిస్తుంటే.. గుడివాడలో మహిళా వలంటీర్లు ఏకంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాళ్లకు పాలాభిషేకం చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వారం రోజులుగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు మహిళలతో ఆయన కాళ్లకు పాలాభిషేకం చేయించుకున్నారు. ఎమ్మెల్యే కాళ్లకు పాలాభిషేకం చేసిన వారిలో మహిళా వలంటీర్లు కూడా ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గుడివాడ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన వలంటీర్ హారిక ముఖానికి స్కార్ఫ్ ధరించి నాని కాళ్లకు పాలాభిషేకం చేసింది. కాగా, ఎమ్మెల్యే నాని ఏం సాధించారని మహిళలతో కాళ్లు కడిగించుకున్నారని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.


వసంత నవరాత్రి ఉత్సవాల బ్రోచర్ విడుదల చేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రిపై 9 నుంచి వసంత నవరాత్రులు

19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు : ఈవో రామారావు



వన్‌టౌన్, ఏప్రిల్ 3 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీ నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయ పూజాధికాలలో రోజుకో రకం పుష్పాలతో అమ్మవారిని అర్చించనున్నట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. మహామండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏఈవో రమేష్ బాబు, ఈఈ లింగం రమాదేవి, వైదిక కమిటీ సభ్యులతో కలిసి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈనెల వసంతనవరాత్రులను పురస్కరించుకుని సంప్రదాయంగా వస్తున్న విధివిధానాల మేరకు రోజుకో రకం పూలతో అమ్మవారిని అర్చించనున్నట్టు తెలిపారు. 9న మల్లెపూలు, మరువం, 10న కనకాంబరాలు, గులాబీలు, 11న చామంతి ఇతర పూలు, 12న మందార, ఎర్రకలువలు, 13న తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మరువం, దవనం, 14న కాగాడ మల్లెలు, జాజులు, మరువం, 15న ఎర్రతామరలు, ఎర్రగన్నేరుపూలు, సన్నజాజులు, 16న చామంతులు, సంపెంగలు, 17న కనకాంబరాలు, గులాబీలు, 18న వివిధ రకాల పుష్పాలతో అర్చించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు భక్తుల పూలను విరాళంగా ఇవ్వవచ్చన్నారు. లక్ష్మీగణపతి స్వామి మందిరం వద్ద పుష్పార్చనలో పాల్గొనదలచిన దంపతులు రూ.2,500 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూజ అనంతరం అంతరాలయ దర్శనం, శేషవస్త్రం, రవిక, అమ్మవారి చక్ర పీఠం, పెద్దలడ్డూ ప్రసాదంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి పుష్పార్చనలు ప్రారంభమవుతాయని. 18వ తేదీ పూర్ణాహుతితో ముగుస్తాయని తెలిపారు. ఉగాది పర్వదినాన సాయంత్రం 5.30గంటలకు మల్లిఖార్జున మహామండపం నుంచి వెండి రథోత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉగాది రోజున అమ్మవారి సేవలు నిలుపుదల చేస్తారు. 9 నుంచి 24వ తేదీ వరకు వసంతనవరాత్రులు, చైత్ర మాస బ్రహ్మోత్సవాల కారణంగా రుద్రహోమం, మృత్యుంజయ హోమాలను నిలుపుదల చేస్తారు. ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు 9 రోజుల పాటు శాంతి కల్యాణం, పల్లకిసేవలను నిలుపుదల చేస్తారు. ప్రతి నిత్యం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే ఆర్జిత సేవలు ఉగాది రోజు అరగంట ఆలస్యంగా ప్రారంభిస్తామని భక్తులు వీటిని గమనించాలని కోరారు. 9వ తేదీ ఉగాది రోజున సుప్రభాత సేవ అనంతరం వేకువజామున 3గంటలకు గర్భాలయంలోని అమ్మవారికి ఉపాలయాలలో ఉన్న దేవతామూర్తులకు స్నపనాభిషేకం నిర్వహిస్తారు. అలంకారం, అర్చన, నివేదన, హారతి అనంతరం ఉదయం 8గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుంది. ఉదయం 8.15 గంటలకు వసంతనవరాత్రోత్సవాలకు సంబంధించి కలశస్థాపన అనంతరం ప్రత్యేక పుష్పార్చనలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు ధర్మపదం వేదికపై పంచాంగ శ్రవణ కార్యక్రమం జరుగుతుంది. 4 గంటలకు మండపపూజ, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రహోమం కార్యక్రమాలను యాగశాలలో నిర్వహిస్తారు. 16వ తేదీన చైత్రశుద్ధ అష్టమినాడు క్షేత్ర పాలక ఆంజనేయస్వామివారికి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలు జరుగుతాయి. 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతారాముల కళ్యాణోత్సవాన్ని ధర్మపదం కళావేదికపై నిర్వహిస్తారు. 18వ తేదీన వసంతనవరాత్రోత్సవాలకు సంబంధించి పూర్ణాహుతి నిర్వహిస్తారు. అదేరోజు 11 గంటలకు శ్రీరాముల వారి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 24వ తేదీ ఉదయం పూర్ణాహుతి, ధాన్య కొట్నోత్సవం వసంతోత్సవం అవభృత స్నానం, మూకబలి, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తి అవుతాయి. సాయంత్రం గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులకు పవిత్ర కృష్ణా నదిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 19వ తేదీన వెండిపల్లకి, 20 వతేదీ రావణవాహనం, 21 వతేదీ వెండి రథోత్సవం, 22 వతేదీ నంది వాహనం, 23 వతేదీ సింహవాహన సేవలు ఉంటాయి.

నేడు కాలువలకు తాగునీరు విడుదల

చెరువులను పూర్తిస్థాయిలో నింపండి

ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశాలు



మచిలీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటి అవసరాల కోసం ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం నీటిని విడుదల చేస్తారని, అధికారులు తీరప్రాంతంలోని తాగునీటి చెరువులను నింపేందుకు అన్నిచర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. కలెక్టర్ చాంబరులో బుధవారం ఆమె వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జలవనరులశాఖ అధికారులు జిల్లాలో తాగునీటి అవసరాలకోసం మాత్రమే కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారని ఆమె తెలిపారు. కాలువల ద్వారా వచ్చేనీటిని సముద్రతీరం వెంబడి ఉన్న ప్రాంతాల్లోని చెరువులను పూర్తిస్థాయిలో నింపేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లో తాగునీటి చెరువులను నింపేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాగునీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా ఏర్పాటుచేసిన బృందాలు కాలువల వెంబడి నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. వేసవి తీవ్రతపై వాతవరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు కనీస అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, మునిసిపల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్న అధ్యాపకులు తదితరులు

సముద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలు

కోడూరు, ఏప్రిల్ 3 : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఉమారాణి మార్గదర్శకంలో జాతీయ సేవా పథకం, ఏకో క్లబ్, ఆక్వా కల్చర్ విభాగాల ఆధ్వర్యంలో జీవ వైవిధ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కోడూరు మండలంలోని హంసలదీవి వద్ద ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలారు. అంతరించిపోతున్న జాతుల్లో ఒకటైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు తెలియచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాధిపతులు వీర కుమారి, రవిబాబు, ఏకో క్లబ్ విభాగం అధ్యాపకులు నాగార్జున, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అరకొరగానే.. పింఛన్ల పంపిణీ

సచివాలయ కేంద్రాల వద్ద కానరాని ఏర్పాట్లు

ఎండలో తీవ్ర ఇబ్బందులు పడిన వృద్ధులు

పెనమలూరు, ఏప్రిల్ 3 : అవ్వా తాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు బుధవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ సగంకూడా పూర్తికాలేదు. పెనమలూరు తాడిగడప మునిసిపాలిటీల్లో సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ వద్ద కనీసం మంచినీటి వసతి కూడా లేక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూరల్ మండల పరిధిలో మొత్తం పింఛన్లు 5817 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం 2757 మందికి మాత్రమే పంపిణీ చేశారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో 12885 పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం 5066మందికి మాత్రమే పంపిణీ చేశారు. మొత్తం మీద కనీసం సగం కూడా పంపిణీ జరగలేదు. కానూరు నాల్గవ సచివాలయ పరిధిలో ఇరవై రెండు లక్షల రూపాయలకు పైగా పింఛన్ల సొమ్ము అవసరం ఉండగా అడ్మిన్ ఖాతాకు కేవలం ఎనిమిది లక్షలు మాత్రమే క్రెడిట్ అవడంతో పింఛను పొందకుండానే వెనుదిరిగారు. తాడిగడప కార్మికనగర్ సచివాలయ పరిధిలో పింఛన్ల నిమిత్తం పదమూడు లక్షల రూపాయలకు పైగా అవసరముండగా అడ్మిన్ ఖాతాకు కేవలం ఐదు లక్షలే జమ వడంతో ఇక్కడ కూడా అవ్వాతాతలు నీరసంగా ఇంటి ముఖం పట్టారు. మరో రెండు రోజుల పాటు పంపిణీ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా

కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



హనుమాన్‌జంక్షన్‌రూరల్/గన్నవరం, ఏప్రిల్ 3 : ప్రజలను ప్రలోభాలకు గురిచేసే నగదు, వస్తువులతో పాటు మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్టు కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. బొమ్ములూరు వద్ద చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని పరిశీలించి సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రయాణ సమయంలో రూ.50వేలకు మించి నగదు ఉంటే తప్పనిసరిగా సంబంధిత పత్రాలు చూపాలని సూచించారు. డీఎస్పీ జయసూర్య, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, సీఐ నరసింహమూర్తి, ఎస్సై జనార్ధన్, అర్జమ్మ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. కేసరపల్లి వద్ద చెక్ పోస్టును బుధవారం ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిలు ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

కారులో తరలిస్తున్న 30కిలోల గంజాయి స్వాధీనం


కారులో గంజాయి ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 3 : ఎన్నికల నేపథ్యంలో జాతీయరహదారిపై వాహనతనిఖీల్లో కారులో తరలిస్తున్న 30 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్ములూరు వద్ద బుధవారం సీఐ నరసింహమూర్తి, హనుమాన్‌జంక్షన్ ఎస్సై అర్జమ్మలతో కలిసి తనిఖీలు చేపట్టారు. పూనేకు చెందిన దీపక్ అబాజీ పుపే, ప్రానిక్ ప్రసాద్ జాదవ్‌లు విజయనగరం నుంచి పూణేకు కారు డిక్కీలో 15 ప్యాకెట్లలో సుమారు 30 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని, కారును స్వాధీనం చేసుకుని జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, డీఎస్పీ జయసూర్య చెక్‌పోస్ట్ వద్ద ఆకస్మిక తనిఖీల్లో పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

ఆర్డీవో వాణి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 : అక్రమాలకు పాల్పడితే ఎవరైనా చర్యలు తప్పవని మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి హెచ్చరించారు. బుధవారం తన చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అనుసరించి అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఫేక్ పట్టాలు ఇస్తున్నారన్న ఆరోపణలపై ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో 11వ డివిజన్‌లో ఫేక్ పట్టాతో లబ్ధిదారుడు తన వద్దకు వచ్చాడని, పట్టాలో సరిహద్దులు కానీ, సర్వే నెంబర్లు కానీ లేవన్నారు. దీనిపై విచారణ చేసి డివిజన్‌కు చెందిన వీఆర్వో శ్రీదేవిని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ సస్పెండ్ చేశారన్నారు. శ్రీదేవికి ఈ పట్టా ఇచ్చినట్టు తెలిసినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకపోవడం వల్ల సస్పెండ్ చేశామన్నారు. వాస్తవాలను వెల్లడించకుండా అలసత్వం చూపిన వారిపై చర్యలు తప్పవన్నారు.

ఫిర్యాదులు పెడచెవిన పెట్టారు

వైసీపీ నేతల అక్రమాలను ప్రోత్సహించినందుకే కలెక్టర్, ఎస్పీ జాషువాలపై వేటు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 : వైసీపీ నాయకుల అక్రమాలను ప్రోత్సహించినందునే కృష్ణా కలెక్టర్ రాజాబాబు, చిత్తూరు ఎస్పీ జాషువాలపై ఎన్నికల కమిషన్ వేటు వేసిందని, ఇప్పటికైనా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం పోతేపల్లిలో విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. వైసీపీ నాయకుల దొంగ ఓట్ల వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లగా.. కోర్టులో కేసు నడిచిందన్నారు. అప్పటి ఆర్డీవో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారన్నారు. ఇంత జరిగినా కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. నకిలీ పట్టాలపై పలు పర్యాయాలు ఫిర్యాదులు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినా పట్టించుకోలేదన్నారు. అక్రమంగా అధికార పార్టీ నేతలు వందలాది ట్రక్కుల్లో మట్టిని తవ్వుకు పోతున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రతిసారీ ఎమ్మెల్యే పేర్ని నానికి, వైసీపీ నేతలకు కలెక్టర్ కొమ్ము కాసారన్నారు. గతంలో కృష్ణా ఎస్పీగా ఉన్న జాషువా వైసీపీ అధికార పెద్దల మాటలు విని అక్రమంగా టీడీపీ కార్యకర్తలపై కేసులు బనాయించారన్నారు. మంత్రి జోగి రమేశ్ వత్తిళ్లతో పెడన సర్కిల్‌లో పనిచేస్తున్న పోలీసు సిబ్బందిని పెనమలూరుకు బదిలీ చేశారన్నారు. మచిలీపట్నంలో పేర్నినానికి అనుకూలమైన సిబ్బందిని బదిలీ చేయకుండా అక్కడే ఉంచేశారన్నారు. ఎస్పీ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్న సీఐలు, ఎస్సైలను బదిలీ చేయాలన్నారు. వీటిపై ఈసీ దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కుంచే నాని, దిలీప్, చిన్నం శివ, జనసేన నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

అమృత్-2పై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం

బందరు ఎంపీ బాలశౌరి ఎద్దేవా

పెనమలూరు, ఏప్రిల్ 3 : పట్టణాల్లో డ్రెయిన్లు, మంచినీరు, రోడ్లు లాంటి మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్-2 పథకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవడంలో విఫలమైందని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. బుధవారం కానూరు మన గార్డెన్స్ సమీపంలోని ఇంద్ర ఐకాన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి స్థానికులతో మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్-2 పథకానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా నలభై శాతం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని పేర్కొన్నారు. విజయవాడ, తాడిగడప ప్రాంతాలకు కృష్ణా, గోదావరి జలాలను తెచ్చి ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు బోడె ప్రసాద్‌తో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి, చిత్రంలో బోడె ప్రసాద్ తదితరులు

వృద్ధురాలి మృతికి అధికారులే కారణం..



గంగూరు (కంకిపాడు) : పింఛన్ల పంపిణీలో అధికారుల బాధ్యతారాహిత్యంపై వల్లభనేని బాలశౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగూరులో పింఛన్ కోసం వెళ్లి మృతి చెందిన వజ్రమ్మ మృతదేహాన్ని బుధవారం ఆయన సందర్శించి, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, వృద్ధురాలి మృతికి అధికారులే కారణమన్నారు. ఎన్నికల నిబంధనలు ఉండగా పింఛన్ పంపిణీకి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సచివాలయ, పంచాయతీ సిబ్బంది చేత సకాలంలో పింఛన్ పంపిణీ చేయలేకపోవడం సిగ్గుచేటన్నారు.

ఎండలో ఏడిపింఛెన్!

(5వ పేజీ తరువాయి)

ఈ రద్దీని ఎక్కువగా చూపించడానికి విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల్లో సాయంత్రం వరకు కూడా పింఛన్లు ఇవ్వలేదు. అదేమని అడిగితే.. బ్యాంకుల నుంచి ఇంకా డబ్బు రాలేదని సమాధానం చెప్పారు. దీంతో వృద్ధులు రెండు, మూడు గంటలకు పైగా అక్కడే పడిగాపులు పడాల్సి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగుల




ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తారని చెప్పినా వైసీపీ నాయకులు వారిని ఆటోల్లో సచివాలయాల వద్దకు తీసుకొచ్చారు. కొందరు వృద్ధులు నడవలేని స్థితిలో, కళ్లు సక్రమంగా కనిపించకున్నా ఇబ్బందులు పడుతూ వచ్చారు. అవనిగడ్డ మండలంలో ఆటోల ద్వారా పింఛనుదారులను సచివాలయాలకు తీసుకొచ్చారు. ఎన్నికల ప్రచారం కోసం వైసీపీ నాయకులు వృద్ధులు, దివ్యాంగులను ఇలా వాడుకున్నారు.

చాలాచోట్ల వలంటీర్లు ప్రత్యక్షం

వలంటీర్లు పింఛన్ పంపిణీకి దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసినా పెద్దగా పట్టించుకోలేదు. వైసీపీ నాయకుల సూచనలతో వలంటీర్లు సచివాలయ వద్దే కనిపించారు. మచిలీపట్నంలోని 45వ డివిజన్‌లో పదిమందికి పైగా వలంటీర్లు పింఛనుదారులను ఆటోల్లో తీసుకొచ్చారు. కొంతమంది పింఛనుదారులకు వలంటీర్లు ఫోన్లు చేసి మరీ సచివాలయం వద్దకు పిలిపించారు. సచివాలయం వద్ద వలంటీర్లు ఉండగా, మీడియా వారు ఫొటోలు తీశారు. వైసీపీ 45వ డివిజన్ ఇన్‌చార్జి ఎ.శ్రీనివాస్ అక్కడకు వచ్చి.. వలంటీర్ల ఫొటోలు ఎవరు తీశారంటూ వీరంగం సృష్టించాడు. ఫొటోలు తీసిన వారిపై కేసు పెట్టాలంటూ పెద్దపెద్ద కేకలు వేశాడు. 45వ డివిజన్ కార్పొరేటర్ ఓ మహిళ కాగా, తానే డివిజన్‌కు ఇన్‌చార్జినంటూ ఈయన చేసే హంగామా అంతా ఇంతా కాదని అక్కడున్న పింఛనుదారులే గుసగుసలాడుకున్నారు. తాము తీసుకొచ్చిన పింఛనుదారులు బయటకు వచ్చే వరకు వలంటీర్లు అక్కడే వేచి ఉన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపించింది.


పర్నాసలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో వెనిగండ్ల, రావి తదితరులు

టీడీపీ హయాంలోనే అభివృద్ధి : వెనిగండ్ల

గుడివాడ రూరల్, ఏప్రిల్ 3 : పర్నాస గ్రామంలో గత 20 సంవత్సరాల్లో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి తప్ప కొడాలి నాని చేసింది ఏమీ లేదని గుడివాడ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం వెనిగండ్ల రాము చినవానిగూడెం, పర్నాస గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ'పై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్నాసలో అభివృద్ధి మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, రావి హయాంలోనే జరిగిందని, కొడాలి నాని చేసిన అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి బూతులు తిట్టడమే అలవాటుగా మారిందని తెలిపారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గుడివాడ, ముదినేపల్లి (పాతది) నియోజకవర్గాలను తమ కుటుంబం చాలా అభివృద్ధి చేసిందన్నారు. తాను మంత్రిగా చేసిన పనులు ఇప్పుడు కనపడుతున్నాయని తెలిపారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కొడాలి నాని గుడివాడకు చేసిన అభివృద్ధి రోడ్లపై అడుగడుగునా కనిపించే గుంతలే సమాధానమిస్తాయన్నారు. కార్యక్రమంలో గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జీ), మండల అధ్యక్షులు వాసే మురళీ తదితరులు పాల్గొన్నారు.

వేధించి.. బెదిరించి.. కటకటాల వెనక్కు!

ప్రేమ పేరుతో యువతికి వేధింపులు!

పోలీసులను ఆశ్రయించిన తండ్రి

షాపులో గంజాయి పెట్టి బెదిరింపులు

ఇద్దరు యువకులపై కేసు నమోదు

గుడివాడ, ఏప్రిల్ 3 : ఇద్దరు యువకులు యువతిని వేధిస్తుండటంతో విసిగివేశారిన తండ్రి పోలీసులు ఆశ్రయించాడు. దీంతో కోపోద్రిక్తులైన యువకులు సదరు తండ్రి దుకాణంలో గంజాయిని డంపింగ్ చేసి బెదిరింపులకు పాల్పడి, కటకటాల పాలైన సంఘటన గుడివాడలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పెద్దవీధికి చెందిన వ్యక్తికి రైతు బజారు సమీపంలో ఫ్యాన్సీ దుకాణం ఉంది.

అతడి కుమార్తెను కొంతకాలంగా ధనాల ప్రవీణ్, శశిలు వేధిస్తున్నారు. ఈ క్రమంలో తండ్రి ఒన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కాలయాపనతో వేధింపులు మరింత పెరిగాయి. ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న ఇద్దరు యువకులు కోపోద్రిక్తులై పథకం ప్రకారం తండ్రి ఫ్యాన్సీ దుకాణంలో గంజాయి డంప్ చేశారు. అది వీడియో తీసి బ్లాక్‌మెయిల్‌కు దిగారు. విషయాన్ని ఇంతటితో వదిలేయాలంటే తమకు రూ.2లక్షలు ఇవ్వాలని, లేకుంటే పోలీసులకు రూ.5లక్షలు యిచ్చుకోవాల్సి వస్తుందని బెదిరించడంతో సమీప దుకాణదారులు, స్థానికులు యువకులను నిలదీశారు. దీంతో యువకులు తమపై దుకాణదారుడు దౌర్జన్యం చేస్తున్నాడని, దుకాణంలో గంజాయి అమ్మకాలు చేస్తున్నట్టు టూటౌన్ పోలీసులకు పిర్యాదు చేశారు. 10నిమిషాల్లోనే టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి దుకాణదారుడిని స్టేషన్‌కు తరలించారు.

తన కుమార్తెను వేధిస్తున్నారని పిర్యాదు చేస్తే వెంటనే స్పందించని పోలీసులు.. ఇంత త్వరగా రావడం పట్ల దుకాణదారుడు ఆశ్చర్యపోయాడు. స్థానికులు పెద్దఎత్తున స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగడంతో ఎట్టకేలకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా యువకులే గంజాయిని డంప్ చేశారని టూటౌన్ పోలీసులు నిర్ధారించారు. యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ దుర్గారావు తెలిపారు. దీంతో గంజాయి వారికి ఎక్కడి నుంచి వచ్చింది.. అమ్మకాలు చేస్తున్నదెవరో తేల్చేందుకు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం.


పెరిశేపల్లి గ్రామంలో పోలీసులు గుర్తించిన చీరల బండిల్స్

కృష్ణాలో రూ.10లక్షల విలువైన చీరల బండిల్స్ పట్టివేత

పామర్రు, ఏప్రిల్ 3 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన రూ.10 లక్షల ఖరీదుచేసే 7680 చీరలను కృష్ణాజిల్లా పామర్రు పరిధిలోని పెరిశేపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పెరిశేపల్లికి చెందిన చాపరాల వెంకటరమణ ఇంట్లో చీరల బండిల్స్ ఓటర్లకు పంచేందుకు దిగుమతిచేసుకున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బంది తనిఖీ చేశారు. పోలీసులు జరిపిన సోదాల్లో 46 బండిల్స్ లభ్యమైనట్టు తెలిపారు. చీరల బండిల్స్‌ను సీజ్‌చేసి కేసు విచారణ జరుపుతున్నామన్నారు. తనిఖీల్లో పామర్రు సీఐ శుభాకర్, ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు. అయితే గ్రామంలోని ప్రముఖ ఆలయంలో ఉత్సావాల కోసం వాటిని తీసుకొచ్చినట్టుగా గ్రామస్థులు చెబుతున్నారు.

ఎమ్మెల్సీ రుహుల్లాపై కేసు నమోదు

పాయకాపురం, ఏప్రిల్ 3 : వైసీపీ ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఓ మసీదు కమిటీకి డబ్బులు పంపిణీ చేసిన విషయమై ఎలక్షన్ కమిషన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. పాయకాపురం 64వ డివిజన్ కండ్రిక కాలనీలో గత నెల 24వ తేదీ ప్రార్థనల పేరుతో ఎమ్మెల్సీ రుహుల్లా మసీదుకు వెళ్లారు. అనంతరం ఏ కారణం లేకుండా మసీదు కమిటీ పెద్దలకు రూ.2 లక్షల నగదును అందజేశారు. ఈ విషయమై సమాచారం తెలుసుకున్న ఎలక్షన్ కమిషన్ అధికారులు ఆరా తీశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మసీదు పెద్దలకు నగదును ఇవ్వడం చట్టరీత్యా నేరం కావడంతో అతడిపై ఎన్నికల అధికారులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించినందుకుగాను సెక్షన్ 188 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై భారీగా ఫిర్యాదులు

సీ విజిల్‌కు 281, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసు పోర్టల్ ద్వారా 235 ఫిర్యాదులు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఓటర్ల ప్రలోభాలు, డబ్బు, మద్యం పంపిణీ, కోడ్ ఉల్లంఘనలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 720 ఫిర్యాదులు అందాయి. సీ-విజిల్ మొబైల్ అప్లికేషన్ అత్యధికంగా 281 ఫిర్యాదులు వచ్చాయి. నేషనల్ గ్రీవెన్స్ సర్వీసు పోర్టల్ ద్వారా అత్యధికంగా 235 ఫిర్యాదులు వచ్చాయి. ఓటర్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ 1950 ద్వారా 67 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా కంట్రోల్‌రూమ్‌లో ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబర్ 9154970454కు అత్యల్పంగా 18 ఫిర్యాదులు వచ్చాయి. కాల్‌సెంటర్ నెంబర్ 0866-2570051కు 18 ఫిర్యాదులు వచ్చాయి. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా 32 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాకు సంబంధించి నేరుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) మెయిల్‌కు 26 ఫిర్యాదులు వచ్చాయి.

రైతుల సొమ్ముతో పీఏసీఎస్ కార్యదర్శి పరార్!

రూ.30 లక్షలు కేడీసీసీలో జమ చేయని వైనం

ఆందోళన చెందొద్దు : బ్యాంకు మేనేజర్

రెడ్డిగూడెం, ఏప్రిల్ 3 : ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం పీఏసీఎస్ కార్యదర్శి వి.ప్రభుదాస్ రైతుల సొమ్ము రూ.30 లక్షలతో పరారైనట్టు తెలుస్తోంది. పీఏసీఎస్ నుంచి పొందిన పలు రకాల రుణాల తాలుకా బకాయిలను ఫైనాన్సియల్ ఇయర్ క్లోజింగ్ కావడంతో పీఏసీఎస్‌లో సుమారు రూ.30 లక్షలు జమ చేశారు. ఆమొత్తాన్ని విస్సన్నపేట కేడీసీసీ బ్యాంకులో కార్యదర్శి మార్చి 31లోగా జమచేయాల్సి ఉండగా ఏప్రిల్ 3 తేదీ వరకు జమ చేయలేదు. దీంతో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావులు కార్యదర్శి ప్రభుదాసుకు ఫోన్‌చేశారు. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో కార్యదర్శి సొంత గ్రామమైన కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం కొమ్మలపూడిలోని నివాసంలో విచారణ చేయించారు. అక్కడ ఇంటికి సైతం తాళాలు వేసి ఉండటంతో కార్యదర్శి పరారైనట్టు గ్రహించి బుధవారం మేనేజర్, సూపర్‌వైజర్‌లు శ్రీరాంపురం పీఏసీఎస్‌కు వచ్చి రికార్డులు పరిశీలించగా రైతుల నుంచి సుమారు రూ.30 లక్షలు రికవరీ చేసినట్టు గుర్తించారు. ఇంకా రికార్డులు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుల సొమ్మును అతడి నుంచి వసూలు చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. సొసైటీల్లో వరుస స్వాహాపర్వాలతో మండల రైతుల్లో ఆందోళనలు నెలకొంటున్నాయి. ఇప్పటికే మండలంలో రెండు సొసైటీల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సొసైటీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



లయోలలో ముగిసిన ప్రాజెక్ట్‌ల ప్రదర్శన



భారతీనగర్, ఏప్రిల్ 3: ఆంధ్రా లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇన్నోవేషన్ 2024 ప్రాజెక్టు ప్రదర్శన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఈ, ఐటీ విభాగాల విద్యార్థులు 58 ప్రాజెక్ట్‌లు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనల్లో ఐటీ విభాగంలో 106 మంది విద్యార్థులు కలిసి 34 ప్రాజెక్ట్‌లు, సీఎస్‌ఈ విభాగంలో 120 మంది విద్యార్థులు కలిసి 24 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.జోజిరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్ట్‌లు విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికి తీస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, సిస్టర్ క్యాండీ, వివిధ విభాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళలకు రక్షణ

4వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో కేశినేని శ్రీదేవి

భారతీనగర్, ఏప్రిల్ 3: టీడీపీతోనే మహిళలకు రక్షణ అని, మహిళల అభివృద్ధికి టీడీపీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని కేశినేని శ్రీదేవి అన్నారు. బుధవారం 4వ డివిజన్‌లోని వరలక్ష్మీనగర్‌లో కేశినేని శ్రీదేవి, జాస్తి సాంబశివరావులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ, జనసేన బలపరిచిన విజయవాడ టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, నాయకులు మాణిక్యం, భాస్కర్, కూరపాటి సురేంద్ర, రాజమణి, సూర్య కుమారి, మాధవి, మధు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న కేశినేని శ్రీదేవి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యువనాయకుడు కేశినేని వెంకట్

మహిళాభివృద్ధే టీడీపీ ప్రధాన లక్ష్యం
కేశినేని వెంకట్

గుణదల: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతోపాటు మహిళాభివృద్ధే లక్ష్యంగా పనిచేయనున్నట్లు టీడీపీ యువనాయకుడు కేశినేని వెంకట్ తెలిపారు. బుధవారం ఆయన ఐదవ డివిజన్ పరిధిలోని పెద్దబావి సెంటర్ నుంచి ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని), తూర్పు ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీఎన్‌టీయూసీ నాయకులు రేపాకుల శ్రీనివాస్, టిడిపి నాయకులు షేక్ కమీముల్లా, సొంగా సంజయ్ వర్మ, పి.చరణ్ సాయి యాదవ్, 5వ డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్ కుమార్, దోమకొండ రవికుమార్, జనసేన నాయకులు అల్లిబిల్లి రామకృష్ణ, కోడూరు సుబ్రహ్మణ్యం, రాచమల్ల ఆంజనేయులు, మోజెస్, మాచర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గానగర్‌లో...

సత్యనారాయణపురం: 30వ డివిజన్ విజయదుర్గానగర్‌లో బుధవారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేశినేని వెంకట్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేశినేని చిన్ని ఎంపీ కాగానే విజయవాడ పట్టణాభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. నేతలు చౌదరి సూర్యనారాయణ, గొట్టుముక్కల శేషంరాజు, లక్కంరాజు, శ్రీనివాసరాజు, గరిమెళ్ల చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే కూటమి అధికారంలోకి రావాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

లబ్బీపేట, ఏప్రిల్ 3: కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్లతో పెన్షన్లను పంపిణీ చేయవద్దని మాత్రమే చెప్పిందని, డోర్ టు డోర్ పంపిణీ చేయవద్దని చెప్పలేదని, పెన్షన్‌దారులను ఇబ్బంది పెట్టి దాన్ని చంద్రబాబుపై నెట్టి రాజకీయ లబ్ధిపొందాలని జగన్ చూస్తున్నారని, ఆ పాపం జగన్ ప్రభుత్వానికి తగులుతుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పేర్కొన్నారు. బుధవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ కట్ట చివర గద్దె అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాలో డబ్బులు లేవని చెప్పకుండా జగన్‌మోహనరెడ్డి కేవలం రాజకీయ లబ్ధికోసం పెన్షన్‌దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, డోర్ టు డోర్ పెన్షన్ పంపిణీ చేయడానికి జగన్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటో చెప్పాలన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అధికారంలోకి రావాలని అన్నారు. గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరారు. 19వ డివిజన్‌లో : 19వ డివిజన్ బందరు రోడ్డు, వెంకటేశ్వరస్వామి గుడి రోడ్డుల్లో గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న గద్దె అనూరాధ

మే 13 తర్వాత జగన్ ఇంటికి వెళ్లడం ఖాయం
గద్దె క్రాంతికుమార్

పటమట: జగన్ ప్రభుత్వంలో 10 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచారని, ప్రజలకు జగన్ కరెంట్ ఛార్జీల షాక్ ఇస్తే ప్రజలు మే 13న ఓటు ద్వారా జగన్‌కు షాక్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని యువ టీడీపీ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. 12వ డివిజన్ చౌదరిపేట, వీఎస్ఆర్ రోడ్డుల్లో జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని క్రాంతి స్థానిక కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబుతో కలిసి నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై రూపొందించిన కరపత్రాలను పంచిపెట్టారు. శాయన బుజ్జి, నీరజ, మాదల చిన్నతల్లి, కె. రాంబాబు, కె.రవి, కె.లక్ష్మీప్రసాద్, ఎం.నారాయణలు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

పటమట, ఏప్రిల్ 3 : సచివాలయ సిబ్బంది ద్వారా బుధవారం సాయంత్రం నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తారన్న ప్రభుత్వ ప్రకటనతో పింఛన్‌దారులు వార్డు సచివాలయాల వద్ద మధ్యాహ్నం నుంచి పడిగాపులు కాశారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని దర్శిపేటలో 283 సచివాలయం వద్ద ఎదురుచూస్తున్న పింఛన్‌దారులకు బ్యాంకుల నుంచి ఇంకా డబ్బులు రాలేదు. వచ్చిన తర్వాత పంపిణీ చేస్తామని చెప్పటంతో విధిలేని పరిస్థితిలో సచివాలయంలోపల, బయట ఎదురు చూశారు. సాయంత్రం 7 గంటలకు పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సచివాలయం పరిధిలో 212 మంది పెన్షనర్లు ఉండగా వంద మందికి మాత్రమే పెన్షన్ పంపిణీ చేశారు.



283 సచివాలయం లోపల పింఛన్ కోసం ఎదురుచూస్తున్న మహిళలు

గొల్లపాలెంగట్టు ప్రాంతంలో అన్న క్యాంటీన్

చిట్టినగర్, ఏప్రిల్ 3: టీడీపీ నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని) కేశినేని ఫౌండేషన్ సహకారంతో బుధవారం 50 వ డివిజన్ గొల్లపాలెంగట్టు ప్రాంతంలో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందజేశారు. తెలుగుయువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్ మాధవ, నాయకులు కె. కొప్పుల గంగాధర్‌లు పాల్గొని పేదలకు భోజనం అందజేశారు. నాయకులు కాళ్ల ఈశ్వర్, వీర్ల వాసు యాదవ్, శ్రీనివాస్, పాపారావు, అడ్డూరి శంకర్, బాలరాజు పాల్గొన్నారు.

వెలంపల్లి పెట్టిన కేసులో
కోర్టుకు హాజరైన ఉమ్మడి చంటి

వన్‌టౌన్, ఏప్రిల్ 3: 52 వ డివిజన్‌లో గతంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తన ఇంటి ఎదుట ధర్నా చేసినందుకు పెట్టిన కేసులో వార్డు టీడీపీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, గణపా రామారావు, నందం భవానీ ప్రసాద్, ఈగల సాంబశివరావు, రాజగిరి అశోక్ తదితరులు బుధవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీ నాటికి విచారణ వాయిదా పడింది. డివిజన్‌లో నిర్వహించిన ప్రభుత్వ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌ను అమలు చేయకుండా కార్పొరేటర్‌ను పిలవనందుకు నిరసనగా ఆనాటి మంత్రి నివాసం ఎదుట చంటి , మరికొందరు ధర్నా చేశారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఖ్యాతిశ్రీ పుట్టినరోజు సందర్భంగా
కొత్త ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం

పటమట, ఏప్రిల్ 3 : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ కుమార్తె డాక్టర్ ఖ్యాతిశ్రీ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రామకృష్ణ ఆధ్వర్యంలో విజయవాడ కొత్త గవర్నమెంట్ హాస్పిటల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ గద్దె శేషగిరి, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, సెక్రటరీ రాజా, ప్రముఖ ఎన్ఆర్ఐ బొబ్బా రాము, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోటుపల్లి సత్యనారాయణలు పాల్గొని ఖ్యాతిశ్రీకి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలిపారు.

శ్రీరామ యాత్ర జయప్రదం చేయండి

● శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పిలుపు



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న శివస్వామి

సత్యనారాయణపురం, ఏప్రిల్ 3 : అయోధ్య రామ మందిరాన్ని నిర్మించుకున్న శుభ సందర్భంగా శ్రీరామనవమి రోజున దేశవ్యాప్తంగా నిర్వహించే బైక్ ర్యాలీలో భక్తులు పాల్గొని శ్రీరామ యాత్రను జయప్రదం చేయాలని శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పిలుపునిచ్చారు. సత్యనారాయణపురంలోని ఆంజనేయ స్వామి గుడిలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు చేసి బైక్ ర్యాలీ స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ ఈనెల 17న శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ సత్యనారాయణపురంలోని శ్రీరామకోటి నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న అంజనా సిన్హా



అంజనాసిన్హాకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు

చిట్టినగర్, ఏప్రిల్ 3: చిట్టినగర్‌లో ఉన్న పద్మావతి, గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామికి బుధవారం రాష్ట్ర పోలీస్ డీసీపీ, రోడ్డు సేఫ్టీ అథారిటీ అంజనా సిన్హా కుటుంబ సమేతంగా దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి జ్ఞాపికను అందజేశారు. రాంపిళ్ల శ్రీను, రాయన గురునాధరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణపై పోతిన కసరత్తు

వన్‌టౌన్, ఏప్రిల్ 3: జనసేన అభ్యర్థిగా పశ్చిమ నుంచి పోటీ చేసే అవకాశం కోల్పోయిన జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ తన భవిష్యత్ కార్యాచరణపై కసరత్తు చేస్తున్నారు. పశ్చిమ సీటును మహేశ్‌కే కేటాయించాలని కోరుతూ మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో వారందరితోనూ బుధవారం పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. కేసులకు భయపడవద్దని, అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బైపు రామకృష్ణ, లండ ప్రశాంత్, సోమి మహేష్, నాగోతి సాయి, దాసిన జగదీష్,దాసిన గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడే సీపీఐని గెలిపించండి

● నాయకులు దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు


వన్‌టౌన్, ఏప్రిల్ 3: కార్మికుల హక్కులను కాపాడే సీపీఐను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ నాయకులు దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావులు తెలిపారు. బుధవారం ఇండియా కూటమి బలపరచిన పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న జి.కోటేశ్వరరావు వన్‌టౌన్ పరిధిలో వస్త్రలతలో క్లాత్ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలు కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న ఇండియా కూటమి బలపరచిన సీపీఐను వచ్చే ఎన్నికలలో గెలిపించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో జి.కోటేశ్వరరావును గెలిపించాలని కోరారు. నాయకులు ఎం.సాంబశివరావు, కేఆర్ ఆంజనేయులు, ముఠా యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

దర్గా ప్లాట్స్ రోడ్డును చదును చేశారు

● సొంత ఖర్చుతో గుంతలను పూడ్చుకున్న సొసైటీ సభ్యులు

భవానీపురం, ఏప్రిల్ 3 : 41వ డివిజన్ మహ్మదీయ కో-ఆపరేటివ్ సొసైటీ(దర్గా) ప్లాట్లలో కీలకమైన గొల్లపూడి రోడ్డుకు కలిసే మట్టి రోడ్డును సొసైటీ సభ్యులు చేయిచేయి కలిపి గుంతలను పూడ్చించుకున్నారు. భవానీపురం పరిధిలోని హెచ్‌బీ కాలనీ నుంచి గొల్లపూడి వెళ్లే ఈ రోడ్డులో భారీ వాహనాల వెళుతుంటాయి. ఇతర వాహనాలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు గోతులతో ఉన్న ఈ రోడ్డే శరణ్యం. ఒక్కొక్కసారి సరుకుతో వెళ్లే లోడు లారీలు సైతం గోతుల్లో పడి సరుకు నేలపాలైన సందర్భాలున్నాయి. 500 కుటుంబాల ప్రజల ఇక్కడ 30 ఏళ్ల నుంచి నివసిస్తున్నా కనీస సదుపాయాల్లేక వెంపర్లాడుతున్నారు.ఇక్కడ సమస్యలపై స్వయంగా వీఎంసీ కమిషనర్ దినకర్ , ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులకు చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. మొక్కుబడిగా వీధిలైట్లు వేసి చేతులు దులిపేసుకున్నారు.

దీంతో సొసైటీ అధ్యక్షుడు అట్లూరి బెనర్జీ, గౌరవాధ్యక్షుడు రంగయ్య, సభ్యులు నల్లపనేని రవికుమార్‌లు చొరవ తీసుకుని సభ్యుల నుంచి కొంత డబ్బులు వేసుకుని 40 ట్రక్కుల గ్రావెల్‌ను పోసి బుధవారం చదును చేయించారు. ఎన్నికలు అయ్యాక అయినా పాలకులు, అధికారులు ఈ రోడ్డును బీటీ రోడ్డుగా వేయడంతో పాటు డ్రెయిన్లు అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.



మట్టిరోడ్డుపై గ్రావెల్‌ను పరుస్తున్న ట్రాక్టర్, చదును చేస్తున్న ఎక్స్‌వేటర్



మట్టిరోడ్డు బాగు చేసేందుకు వేసిన గ్రావెల్

ఠాగూర్ గ్రంథాలయంలో చోరీయత్నం

వన్‌టౌన్, ఏప్రిల్ 3: బందర్‌రోడ్డులోని ఠాగూర్ గ్రంథాయలంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించినట్లు బుధవారం గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం ఠాగూర్ గ్రంథాలయంలో కొల్లూరి రమాదేవి గ్రేడ్-1 లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నారు. గత నెల 22న లైబ్రరీలో సిబ్బందితో విధులు ముగించుకుని ఆరోజు సాయంత్రం 5.30కు గ్రంథాలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు స్వీపర్ లైబ్రరీకి వచ్చి చూడగా గ్రంథాలయం లోపల వస్తువులు చిందరవందరగా పడవేసి బీరువా పగులకొట్టి ఉంది. రమాదేవి ఈ విషయాన్ని పైస్థాయి అధికారులకు సమాచారం తెలియపరచి వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విజయ ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం

ఎనికేపాడు(గన్నవరం), ఏప్రిల్ 3 : ఎనికేపాడు ఎస్ఆర్‌కే ఫౌండేషన్ విజయ మహిళ ఫార్మసీ కళాశాల 15వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఫార్మా రంగానికి మంచి భవిష్యత్ ఉందన్నారు. ఫార్మాసిస్టుల కొరత విపరీతంగా ఉందన్నారు. మహిళలు ఔషధ రంగంలో రాణించటం వల్ల వారి కుటుంబం ఉన్నతంగా ఉంటుందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రమీలరాణి మాట్లాడుతూ, ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత తదితరులు పాల్గొన్నారు.



మీ ఫ్యామిలీకి ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ ఇది

విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు ఈ సినిమాను నిర్మించారు. మంగళవారం రాత్రి దూలపల్లి మైసమ్మ గూడలోని కాలేజ్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది. విజయ్ ఇప్పటివరకూ చేసిన నటన ఒక ఎత్తయితే, ఇందులో ఇచ్చిన పెర్ఫార్మెన్స్ మరో ఎత్తు. అలాగే మృణాళిని కూడా అద్భుతంగా నటించింది. బ్లడ్ అండ్ సోల్ పెట్టి ఈ సినిమా చేశాను. దిల్‌రాజుగారి బేనర్‌లో వర్క్ చేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది' అన్నారు.

'మీరంతా ఎగ్జామ్స్ రాసి పాసయిన తర్వాత నెక్స్ట్ క్లాస్‌లోకి వెళ్లడమే కాదు ఈ సినిమా చూసి ఫ్యామిలీ స్టార్స్ అవుతారు. ఈ సినిమాలో విజయ్ నటన అమ్మాయిలకు బాగా నచ్చుతుంది. అతని పాత్రను దర్శకుడు పరశురామ్ బాగా డిజైన్ చేశాడు. నవ్విస్తాడు, ఫైట్స్ చేస్తాడు. కోపం వస్తే కొట్టమని హీరోయిన్‌తో తన్నులు తింటాడు. మీరందరూ కూడా బాగా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు దిల్ రాజు.

హీరోయిన్ మృణాళిని మాట్లాడుతూ 'ఇందు పాత్ర పోషించడం మొదటి 15 రోజులు చాలా కష్టంగా అనిపించింది. ఆ తర్వాత ఆ పాత్రను నా కంటే గొప్పగా ఎవరూ చేయలేరన్న సంతోషం కలిగింది. 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని మా ఫ్యామిలీ స్టార్ అయిన నాన్నకు అంకితం ఇస్తున్నా' అన్నారు

'ఆరేళ్ల క్రితం నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ 'గీత గోవిందం'. అదే దర్శకుడితో 'ఫ్యామిలీ స్టార్' చేశా. నా సినిమా రూ.వంద కోట్లు వసూలు చేయాలనే కల ఆ సినిమాతో తీరింది. మళ్లీ అటువంటి సినిమా నాకు రాలేదు. 'పెళ్లిచూపులు' నుంచి 'ఫ్యామిలీస్టార్' దాకా నేను చేసిన ప్రతి సినిమా ఏదో ఒక కొత్త విషయం నేర్పించింది. ఇబ్బందులు, అవరోధాలు, అవమానాలు ఎదురైనా వాటిని దాటుకుని అనుకున్నది సాధించాలి. అదే నమ్మకంతో నేను పనిచేస్తుంటా. మీ ఫ్యామిలీకి మా టీమ్ ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ 'ఫ్యామిలీ స్టార్'. చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు విజయ్ దేవరకొండ.

రామాయణానికి త్రివిక్రమ్ మాట సాయం?



రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవి సీతారాములుగా నటిస్తున్న 'రామాయణం' చిత్రం మంగళవారం ముంబైలో ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాత. మూడు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయం ఒకటి ఇప్పుడు బాగా ప్రచారంలో ఉంది. 'రామాయణం' తెలుగు వెర్షన్‌కు సంభాషణలు అందించే బాధ్యతను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌కు అప్పగించారనేది మూడేళ్ల క్రితమే వినిపించిన మాట. షూటింగ్ మొదలవడంతో మరోసారి ఈ విషయం చర్చనీయాంశమైంది. కొద్ది మాటల్లో అనంతమైన భావాన్ని పొందికగా చెప్పగల చాతుర్యం త్రివిక్రమ్ సొంతం. రామాయణం లాంటి పౌరాణిక చిత్రానికి ఆయన అందించే సంభాషణలు సినిమా స్థాయిని మరింత పెంచుతాయని మేకర్స్ భావించడమే దీనికి కారణంగా చెబుతున్నారు. మహేశ్‌బాబుతో 'గుంటూరు కారం' చిత్రం చేశాక త్రివిక్రమ్ ఇప్పటివరకూ తన కొత్త ప్రాజెక్ట్ ప్రకటించలేదు. కాబట్టి త్రివిక్రమ్ కూడా దీనికి అంగీకరించి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే త్రివిక్రమ్ డైలాగ్ వెర్షన్ పూర్తిచేసి ఇచ్చినట్లు కూడా చెబుతున్నారు. ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఆ రోజు దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పదికాలాలు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయేవిధంగా తెరకెక్కించడానికి మేకర్స్ చాలా కసరత్తు చేస్తున్నారు. ఐదు భాషల్లో ఈ చిత్రం తెరకెక్కుతోంది.



కల్ట్ లవ్‌స్టోరీ

దర్శకుడు నక్కిన త్రినాథరావు తన సొంత చిత్రనిర్మాణ సంస్థ నక్కిన నేరేటివ్స్‌లో నిర్మించే రెండో సినిమా షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. పలు సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన విక్రమ్ సహిదేవ్ లగడపాటి హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో 'దృశ్యం' చిత్రంలో వెంకటేశ్ కుమార్తెగా నటించిన ఎస్తేర్ అనిల్ హీరోయిన్‌గా చేస్తున్నారు. వీరిద్దరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత శరత్ మరార్ కెమెరా స్విచాన్ చేయగా, హీరో సందీప్‌కిషన్ క్లాప్ ఇచ్చారు. సుమంత్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ 'ఇది కల్ట్ లవ్ స్టోరీ. టౌన్‌లో జరిగే అందమైన ప్రేమకథ. ఇందులో విక్రమ్ పాత్ర అదిరిపోతుంది. ఎస్తేర్ లో మంచి ప్రతిభ ఉంది. తారక్ పొన్నప్ప కీలక పాత్ర పోషిస్తున్నారు' అని చెప్పారు. 'రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభిస్తాం. అనకాపల్లి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుంది. ఎవరూ ఊహించని జానర్‌లో ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు వంశీకృష్ణ మల్ల చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: నరేశ్ తుల, రాజేంద్రప్రసాద్, సంగీతం: దావ్‌జాంద్, ఫొటోగ్రఫీ: మాయ వి, సహ నిర్మాత: ఎన్.వి.ఎస్.ఎస్. సురేశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల.



తెలుసుకోవాల్సిన చరిత్ర

'ఉయ్యాల జంపాల', 'మజ్ను' చిత్రాలతో సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు విరించి వర్మ. ఆయన రీసెంట్‌గా దర్శకత్వం వహించిన చిత్రం పొలిటికల్ డ్రామా 'జితేందర్ రెడ్డి'. 1980 కాలంలో జగిత్యాలలో జరిగిన వాస్తవిక సంఘటనల ఆధారంగా స్టూడెంట్ లీడర్ జితేందర్‌రెడ్డి జీవిత కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రాకేశ్ వర్రె ఇందులో టైటిల్ రోల్ పోషించారు. జితేందర్‌రెడ్డి సోదరుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. రియాసుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవిప్రకాశ్ ముఖ్య పాత్రలు పోషించారు. మే 3న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం 'జితేందర్ రెడ్డి' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ "అందరూ తెలుసుకోవాల్సిన చరిత్ర జితేందర్‌రెడ్డి జీవితం. నటుడు రాకేశ్ ఈ సినిమా తర్వాత జితేందర్‌రెడ్డిగా గుర్తింపు తెచ్చుకుంటారు. అంత అద్భుతంగా ఈ పాత్రలో జీవించారు" అని అన్నారు. దర్శకుడు విరించివర్మ మాట్లాడుతూ "జితేందర్‌రెడ్డి లాంటి పవర్‌ఫుల్ వ్యక్తి జీవితాన్ని డైరెక్ట్ చేయడం ఎంతో చాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ చేశాం" అని చెప్పారు. నటుడు రాకేశ్ వర్రె మాట్లాడుతూ "ఈ సినిమా ఫలితంపై నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇందులోని ఎమోషన్స్ మీ అందరినీ కట్టిపడేస్తాయి" అని అన్నారు.



ఆ కోరిక గీతాంజలితో తీరింది

అందాల నటి అంజలి నటించిన 'గీతాంజలి' చిత్రం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సినిమాస్ సంస్థతో కలసి కోన వెంకట్ నిర్మించారు.ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కోన వెంకట్ మాట్లాడుతూ 'ఒక తెలుగు అమ్మాయి 50 సినిమాలు చేయడం చాలా గొప్ప విషయం. అందుకే అంజలిని అభినందించాలి. ఆమెకు ఇది 50వ సినిమా. ఈ చిత్రానికి నేను కథ ఇచ్చినా దాన్ని పది మెట్లు ఎక్కించి ముందుకు తీసుకువెళ్లారు భాను, నందు. స్క్రిప్ట్‌లో ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. దర్శకుడు శివకు ఇది బెస్ట్ మూవీ అవుతుంది' అన్నారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ 'నా 50వ సినిమా చాలా స్పెషల్‌గా ఉండాలనుకున్నాను. ఆ కోరిక 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రంతో తీరింది. అందరినీ ఎంటర్‌టైన్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాం. కామెడీ, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ చేసిన చిత్రమిది. 'గీతాంజలి' కంటే వంద రెట్లు బాగుంటుంది' అని చెప్పారు సినిమా ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందనీ, అంతకు మించి సినిమా ఉంటుందని దర్శకుడు శివ చెప్పారు. ఈ చిత్రంలో తను చెనక్కాయల శీను పాత్ర పోషించాననీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. 'గీతాంజలి' కంటే ఈ చిత్రం మరింత భయపెడుతుంది, నవ్విస్తుంది అని సత్యం రాజేశ్ తెలిపారు.

నేనే హీరోగా చేస్తాననుకోలేదు



సూర్యతేజ ఏలే హీరోగా పరిచయమవుతున్న 'భరతనాట్యం' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'నేను హీరో కావాలని ఎప్పుడూ అనుకోలేదు. దర్శకత్వం మీద మొదటి నుంచి ఆసక్తి. కాలేజి పూర్తయిన తర్వాత రచన మీద ఇంట్రెస్ట్ ఏర్పడి కథలు రాయడం ప్రారంభించాను. అలా హితేష్‌కు నేను చెప్పిన కథ నచ్చింది. ఆ తర్వాత దర్శకుడు మహేంద్రకు చెప్పాను. ఆయనకు కూడా నచ్చడంతో మీరు ఈ సినిమాను డైరెక్ట్ చేస్తే బాగుంటుందని అడిగితే సరేనన్నారు. ఇందులో నేను హీరోగా చేస్తానని అనుకోలేదు. ఇందులో నా పాత్ర ఏ కొత్త నటుడు చేసినా బాగుంటుంది. కానీ దర్శకనిర్మాతలు అడగడంతో నేనే చేశా. ఇది క్రైమ్ కామెడీ కథాంశం అయినా ఫ్యామిలీ అంతా చూసే విధంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. 'మా నాన్న ధని ఏలే చిత్ర పరిశ్రమలో పాతికేళ్లుగా పబ్లిసిటీ డిజైనర్‌గా ఉన్నారు. నేను కూడా పెయింటింగ్‌లో ఫైన్ ఆర్ట్స్ మాస్టర్స్ చేశా. ఈ సినిమా అయిన తర్వాత కూడా చిత్ర పరిశ్రమలో ఉంటా. రచయితగానా, నటుడిగానా అన్నది కాలం తేల్చాలి. 'భరతనాట్యం' సినిమాతో చాలా అనుభవం వచ్చింది. చాలా నేర్చుకున్నాను. ఇవన్నీ నా తదుపరి చిత్రానికి హెల్ప్ అవుతాయి' అన్నారు.

కౌన్సెలింగ్

ఈ నొప్పులు తప్పించుకోలేనా?

డాక్టర్! నా వయసు 18 ఏళ్లు! 14 ఏళ్ల వయసులో తొలి నెలసరి కనిపించింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ప్రతి నెలా నెలసరి సమయంలో విపరీతమైన కడుపు నొప్పి, నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నాను. ఎన్నో మందులు వాడాను. కానీ ఈ సమస్య నుంచి ఉపశమనం పొందే సులువైన చికిత్సను సూచించగలరు?

- ఓ సోదరి, కర్నూలు

స్త్రీల జీవితంలో కీలకమైన దశ ఇది. మహిళగా మారే క్రమంలో ఈ దశలోనే పునరుత్పత్తి వ్యవస్థ పూర్తి ఎదుగుదలకు చేరుకుంటుంది. అయితే కొందరు టీనేజీ అమ్మాయిలకు నెలసరి సమయంలో శారీరక అసౌకర్యం కలగడం సహజం. అయితే భావోద్వేగాలు అదుపు తప్పడం, నడుము, కాళ్లలో నొప్పులు, తలనొప్పి, అలసట మొదలైన అసౌకర్యాలు శరీర తత్వాలనుబట్టి మారుతూ ఉంటాయి.

వాత నెలసరి లక్షణాలు

ఈ తత్వం కలిగినవారికి నెలసరి ముందు నుంచి, లేదా నెలసరి మొదలైన వెంటనే విపరీతమైన నొప్పులు మొదలవుతాయి. పొత్తికడుపు, నడుములో తెరలు తెరలుగా నొప్పులు మొదలై కదలలేనంతగా పెరిగిపోతాయి.

పిత్త నెలసరి లక్షణాలు

నెలసరి ముందు కాకుండా రక్తస్రావం పెరిగిన వెంటనే నొప్పులు కూడా మొదలవుతాయి. పెద్ద రక్తపు గడ్డలు కనిపిస్తాయి. రాత్రివేళ విపరీతమైన రక్తస్రావంతో మెలకువ వస్తుంది. రక్తస్రావం సమయంలో తలతిరుగుడు, అయోమయం ఉంటుంది.

కఫ నెలసరి లక్షణాలు

నొప్పి తక్కువగానే ఉన్నా, తల భారంగా ఉంటుంది. మానసిక అయోమయం, గందరగోళం ఉంటుంది. అలసట కనిపిస్తుంది. ఈ లక్షణాలు నెలసరి మొదలైన క్షణం నుంచీ ఉండి, క్రమేపీ తగ్గుతాయి.

నెలసరి నొప్పులు తగ్గాలంటే?

మానసిక, శారీరక అసౌకర్యాలు భరించలేనంతగా ఉంటే, ఉపశమనం కోసం ఆయుర్వేద చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే....




- **నువ్వుల నూనె మర్దన:** ఆయుర్వేద అభ్యంగన స్నానం కోసం ఈ నూనె వాడతారు. దీన్లోని లినోలిక్ యాసిడ్‌కు, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం కలిగి ఉంటుంది. విషాలను హరించే తత్వం కూడా ఈ నూనెకు ఉంటుంది. కాబట్టి నెలసరి సమయంలో ఈ నూనెతో పొత్తికడుపు మీద సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే కడుపు నొప్పి తగ్గుతుంది.
- **మెంతుల మహిమ:** కాలేయం, మూత్రపిండాలు, మెటబాలిజంకు మెరుగైన ఔషధం మెంతులు. వీటితో నెలసరి నొప్పులు కూడా తగ్గుతాయి. కాబట్టి 2 టీస్పూన్ల మెంతులను 12 గంటలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి.
- **వేడి కాపడం:** పొత్తికడుపు మీద వేడి కాపడం పెడితే గర్భాశయ కండరాలు ఉపశమనం పొంది నొప్పులు తగ్గుతాయి. కాబట్టి వేడి నీళ్ల నింపిన బాటిల్‌ను పొత్తికడుపు మీద ఉంచి కాపడం పెట్టాలి. వేడి జావ తాగినా, వేడి నీళ్ల స్నానం చేసినా కూడా ఫలితం దక్కుతుంది.
- **వ్యాయామంతో ఉపశమనం:** నొప్పితో మంచానికే అతుక్కుపోయే బదులు, వ్యాయామంతో ఒళ్లు కదిలిస్తే కటి ప్రదేశానికి రక్తప్రసరణ పెరిగి నొప్పులు తగ్గుతాయి. నెలసరి సమయంలో మూత్రాశయ కండరాలు కుంచించుకుపోయేలా చేసే హార్మోన్లను నెమ్మదించేలా చేసే ఎండార్ఫిన్లు వ్యాయామం చేస్తే విడుదలవుతాయి. కాబట్టి ఈ సమయంలో తేలికపాటి వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఆ మూడు రోజులే కాకుండా దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పిస్తే క్రమేపీ నెలసరి నొప్పులు అదుపులోకి వస్తాయి.
- **శొంఠి, మిరియాల టీ:** శొంఠి, మిరియాల పొడి కలిపిన నీళ్లను వేడి చేస్తే హెర్బల్ టీ తయారవుతుంది. దీన్లో పాలు కలపకుండా తాగితే, నొప్పులకు కారణమయ్యే హార్మోన్ల పరిమాణం తగ్గి నొప్పులు తగ్గుతాయి. ఈ టీ వల్ల నెలసరి సమస్యలు కూడా సరి అవుతాయి. అలసట కూడా వదులుతుంది.
- **జీలకర్ర వైద్యం:** జీలకర్ర వేసి మరిగించిన నీళ్ల తాగినా ఫలితం ఉంటుంది.
- **ఛామొమైల్ టీ:** ఈ పువ్వులు వేసి కాచిన నీళ్ల తాగితే పొత్తికడుపు, నడుము నొప్పులు తగ్గుతాయి. ఈ పూలలోని ఔషధ గుణాలు కూడా గర్భాశయాన్ని కుంచించుకుపోయేలా చేసే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తాయి.
- కప్పు పాలలో, దంచిన మూడు వెల్లుల్లి రెబ్బలు, పసుపు, తేనె, మిరియాల పొడి వేసి వెల్లుల్లి రెబ్బలు ఉడికేవరకూ కాచాలి. ఈ పాలను తాగి, వెల్లుల్లి రెబ్బలను నమిలేయాలి. ఇలా క్రమంతప్పకుండా 3 రోజులు చేసినా నెలసరి నొప్పులు తగ్గుతాయి.

ఈ జాగ్రత్తలు పాటించాలి!

- భోజనంలో చక్కెర, మైదా, శుద్ధిచేసిన పదార్థాలు, కృత్రిమ రంగులు, రుచులు మానేయాలి.
- బియ్యం, పాస్తా, బ్రెడ్ వాడకం మానేయాలి.
- ఉప్పు వాడకం బాగా తగ్గించాలి. ఉప్పు శరీరంలో నీరు నిల్వ ఉండేలా చేస్తుంది. దాంతో నెలసరి సమయంలో ఒళ్లు మరింత బరువై బద్ధకం ఆవరిస్తుంది.
- కాఫీ కూడా బాగా తగ్గించాలి. కెఫీన్ వల్ల నెలసరి నొప్పులు ఎక్కువవుతాయి.
- ప్రతి రోజూ పరగడుపున నిమ్మరసం తాగడం అలవాటు చేసుకోవాలి.
- నెలసరి ద్వారా పోయే రక్తం ద్వారా క్యాల్షియం శరీరం నుంచి వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి పాలు, పెరుగు, నువ్వులు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలి.
- రోజుకి కనీసం 8 గంటల నిద్ర తప్పనసరి. నిద్రతో శరీరం ఉపశమనం పొందుతుంది. ఫలితంగా నొప్పులూ అదుపులోకి వస్తాయి.
- నట్స్, సీడ్స్ తిని, ఏరోబిక్ వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్లు విడుదలై నొప్పులు తగ్గుతాయి.

డాక్టర్ రాంప్రకాశ్, ఆయుర్వేద వైద్యులు,
సంహిత ఆయుర్వేద చికిత్సా కేంద్రం, హైదరాబాద్.



ఎనిమిదో తరగతి డ్రాపవుట్‌గా మొదలై... హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రసంగం చేసే స్థాయికి ఎదిగారు రుమాదేవి. 22 వేలమందికి పైగా చేనేత కళాకారుల స్థిరమైన ఆదాయానికి ఆమె దోహదం చేశారు. దాదాపు 35 వేల మందికి శిక్షణ అందించారు. 'కుటుంబ, సమాజ శ్రేయస్సుకు మహిళల ఆర్థిక స్వావలంబనే పునాది' అంటున్న రుమాదేవి కథ ఇది.

ఎడారిలో ప్రగతి పూలు పూయిస్తూ...

"రెండు నెలల క్రితం ఢిల్లీలో 'వేదాంత కల్చరల్ ఫెస్టివల్', మార్చిలో 'సూరజ్ కుండ్ ఫెస్టివల్', ఈ నెల 15 వరకూ ఢిల్లీలో 'దస్తకార్ సమ్మర్ మేళా', ఆ తరువాత గ్రేటర్ నోయిడాలో 'సమ్మర్ ఫెస్టివల్'... ఇంకా రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో చిన్న చిన్న ఈవెంట్స్ అస్సలు తీరిక ఉండడం లేదు" అని నవ్వేస్తారు 35 ఏళ్ళ రుమాదేవి. ఉఆగ్రా, తలపై ముసుగుతో సాధారణ రాజస్థానీ గ్రామీణ మహిళలా కనిపించే ఆమె సుప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్లలో ఒకరని ఎవరూ అనుకోరు. బార్మర్ ప్రాంతానికి చెందిన చేనేత, ఎంబ్రాయిడరీ డిజైన్ల ప్రతిష్టను ఆమె విశ్వవ్యాప్తం చేస్తున్నారు. రుమాదేవి నేతృత్వంలోని 'గ్రామీణ వికాస్ ఇవమ్ చేతన సంస్థాన్' (జివిసిఎస్) ద్వారా దాదాపు 22 వేల మంది చేతి వృత్తి నిపుణులైన మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయం జరుగుతుంది. దాని కోసం విదేశాల్లో జరిగే మేళాలకు కూడా తన బృందంతో ఆమె వెళ్తా ఉంటారు.

వంద చొప్పున పోగు చేసి...

రుమాదేవిది రాజస్థాన్ రాష్ట్రం బార్మర్ జిల్లాలోని రవాట్సర్ గ్రామం. థార్ ఎడారి మధ్యలో, పాకిస్తాన్ సరిహద్దుకు చేరువలో ఉండే ఆ ఊరిలో... ఒక సాధారణ కుటుంబంలో ఆమె జన్మించారు. ఆమె తండ్రి సన్నకారు రైతు. రుమాదేవి అయిదో ఏటే ఆమె తల్లి మరణించారు. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. ఏడుగురు అక్కచెల్లెళ్ళలో పెద్దదైన రుమాదేవి తన అమ్మమ్మ దగ్గర పెరిగారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఎనిమిదో క్లాసులో చదువు ఆపేయాల్సి వచ్చింది. ఇంటి పనులతో పాటు రోజూ కొన్ని కిలోమీటర్ల దూరం నుంచి మంచి నీరు తీసుకువచ్చే బాధ్యత కూడా ఆమెదే.. పదిహేడేళ్ళ వయసులో రుమాదేవికి పెళ్ళయింది. రెండేళ్ళలోపే ఒక బిడ్డకు జన్మనిచ్చారు. కానీ ఊపిరితిత్తుల సమస్య కారణంగా రెండు రోజులు తిరక్క ముందే ఆ బిడ్డ మరణించాడు. "ఆ సంఘటనతో నేను బాగా కుంగిపోయాను. నా జీవితం వ్యర్థంగా అనిపించేది. మరోవైపు ఇంట్లో ఆర్థిక పరిస్థితులు మరింత విషమించాయి. ఏదైనా పనిలో బిజీ అయితే డిప్రెషన్ నుంచి దూరం కావచ్చనుకున్నాను. కానీ పెద్దగా చదువుకోని నాకు అవకాశాలు ఎక్కడ్నుంచి వస్తాయి? ఎవరింట్లోనయినా పనికి కుదరాలి, లేదంటే దినసరి కూలీగా పని చెయ్యాలి. ఇలా ఆలోచిస్తున్న సమయంలో... కుట్టుపని, ఎంబ్రాయిడరీ చేస్తే బాగుంటుందనిపించింది. చిన్నప్పుడు అవి మా అమ్మమ్మ దగ్గర నేర్చుకున్నాను. దాన్నే ఆదాయ మార్గంగా ఎంచుకున్నాను. చిన్న బ్యాగ్‌లతో ప్రారంభించాను" అని అంటారు రుమాదేవి. మొదటి బ్యాగ్‌ను 70 రూపాయలకు అమ్మారు. అది ఆమె జీవితంలో తొలి సంపాదన. ఆ డబ్బుతో మెటీరియల్ కొన్నారు. కానీ కుట్టు మిషన్ లేకపోవడంతో పని కష్టంగా సాగేది. ఈలోగా ఆమె చేస్తున్న పని గురించి ఇరుగు పొరుగు మహిళలు ఆరా తీశారు. వారి ఆసక్తిని గమనించిన రుమాదేవి పదిమందితో కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరి నుంచి వంద రూపాయలు సేకరించి... ఒక కుట్టు మిషన్ కొన్నారు. బ్యాగ్‌లను, పిల్లో కవర్లను తయారు చేసి... చుట్టుపక్కల గ్రామాల్లోని సంతల్లో అమ్మడం మొదలుపెట్టారు. 'ఇంట్లో ఉండాల్సిన మహిళలు వీధుల్లో తిరగడం ఏమిటనే అభ్యంతరాలు వచ్చినా... రుమాదేవి, ఆమె బృందం బెదరలేదు.

"ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో... ఎడారిలో ప్రగతి పూలు పూయిస్తున్న మహిళగా నన్ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. మన చేనేత కళ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్నావంటూ అభినందించారు.



సమకాలీనతకు ప్రాధాన్యం...

క్రమంగా వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం రావడంతో... మరింతమంది మహిళలు కూడా ఆ బృందంలో చేరారు. 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్'కు రుమాదేవి విజయగాథ తెలిసింది. 2010లో జిల్లా స్థాయిలో తమ అధ్యక్షురాలుగా ఆమెను నియమించింది. ఆ తరువాత 'రూరల్ డెవలప్‌మెంట్ చేతన సంస్థాన్'కు ఆమె ప్రెసిడెంట్ అయ్యారు. ఇప్పటివరకూ 80 గ్రామాలకు చెందిన 35 వేల మందికి పైగా మహిళలకు శిక్షణనిచ్చి, వారి ఉపాధికి దోహదం చేశారు. వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం సమకూర్చడంలో విజయవంతమయ్యారు. సంప్రదాయ భారతీయ డిజైన్లకు ప్రాచుర్యం కల్పించడంతోపాటు చేతి వృత్తుల్లో థార్ ఎడారి ప్రాంతంవారు ఉపయోగించే పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రపంచానికి చాటి చెప్పారు. ఆమె రూపొందించిన వ్యాపార నమూనా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రశంసలందుకుంది. 2015లో 'రాజస్థాన్ హెరిటేజ్ వీక్'లో తమ మొదటి ఫ్యాషన్ షో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దేశ, విదేశాల్లో కొన్ని వందల ఈవెంట్స్‌లో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. జర్మనీ, శ్రీలంక, బ్రిటన్, సింగపూర్, థాయిలాండ్ తదితర దేశాల్లోని ఫ్యాషన్ షోలలో ఆమె డిజైన్లు చోటు చేసుకున్నాయి. "కళాకారుల నైపుణ్యాన్ని మెరుగు పరచడానికి శిక్షణకు, వర్క్‌షాప్‌లకు హాజరయ్యేలా ప్రోత్సహిస్తున్నాను. డిజైన్లలో సమకాలీన ధోరణులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే యువతను అవి ఆకర్షిస్తాయి. కాబట్టి మేము ఎప్పుడూ వాటి మీదే దృష్టి కేంద్రీకరిస్తూ ఉంటాం" అని చెబుతున్న రుమాదేవి తమ ప్రాంతంలోని ఇతర కళారూపాలకు చెందిన వారి కోసం 'అప్లిక్యూ హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ'ని ఏర్పాటు చేశారు. దాని ద్వారా వారికీ, మార్కెట్‌కూ అనుసంధానంగా వ్యవహరిస్తూ, వారి నైపుణ్యాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. రాజస్థాన్ గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న 'రాజీవికా మిషన్'కు బ్రాండ్ అంబాసిడర్.

'ఇదంతా నిజమేనా?' అనిపిస్తుంది...

భారతీయ ఫ్యాషన్ పరిశ్రమకు చెందిన దిగ్గజాలతో కలిసి పని చేస్తున్న రుమాదేవి అనేక గౌరవాలను అందుకున్నారు. 2018లో 'నారీ శక్తి' పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం ఆమెను సత్కరించింది. 2019లో 'టిఎఫ్ఐ డిజైనర్ ఆఫ్ ది ఇయర్' టైటిల్, అలాగే 'ట్రైబ్స్ ఇండియా గుడ్ విల్ అంబాసిడర్ అండ్ చీఫ్ డిజైనర్' టైటిల్ గెలుచుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రం తరఫున సాంస్కృతిక రాయబారిగా జర్మనీ హెచ్ఐఎం టెక్స్‌టైల్ ఫెయిర్, సింగపూర్ క్రాఫ్ట్ ఫెయిర్, ప్రతిష్టాత్మకమైన లండన్ ఫ్యాషన్ వీక్‌లలో పాల్గొన్నారు. 2000లో తమ 17 వార్షిక భారతీయ సదస్సుకు వక్తగా హార్వర్డ్ విశ్వవిద్యాలయం రుమాదేవిని ఆహ్వానించింది. ఆ సందర్భంగా వివిధ రంగాల్లో భారతీయ మహిళల విజయాల గురించి ఆమె చేసిన ప్రసంగం అందరి మన్ననలనూ అందుకుంది. 2022లో వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నిర్వహించిన భారత స్వాతంత్ర్య దినోత్సవాల్లో... ప్రత్యేక అతిథిగా ఆమె పాల్గొన్నారు. "ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో... ఎడారిలో ప్రగతి పూలు పూయిస్తున్న మహిళగా నన్ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. మన చేనేత కళ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్నావంటూ అభినందించారు. ఆమె మాటలు ఎన్నటికీ మరచిపోలేను. కనీసమైన చదువు కూడా లేని నాకు లభించిన ఈ గుర్తింపు గురించి ఆలోచిస్తే... 'ఇదంతా నిజమేనా?' అనిపిస్తుంది. ఇది నేను ఒంటరిగా సాధించింది కాదు. ఎందరో మహిళల కృషి ఫలితం. సరైన చదువుకు నోచుకోని, కుటుంబ ఆదాయం పెంచడానికి ఏం చెయ్యాలో తెలియని సామాన్య గ్రామీణ మహిళలకు ప్రతినిధిని నేను" అని వినయంగా చెబుతారు రుమాదేవి.

ఆమెకు ప్రకృతి అంటే ఇష్టం. పర్యావరణ పరిరక్షణ చేయాలనే తలంపు చిన్నప్పటినుంచే ఉంది. అందుకే ఆమె మొక్కలను పెంచుతుంది. అంతేనా సీతాకోకచిలుకలకు ఆమె ఇల్లు ఆవాసంగా మారేట్లు చేసింది. ముంబైలో ఉంటున్న ఆమె పేరు ప్రియాంక సింగ్. ఆ సీతాకోకచిలుకల విశేషాలను ఆమె చెబుతోంది ఇలా...





సీతాకోకచిలుకలే... మా ఇంటికి అతిథులు!

"అందరిలానే చిన్నప్పుడు సీతాకోకచిలుకలు పట్టుకోవాలని ఇష్టం. ఆ రంగు రంగుల సీతాకోకచిలుకల ప్రపంచమే అద్భుతంగా ఉండేది. స్కూల్‌కి వెళ్లినపుడు, పార్కుల్లో తిరుగుతుంటే చూసి సంతోషపడేదాన్ని. అలాంటి జీవితం ఉంటే ఎంత బావుంటుందో అనుకుండేదాన్ని. అయితే వేల సీతాకోకచిలుకలు మా ఇంటి బాల్కనీలోకి వస్తాయని ఊహించనేలేదు.

అలా ఆలోచన..

నాకు సామాజిక సేవ అంటే ఇష్టం. ముంబైలో ప్రతి ఇంట్లో రోజుకు నాలుగైదు కేజీల చెత్త ఎవరింట్లో అయినా ఉంటుంది. ఆ చెత్తను కంపోస్టు ఎరువుగా మారిస్తే బావుంటుందని పదుల కొద్దీ సెమినార్లు చేయటంతో పాటు కంపోస్టు ఎరువుగా మార్చి పొలాల్లో వేయించా. ప్రకృతిలో అన్నీ విలువైనవే. చెత్తతోనూ ఉపయోగముంది. బయోడైవర్సిటీ గురించి ఆలోచించినపుడు.. పక్షులు లాగే సీతాకోకచిలుకలు ఎంతో మేలు చేస్తాయి కదా.. అని మా ఇంట్లోని పెద్ద బాల్కనీలో పూల మొక్కలు వేయటం ప్రారంభించా. పూల వాసనకు ఒక్కోటి మా ఇంటికి వచ్చేవి సీతాకోకచిలుకలు. పైగా మా ఇంటికి దగ్గరలో పార్కులు ఉండటం వల్ల వీటి సంఖ్య అనూహ్యంగా పెరిగింది.

వేల సీతాకోకచిలుకలు..

నిమ్మ, మల్లెపూల చెట్లు, మందారం.. ఇలా పలు రకాల మొక్కలను పెంచటం ప్రారంభించా. బాల్కనీతో పాటు ఇంటిమీద కూడా మొక్కలు పెంచా. ఐదారేళ్ల క్రితం మా ఇంట్లోకి రెండువందల దాకా వచ్చేవి. నా కూతురు ఆ రంగురంగుల సీతాకోకచిలుకలను చూసి ఎగిరిగంతేసేది.

సీతాకోక చిలుకలు ఎలాంటి రంగులు వస్తున్నాయో లెక్కేసుకునేవాళ్లం. ఎంతో వేగంగా సమయం గడిచిపోయేది. మా ఇంట్లోవారి సహకారమూ ఉండేది. ఆ తర్వాత మొక్కల సంఖ్య పెరిగింది. ఇప్పుడు దాదాపు యాభై రకాల మొక్కల కంటే ఎక్కువ ఉన్నాయి. సీతాకోకచిలుకలు మా ఇంటికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలల్లో వస్తాయి. ఇదెంతో అద్భుతంగా ఉంటుంది.

అంతకంటే ఏం కావాలి?

మా ఆర్గానిక్ గార్డెన్‌లో సీతాకోకచిలుకలు ఎక్కువగా వస్తుంటాయని 'బటర్‌ఫ్లైయ్ మామ్' అంటూ మా బంధువులు, మిత్రులు పిలుస్తుంటారు. ఈ పిలుపు బావుంటుంది నాకు. సీతాకోకచిలుకలు వచ్చి గుడ్లు పెడుతుంటాయి. ఇక్కడే కొన్ని గొంగళి పురుగులు అవుతాయి. వాటికి హాని కలగకుండా చూస్తాను. పర్యావరణంలో కాలుష్యం, పురుగుమందులు, ఇలా పలురకాల కారణాల వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. ఎక్కడో కొన్ని పార్కుల్లోనో, కొన్ని తోటల్లోనో కనపడే రంగురంగుల సీతాకోకచిలుకలు నా ఇంటికి అతిథులుగా వస్తున్నాయంటే అంతకంటే ఏం కావాలి? ప్రకృతి కోసం నావంతు సహకారం అందించాలనుకున్నా. మా ఆర్గానిక్ గార్డెన్ చిన్నదే కావచ్చు. నా ప్రయత్నం మంచిదే కదా?' అంటుంది ప్రియాంక.



మందారంతో చర్మం మృదువుగా..

మందారం అలంకరణకే కాదు చక్కటి చర్మ సౌందర్యానికి మేలు చేస్తుంది. తక్కువ బడ్జెట్‌లోనే మీ చర్మం కాంతివంతంగా ఉండాలంటే... ఈ చిన్న చిట్కాలు పాటించాల్సిందే మరి..

- రెండు మందారం పూలను మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని బౌల్‌లో వేసి రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, ముల్తానీ మట్టి రెండు టేబుల్ స్పూన్లు కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో కడిగేయాలి. ఇలా చేస్తుంటే చర్మంలో మెరుపు వస్తుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల మందారం పూల పొడి, టీస్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్ల పాలు కలిపి మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేయాలి. ఇలా చేస్తే చర్మ సౌందర్యం మీ సొత్తు.
- రెండు టేబుల్ స్పూన్ల మందారం పూల పొడిలో పేస్ట్‌కు తగినంత రోజ్ వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా తరచుగా చేస్తుంటే ఫేస్‌లో గ్లో వస్తుంది.
- బౌల్‌లో రెండు టేబుల్స్ రోజ్ వాటర్, రెండు టేబుల్ స్పూన్ల మందార పొడి, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌ను బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మంతో పాటు మెడ దగ్గర పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మంలో ఫ్రెష్‌నెస్ వస్తుంది. ముఖ చర్మం మీద నొప్పులు తగ్గిపోతాయి.



బరువు తగ్గించే...

వంటగదిలో అల్లం లేనిదే కుదరదు. దుంప జాతికి చెందిన ఈ అల్లం వేల ఏళ్లనుంచి సహజమైన మెడిసిన్‌గా ఉపయోగపడుతోంది. అల్లం వల్ల కలిగే ఉపయోగాలేంటో తెల్సుకుందాం...

- కూరల్లో, టీ రూపంలో అల్లం తీసుకోవటం వల్ల కలిగే ఫలితాలు అద్భుతం. ముఖ్యంగా అల్లం టీ తాగినప్పుడు గొంతులోని కఫం, జలుబు, దగ్గు.. లాంటి సమస్యలనుంచి ఉపశమనం లభిస్తుంది.
- కండరాల నొప్పిని తగ్గిస్తుంది. ఏదైనా దెబ్బ తగిలినపుడు మజిల్ రికవరీ వేగంగా జరిగేందుకు అల్లం తోడ్పడుతుంది. మోకాళ్ల నొప్పులు, ఇతర కీళ్లనొప్పుల బాధ తగ్గుతుంది.
- బరువును తగ్గించే గుణం దీనికి ఉంది. అందుకే వెయిట్‌లాస్ అవ్వాలనుకునేవాళ్లు అల్లం టీ, నిమ్మరసంలోకి అల్లం పొడి వేసి తాగొచ్చు.
- వేపనూనెలోకి కాసింత అల్లం పొడి వేసి జుట్టుకు పట్టిస్తే చుండ్రును అరికట్టవచ్చు.
- దీని వల్ల కడుపు శుభ్రం అవుతుంది. జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది.
- ఇది న్యాచురల్ యాంటీ ఇన్ఫ్లమేటరీగా పని చేస్తుంది. పంటి నొప్పి కూడా తగ్గే అవకాశాలెక్కువ.
- రక్తం సాఫీగా ప్రసరించేట్లు చేస్తుంది. రక్తపోటును తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించటం వల్ల గుండె సమస్యలు దరిచేరవు.
- ఇన్‌ఫెక్షన్లతో పోరాడే వ్యాధినిరోధక శక్తిని అనూహ్యంగా పెంచగలిగేది అల్లం.
- తలనొప్పితో పాటు మైగ్రేన్‌ను అదుపులో ఉంచే చక్కటి ఔషధం.



ప్రపంచ టాప్ 10లోకి అంబానీ

సంపద రూ.9.63 లక్షల కోట్లు.. 8,400 కోట్ల డాలర్లతో ఆసియా నంబర్ 2 అదానీ

» ఫోర్బ్స్ కుబేరుల జాబితా విడుదల

» 10 మంది తెలుగు వారికి స్థానం

న్యూఢిల్లీ: భారత్‌లోని అత్యంత సంపన్నుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. భారత్‌తోపాటు ఆసియాలోని అత్యంత ధనికుడూ ఆయనే. ఈ ఏడాదికిగాను ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ బిలియనీర్ల జాబితా ప్రకారం.. అంబానీ ఆస్తి 11,600 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో దాదాపు రూ.9.63 లక్షల కోట్లు. ప్రపంచ ర్యాంకింగ్‌లో అంబానీ 9వ స్థానంలో నిలిచారు. వరల్డ్ టాప్-10లోని ఏకైక ఆసియా సంపన్నుడూ ఆయనే. అంతేకాదు, జాబితాలో 10,000 కోట్ల డాలర్లకు పైగా సంపద కలిగిన అతికొద్ది (14) మందిలో ఏకైక ఆసియా వ్యక్తి కూడా అంబానీయే. అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ రెండో అత్యంత సంపన్న భారతీయుడిగా ఉన్నారు. అదానీ ఆస్తి 8,400 కోట్ల డాలర్లకు చేరుకుందని, గడిచిన ఏడాది కాలంలో 3,680 కోట్ల డాలర్లు పెరిగిందని ఫోర్బ్స్ వెల్లడించింది. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో అదానీ 17వ స్థానంలో ఉన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ 3,690 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో మూడో అత్యంత ధనిక భారతీయుడిగా నిలిచారు. జిందాల్ గ్రూప్ చైర్మన్ సావిత్రి జిందాల్‌కు నాలుగో స్థానం దక్కింది. ఆమె ఆస్తి 3,350 కోట్ల డాలర్లు. దేశంలోని అత్యంత ధనిక మహిళ కూడా ఆమె.

సన్‌ఫార్మాకు చెందిన దిలీప్ సంఘ్వీ (2,670 కోట్ల డాలర్లు) ఐదో స్థానంలో నిలవగా.. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా (2,130 కోట్ల డాలర్లు) ఆరో స్థానంలో ఉన్నారు. డీఎల్ఎఫ్‌కు చెందిన కేపీ సింగ్ (2,090 కోట్ల డాలర్లు), ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా (1,970 కోట్ల డాలర్లు), డీ-మార్ట్ సూపర్‌మార్కెట్ల వ్యవస్థాపకుడు రాధాకిషన్ దమానీ (1,760 కోట్ల డాలర్లు), ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ (1,640 కోట్ల డాలర్లు) వరుసగా 7,8,9,10వ స్థానాల్లో ఉన్నారు.

ఈసారి జాబితాలో 10 మంది తెలుగువారికి చోటు లభించింది. దివీస్ లాబ్స్‌కు చెందిన మురళి దివి 620 కోట్ల డాలర్ల సంపదతో అగ్రస్థానంలో ఉన్నారు.

భారత్ నుంచి 200 మంది

ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 200 మంది భారతీయులకు చోటు దక్కింది. గత ఏడాది జాబితాలో కనిపించిన 169 మందితో పోలిస్తే ఈసారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈసారి లిస్ట్‌లోని భారత బిలియనీర్ల మొత్తం సంపద 95,400 కోట్ల డాలర్లకు (రూ.79.18 లక్షల కోట్లు) పెరిగింది. గత ఏడాది మొత్తం సంపద 67,500 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది 41 శాతం అధికం. ఈ ఏడాది కొత్తగా 25 మందికి చోటు లభించగా.. బైజూస్ రవీంద్రన్, రోహిక మిస్త్రీ స్థానం కోల్పోయారు. కాగా, ఆన్‌లైన్ బ్రోకింగ్ సేవల సంస్థ జీరోధా వ్యవస్థాపకులైన నితిన్, నిఖిల్ కామత్ సోదరులతోపాటు ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకులు సచిన్ బన్సల్, బిన్నీ బన్సల్‌లు అత్యంత పిన్న వయస్కులైన భారత బిలియనీర్లుగా నిలిచారు. వీరిలోనూ 37 ఏళ్ల నిఖిల్ కామత్ అత్యంత పిన్న వయస్కుడు.



ప్రపంచ బిలియనీర్ల మొత్తం ఆస్తి రూ.1,179 లక్షల కోట్లు

ఈ ఏడాది ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 2,781 మందికి స్థానం దక్కింది. గత ఏడాదితో పోలిస్తే, మరో 141 మందికి కొత్తగా చోటు లభించింది. వీరి సంపద మొత్తం కూడా మరో 2 లక్షల కోట్ల డాలర్లు పెరిగి 14.2 లక్షల కోట్ల డాలర్లకు (రూ.1,179 లక్షల కోట్లు) చేరుకుంది. అమెరికా నుంచి అత్యధికంగా 813 మంది ఈ జాబితాలో నిలిచారు. చైనా (473 మంది), భారత్ (200 మంది) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 8 నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఆయా కంపెనీలకు చెందిన షేర్ల ధరలు, కరెన్సీ మారకం విలువల ఆధారంగా బిలియనీర్ల సంపదను లెక్కించినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఫ్యాషన్ దిగ్గజం ఎల్‌వీఎంహెచ్ గ్రూప్ చైర్మన్ బెర్నార్డ్ ఆర్నో 23,300 కోట్ల డాలర్ల సంపదతో ప్రపంచంలో నం.1 బిలియనీర్‌గా నిలిచారు. టెస్లా, స్పేస్ ఎక్స్, ఎక్స్ (గతంలో ట్విటర్) కంపెనీ సారథి ఎలాన్ మస్క్ 19,500 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో ఈ సారి రెండో స్థానానికి పరిమితమయ్యారు. అమెజాన్ వ్యవస్థాపకులు జెఫ్ బెజోస్ (19,400 కోట్ల డాలర్లు), ఫేస్‌బుక్ వ్యవస్థాపకులు మార్క్ జుకెర్‌బర్గ్ (17,700 కోట్ల డాలర్లు), ఒరాకిల్ చైర్మన్ ల్యారీ ఎలిసన్ (14,100 కోట్ల డాలర్లు) టాప్-5లోని తర్వాత స్థానాల్లో ఉన్నారు.

తెలుగు సంపన్నుల వివరాలు

ప్రపంచ ర్యాంక్	పేరు	కంపెనీ	బిలియన్ డాలర్లు
469	మురళి దివి	దివీస్ ల్యాబ్స్	6.2
1104	ప్రతాప్ సీ రెడ్డి	అపోలో హాస్పిటల్స్	3
1143	జీఎం రావు	జీఎంఆర్ గ్రూప్	2.9
1143	పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి	అరబిందో ఫార్మా	2.9
1438	జూపల్లి రామేశ్వర్ రావు	మై హోమ్ గ్రూప్	2.3
1438	పీ పిచ్చి రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	2.3
1496	పీ వీ కృష్ణా రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	2.2
1623	ఎం సత్యనారాయణ రెడ్డి	ఎంఎస్ఎన్ ఫార్మా	2
1764	కే సతీశ్ రెడ్డి	డాక్టర్ రెడ్డీస్	1.8
2046	జీవీ ప్రసాద్	డాక్టర్ రెడ్డీస్	1.5



చుక్కలంటిన పసిడి ధర

» ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.69,200

న్యూఢిల్లీ: బంగారం ధర ఏ రోజుకారోజు కొత్త శిఖరాలకు దూసుకుపోతోంది. ఢిల్లీలో బుధవారం 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.830 పెరిగి రూ.69,200కు చేరింది. ఢిల్లీలో పసిడి ధర కొత్త రికార్డు ఇది. కిలో వెండి ధర కూడా రూ.1,700 లాభంతో రూ.80,700 వద్ద ముగిసింది. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజ్‌లోనూ మేలో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల పుత్తడి ధర రికార్డు స్థాయిలో రూ.69,500కు చేరింది.

హైదరాబాద్ మార్కెట్: హైదరాబాద్ మార్కెట్‌లోనూ పసిడి, వెండి ధరలు ఢిల్లీ మార్కెట్‌ను మించిపోయాయి. పది గ్రాముల మేలిమి బంగారం ధర బుధవారం రూ.760 పెరిగి రూ.69,870 వద్ద ముగిసింది. కిలో వెండి ధర రూ.2,000 పెరిగి రూ.84,000 వద్ద ముగిసింది.

పసిడి ధర పెరుగుదలకు కారణాలు

- పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు.
- చైనా కేంద్ర బ్యాంకు భారీగా బంగారం కొనడం.
- అమెరికా వడ్డీ రేట్లపై కొనసాగుతున్న అనిశ్చితి.
- సురక్షిత పెట్టుబడిగా పసిడికి ఉన్న డిమాండ్
- డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం విలువ



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,870 ▲	64,100 ▲	84,000 ▲
ముంబై	69,360 ▲	63,540 ▲	77,590 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 4వ తేదీ

హైదరాబాద్	375	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	139	గోదావరి	138
వరంగల్	139	విజయవాడ	138
కరీంనగర్	139	గుంటూరు	139
మహబూబ్‌నగర్	139	ఒంగోలు	139
కర్నూలు	139	చిత్తూరు	135
విశాఖపట్నం	124		



మోటారోలా ఎడ్జ్ 50 ప్రో ఫోన్

మోటారోలా కంపెనీ ఎడ్జ్ 50 ప్రో పేరిట కొత్త 5 జీ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లో విడుదల చేసింది. ప్రపంచ మార్కెట్లోనే ఈ ఫోన్ విడుదల చేయడం ఇదే ప్రథమం. ఏఐ ఆధారంగా పని చేసే ప్రో-గ్రేడ్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 3 ప్రాసెసర్, 12 జీబీ రామ్, 256 జీబీ స్టోరేజి దీని ప్రత్యేకతలు. ప్రారంభ ధర రూ.31,999.



టయోటా క్రూయిజర్ టైజర్ కారు

జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఢిల్లీలో దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.7.73 లక్షల నుంచి రూ.13.03 లక్షల మధ్యన ఉంది. ఈ కారుకి బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. రూ.11,000 చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు.

శామ్‌సంగ్ బీస్పోక్ ఏఐ గృహోపకరణాలు



కొరియా దిగ్గజం శామ్‌సంగ్ కృత్రిమ మేధతో పని చేసే బీస్పోక్ ఏఐ గృహోపకరణాలు మార్కెట్లో విడుదల చేసింది. వేగంగా విస్తరిస్తున్న ప్రీమియం అప్లయెన్సెస్ మార్కెట్లో ఇవి సంచలనం సృష్టించడంతో పాటు జీవితాన్ని సరళం చేస్తాయని కంపెనీ తెలిపింది. ఈ ఉత్పత్తుల్లో ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు ఉన్నాయి.

40 సంవత్సరాల్లో 3 కోట్ల కార్ల తయారీ

» మారుతి సరికొత్త రికార్డు



న్యూఢిల్లీ: మారుతి సుజుకీ కంపెనీ కార్ల ఉత్పత్తిలో సరికొత్త రికార్డు సృష్టించింది. 1983 డిసెంబరులో ఉత్పత్తి ప్రారంభించిన నాటి నుంచి ఈ మార్చి నెలాఖరు నాటికి కంపెనీ మూడు కోట్ల కార్లను తయారుచేసింది. జపాన్ తర్వాత సుజుకి మోటార్ కార్పొరేషన్ ఈ ఘనత సాధించింది మన దేశంలోనే. అయితే జపాన్‌లో 55 సంవత్సరాల రెండు నెలల్లో ఈ ఘనత సాధిస్తే, మన దేశంలో 40 సంవత్సరాల నాలుగు నెలల్లోనే ఈ ఘనత సాధ్యమైంది.

స్వల్ప నష్టాలతో సరి

ముంబై: లాభాల స్వీకారంతో దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 27.09 పాయింట్ల నష్టంతో 73,876.82 వద్ద ముగియగా, నిఫ్టీ 18.65 పాయింట్ల నష్టంతో 22,434.65 వద్ద ముగిసింది. వడ్డీరేట్ల భవిష్యత్‌పై అమెరికా కేంద్ర బ్యాంకు చైర్మన్ జెరోం పోవెల్ ఈ రాత్రికి ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారోనని మార్కెట్ ఆతృతగా ఎదురు చూస్తోంది. అమ్మకాల ఒత్తిడి కొనసాగినా నిఫ్టీకి 22,350 వద్ద కీలక మద్దతు లభిస్తుందని టెక్నికల్ అనలిస్టుల అంచనా.

వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణ: వొడాఫోన్ ఐడియా రూ.20,000 కోట్లు సమీకరించనుంది. మంగళవారం జరిగిన వాటాదారుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ తీర్మానాన్ని వాటాదారుల్లో 99.01 శాతం మంది ఆమోదించినట్టు కంపెనీ బీఎస్ఈకి తెలిపింది.

వైద్యానికి రుణం 'కెనరా హీల్'



బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ కెనరా హీల్ పేరిట ప్రత్యేక ఆరోగ్య బీమా అనుసంధానిత రుణ పథకం, మరికొన్ని కొత్త స్కీమ్‌లు విడుదల చేసింది. కెనరా హీల్ కింద టీపీఏ ద్వారా బిల్లు సెటిల్ చేసే సమయంలో చికిత్స బిల్లు బీమా పరిమితిని దాటినట్టయితే ఆ సొమ్మును బ్యాంకు రుణంగా ఇస్తుంది. కస్టమర్లు తమకు, తమ కుటుంబ సభ్యులకు అయ్యే చికిత్సలకు ఈ రుణం తీసుకోవచ్చు. రుణంపై ఫ్లోటింగ్ రేటులో 11.55 శాతం, ఫిక్స్‌డ్ రేటులో 12.30 శాతం వడ్డీ వసూలు చేస్తారు. మహిళా కస్టమర్ల కోసం కెనరా ఏంజెల్ పేరిట ప్రత్యేక సేవింగ్స్ ఖాతా విడుదల చేసింది. దీని కింద కేన్సర్ కేర్ పాలసీ, కెనరా రెడీ క్యాష్ పేరిట ప్రీ అప్రూవ్డ్ వ్యక్తిగత రుణం, కెనరా మై మనీ పేరిట టర్మ్ డిపాజిట్లపై ఆన్‌లైన్ రుణం వంటి ఆకర్షణలున్నాయి. కొత్తగా ఖాతా తెరిచే మహిళా కస్టమర్లకు ఇది ఉచితంగానే లభిస్తుంది. ప్రస్తుత కస్టమర్లు కూడా తమ ఖాతాను కెనరా ఏంజెల్‌గా అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. "కెనరా యూపీఐ 123పే ఏఎస్ఐ" పేరిట పేమెంట్ ఇంటర్‌ఫేస్‌ను, బ్యాంకు ఉద్యోగుల హెచ్‌ఆర్ నిర్వహణ కోసం "కెనరా హెచ్‌ఆర్‌ఎంఎస్ మొబైల్ యాప్ ఫర్ స్టాఫ్"ను కూడా విడుదల చేసింది. అలాగే ఆర్‌బీఐ ఇన్నోవేషన్ హబ్ సహకారంతో స్వయంసహాయక బృందాలకు ఇంటిముంగిటికే డిజిటల్ సర్వీసులు తెచ్చిన తొలి బ్యాంక్‌గా కెనరా బ్యాంక్ మారింది. డిజిటల్ ఎస్‌హెచ్‌జి సహాయంతో కస్టమర్లు తమ ఖాతాల్లోకి సొమ్మును డిజిటల్‌గానే క్రెడిట్ చేసుకోవచ్చు. ఆర్‌బీఐ ఇన్నోవేషన్ హబ్ సీఈఓ రాజేష్ బన్సాల్, కెనరాబ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఐపీఎల్ నుంచి శివమ్ మావి అవుట్

లఖ్‌నవూ: ఈ ఐపీఎల్ సీజన్‌లో జోరుమీదున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ శివమ్ మావి ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే లీగ్ మొత్తానికి దూరమయ్యాడు. పక్కటెముకల గాయం నుంచి కోలుకోనందున, అతను ఐపీఎల్ నుంచి వైదొలిగాడని ఫ్రాంచైజీ బుధవారం ప్రకటించింది. 24 ఏళ్ల శివమ్‌ను రూ. 6.4 కోట్లు వెచ్చించి గతేడాది వేలంలో లఖ్‌నవూ జట్టు సొంతం చేసుకుంది.

ఆర్సీబీ ఓటమికి వాళ్లే కారణం..



న్యూఢిల్లీ: జట్టులోని స్టార్ ఆటగాళ్ల ఒత్తిడికి చిత్తు కావడమే ఆర్సీబీ పరాజయాలకు కారణమని టీమిండియా మాజీ బ్యాటర్ అంబటి రాయుడు విశ్లేషించాడు. ఐపీఎల్ మొదలైనప్పటినుంచి ప్రయత్నిస్తున్నా ఆర్సీబీకి టైటిల్ అందని ద్రాక్షగానే మిగిలింది. ఈసారీ ఆ జట్టు పరిస్థితి మెరుగ్గాఏమీ లేదు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 4 మ్యాచ్‌లు ఆడితే మూడింటిలో పరాజయమే ఎదురైంది. దాంతో ఆ జట్టు పాయింట్ల పట్టికలో కింది నుంచి మూడో స్థానంలో ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో రాయుడు స్పందిస్తూ..బెంగళూరు స్టార్ బ్యాటర్లు విరాట్, మ్యాక్స్‌వెల్, కెప్టెన్ డుప్లెసినుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించాడు. 'ఒత్తిడి సమయాల్లో భారత యువ బ్యాటర్లు, దినేశ్ కార్తీక్ మినహా మరెవరూ రాణించడంలేదు. ఒత్తిడి సందర్భాల్లో బాధ్యత తీసుకోవాల్సి స్టార్లు ఏం చేస్తున్నారు. అప్పటికే వారు అవుటై డ్రెసింగ్ రూమ్ చేరుతున్నారు' అని రాయుడు విమర్శించాడు.

సిరీస్ లంక వశం

రెండో టెస్ట్‌లోనూ ఓడిన బంగ్లా

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక 192 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 511 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు ఆఖరి, ఐదో రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 268/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 318 పరుగులకు ఆలౌటైంది. మెహిదీహసన్ మిరాజ్ (81 నాటౌట్) పోరాటం వృథా అయింది. లాహిరు కుమార 4, కమిందు మెండిస్ 3 వికెట్లు తీశారు. లంక 531, 157/7 డిక్లేర్ చేయగా.. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగులకు కుప్పకూలింది. మొదటి టెస్ట్‌లో 328 రన్స్‌తో గెలిచిన లంక.. బంగ్లాలో టెస్ట్ ఓడని రికార్డును నిలబెట్టుకొంది.

ఈ నెలాఖరులో బంగ్లా టూర్‌కు అమ్మాయిలు

ఢాకా: భారత క్రికెట్ మహిళల జట్టు ఈనెలాఖరులో బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఈనెల 28 నుంచి వచ్చేనెల 9 వరకు బంగ్లాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది భారత జట్టు. ఈ మేరకు బంగ్లా క్రికెట్ బోర్డు బుధవారం షెడ్యూల్‌ను విడుదలజేసింది. ఏప్రిల్ 28న తొలి టీ20, 30న రెండోది, మే2న మూడోది, 6న నాలుగోది, చివరి మ్యాచ్ మే 9న జరగనున్నాయి. మ్యాచ్‌లన్నీ సిల్హెట్ వేదికగా జరుగుతాయి.

ఫిట్‌నెస్‌లో సూర్య పాస్!

7 లేదా 11 నుంచి జట్టులోకి?



న్యూఢిల్లీ: హ్యాట్రిక్ పరాజయాలతో డీలాపడిన ముంబై ఇండియన్స్‌కు శుభవార్త. ఆ జట్టు స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. హెర్నియాతోపాటు పాదం గాయానికి శస్త్ర చికిత్స చేయించుకొని ప్రస్తుతం బెంగళూరు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసంలో ఉన్న టీ20 వరల్డ్ నెం.1 బ్యాటర్ సూర్యకుమార్ అన్ని ఫిట్‌నెస్ పరీక్షల్లో సఫలమైనట్టు సమాచారం. 'ఆటలో మళ్లీ అడుగుపెట్టేందుకు అవసరమైన ఒక్క సాధారణ ఫిట్‌నెస్ పరీక్ష తప్ప.. మిగిలిన అన్ని పరీక్షలను అతడు విజయవంతంగా పూర్తి చేశాడు. ఆ ఒక్కటి కూడా గురువారం జరగనుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీన ముంబైలో ఢిల్లీతో జరిగే మ్యాచ్ ద్వారా సూర్య పునరాగమనం చేస్తాడని ఆయన తెలిపారు. ఆ మ్యాచ్‌తో గనక సాధ్యపడకపోతే..11న బెంగళూరుతో జరిగే పోరుకు కచ్చితంగా జట్టులోకి వస్తాడని చెప్పారు.

స్పోర్ట్స్

విశాఖ దద్దరిల్లింది

కోల్‌కతా 272/7 | **ఐపీఎల్‌లో రెండో అత్యధిక స్కోరు**

- నరైన్, రఘువంశీ ధనాధన్ ఇన్నింగ్స్
- అదరగొట్టిన రస్సెల్, రింకూ
- 106 పరుగులతో ఢిల్లీ ధమాల్



సునీల్ నరైన్ (39 బంతుల్లో 85)



రఘువంశీ (27 బంతుల్లో 54)

1 ఐపీఎల్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా రఘువంశీ (18 ఏళ్ల 303 రోజులు). 2008లో శ్రీవత్స్ గోస్వామి (19 ఏళ్లు) అరంగేట్రం మ్యాచ్‌లో 52 పరుగులు చేశాడు.

విశాఖపట్నం: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కోల్‌కతా నైట్‌రైడర్స్.. ఐపీఎల్‌లో హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సునీల్ నరైన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 85) ఉచకోతకు అంక్రిష్ రఘువంశీ (27 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 54) సుడిగాలి ఇన్నింగ్స్ తోడవడంతో.. బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా 106 పరుగుల భారీ తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. తొలుత కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 272 పరుగుల భారీ స్కోరు చేసింది. రస్సెల్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41) ధాటిగా ఆడాడు. నోకియా 3, ఇషాంత్ 2 వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో ఢిల్లీ 17.2 ఓవర్లలో 166 పరుగులకే కుప్పకూలింది. రిషభ్ పంత్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55), స్టబ్స్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54) వినహా అంతా విఫలమయ్యారు. వైభవ్ ఆరోరా, వరుణ్ చక్రవర్తి చెరో 3 వికెట్లు.. స్టార్క్ 2 వికెట్లు కూల్చాడు.

పెవిలియన్‌కు క్యూ..: కొండంత లక్ష్య ఛేదనలో ఢిల్లీ బ్యాటర్లు ముందుగానే చేతులెత్తేశారు. 33 పరుగులకే టాపార్డర్ బ్యాటర్లు వార్నర్ (18), పృథ్వీ షా (10), మిచెల్ మార్ష్ (0), అభిషేక్ పోరెల్ (0)ను కోల్పోయిన క్యాపిటల్స్ పీకల్లోతు కష్టాల్లో పడింది. మార్ష్, వార్నర్‌ను స్టార్క్ అవుట్ చేయగా.. షా, పోరెల్‌ను ఆరోరా పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో స్టబ్స్, పంత్ ఐదో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. రిషభ్ సిక్స్‌తో ఖాతా తెరవగా.. స్టబ్స్ రెండు బౌండ్రీలు బాదడంతో పవర్‌ప్లేలో ఢిల్లీ 51/4 స్కోరు చేసింది. మధ్య ఓవర్లలో కూడా వీరిద్దరూ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డులో ఊపుతెచ్చారు. అయితే, వెంకటేష్ అయ్యర్ వేసిన 12వ ఓవర్లో 4,6,6,4,4,4తో 28 పరుగులు పిండుకొన్న పంత్ వరుసగా రెండో అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. కానీ, రిషభ్, అక్షర్ (0)తోపాటు స్టబ్స్‌ను చక్రవర్తి అవుట్ చేయడంతో ఢిల్లీ పోరాటం ముగిసింది.

బాదుడే.. బాదుడు..: ఓపెనర్ నరైన్, టీనేజర్ రఘువంశీ అదిరే ఆటకు.. రస్సెల్ పవర్ హిట్టింగ్ తోడుకావడంతో కోల్‌కతా పరుగుల వరద పారించింది. ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించిన నరైన్, రఘువంశీ కేవలం 48 బంతుల్లో 102 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న కోల్‌కతాకు ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (18), నరైన్ తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. 4వ ఓవర్‌లో ఇషాంత్ బౌలింగ్‌లో నరైన్ మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 26 పరుగులు పిండుకోవడంతో.. స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో సాల్ట్‌ను నోకియా క్యాచవుట్ చేశాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రఘువంశీ.. నరైన్ పోటీపడి మరీ షాట్లు ఆడడంతో రన్‌రేట్ మరింతగా జోరందుకొంది. రసిక్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు, సిక్స్‌తో చెలరేగిన సునీల్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. ఆరు ఓవర్లకు కోల్‌కతా 88/1తో నిలిచింది. 53 పరుగుల స్కోరు వద్ద నరైన్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను నోకియా అందుకోలేక పోవడంతో నరైన్ మరింతగా విజృంభించాడు. మరోవైపు రఘువంశీ కూడా సిక్స్‌లతో చెలరేగడంతో.. 11వ ఓవర్‌లోనే జట్టు స్కోరు 150 మార్క్‌కు చేరుకొంది. అయితే, సునీల్‌ను క్యాచవుట్ చేసిన మార్ష్.. ఎట్టకేలకు ఢిల్లీకి బ్రేక్ ఇచ్చాడు. ఆ వెంటనే ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రఘువంశీని నోకియా బోల్తా కొట్టించాడు. కానీ, రస్సెల్ ఎడాపెడా షాట్లతో 16వ ఓవర్‌లోనే నైట్‌రైడర్స్ స్కోరు 200 పరుగులు దాటింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (18) మరోసారి షార్ట్ బాల్‌కు అవుట్ కాగా.. ఉన్నంతసేపు మెరుపులు మెరిపించిన రింకూ సింగ్ (8 బంతుల్లో ఓ ఫోర్, 3 సిక్సర్లతో 26)ను నోకియా వెనక్కిపంపాడు. ఆఖరి ఓవర్‌లో రస్సెల్, రమణ్‌దీప్ (2)ను అవుట్ చేసిన ఇషాంత్.. ఇటీవల ఉప్పల్‌లో సన్‌రైజర్స్ నమోదుచేసిన అత్యధిక ఐపీఎల్ స్కోరు రికార్డును కోల్‌కతా దాటకుండా అడ్డుకొన్నాడు.

నేటి మ్యాచ్
గుజరాత్ x పంజాబ్
రా.7.30 నుంచి

టీ20ల్లో జట్టు అత్యధిక స్కోర్లు

ఎవరు	ఎంత	ఎవరిపై	ఎప్పుడు
నేపాల్	314/3	మంగోలియా	2023
అఫ్ఘానిస్థాన్	278/3	ఐర్లాండ్	2019
చెక్ రిపబ్లిక్	278/4	టర్కీ	2019
హైదరాబాద్	277/3	ముంబై	2024
కోల్‌కతా	272/7	ఢిల్లీ	2024

టీనేజర్.. బెరుకులేని బ్యాటర్!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

వైజాగ్‌లో.. సీనియర్ ఆటగాడు సునీల్ నరైన్‌తో కలిసి ఓ కుర్రోడు ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోశాడు. ఐపీఎల్‌లో బ్యాటింగ్ చేస్తున్నది తొలి మ్యాచైనా ఏ మాత్రం జంకకుండా ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ ఫ్యాన్స్‌ను అలరించాడు. అంతేకాదు.. 25 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి అందరి దృష్టిని తనవైపు తిప్పుకొన్నాడు. అతడే ఢిల్లీకి చెందిన 19 ఏళ్ల అంక్రిష్ రఘువంశీ. క్రికెట్‌పై అనురక్తితో రఘు..11 ఏళ్ల వయస్సులో ముంబై తరలివెళ్లి అభిషేక్ నాయర్ ఆధ్వర్యంలో ఆటలో మెళకువలు నేర్చుకున్నాడు. పొడగరి అయిన రఘు 2022లో కరీబియన్ దీవుల్లో జరిగిన అండర్-19 వరల్డ్ కప్‌లో తన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. 2023-24 సీజన్‌లో ముంబై తరఫున లిస్ట్ 'ఏ', టీ20 అరంగేట్రం చేశాడు. వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ రఘువంశీని రూ. 20 లక్షలకు కొనుగోలు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గత మ్యాచ్‌లో అరంగేట్రం చేసినా బ్యాటింగ్ అవకాశం మాత్రం రాలేదు. ఇక ఢిల్లీతో పోరులో మూడో నెంబర్‌లో దిగిన రఘు.. నోకియా, అక్షర్ పటేల్, మిచెల్ మార్ష్ వంటి స్టార్ బౌలర్లను ఓ ఆటాడుకున్నాడు.



మ్యాచ్‌లో షారుక్ ఖాన్ సందడి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	3	3	0	0	6	2.518
రాజస్థాన్	3	3	0	0	6	1.249
చెన్నై	3	2	1	0	4	0.976
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
గుజరాత్	3	2	1	0	4	-0.738
హైదరాబాద్	3	1	2	0	2	0.204
పంజాబ్	3	1	2	0	2	-0.337
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) స్టబ్స్ (బి) నోకియా 18, నరైన్ (సి) పంత్ (బి) మార్ష్ 85, రఘువంశీ (సి) ఇషాంత్ (బి) నోకియా 54, రస్సెల్ (బి) ఇషాంత్ 41, శ్రేయాస్ (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 18, రింకూ సింగ్ (సి) వార్నర్ (బి) నోకియా 26, వెంకటేష్ (నాటౌట్) 5, రమణ్‌దీప్ (సి) పృథ్వీ షా (బి) ఇషాంత్ 2, స్టార్క్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 20 ఓవర్లలో 272/7; వికెట్ల పతనం:** 1-60, 2-164, 3-176, 4-232, 5-264, 6-264, 7-266; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-43-1, ఇషాంత్ 3-0-43-2, నోకియా 4-0-59-3, రసిఖ్ 3-0-47-0, సుమిత్ 2-0-19-0, అక్షర్ 1-0-18-0, మార్ష్ 3-0-37-1.

ఢిల్లీ: వార్నర్ (బి) స్టార్క్ 18, పృథ్వీ షా (సి) వరుణ్ (బి) వైభవ్ 10, మార్ష్ (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 0, అభిషేక్ (సి) నరైన్ (బి) వైభవ్ 0, పంత్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 55, స్టబ్స్ (సి) స్టార్క్ (బి) వరుణ్ 54, అక్షర్ (సి/సబ్) పాండే (బి) వరుణ్ 0, సుమిత్ (సి/సబ్) పాండే (బి) నరైన్ 7, రసిఖ్ (సి) సాల్ట్ (బి) వైభవ్ 1, నోకియా (సి) శ్రేయాస్ (బి) రస్సెల్ 4, ఇషాంత్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 17.2 ఓవర్లలో 166 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-21, 2-26, 3-27, 4-33, 5-126, 6-126, 7-159, 8-159, 9-161, 10-166; **బౌలింగ్:** స్టార్క్ 3-0-25-2, వైభవ్ 4-0-27-3, రస్సెల్ 1.2-0-14-1, నరైన్ 4-0-29-1, వరుణ్ 4-0-33-3, వెంకటేశ్ 1-0-28-0.

పంత్ కారణంగా..

రివ్యూలు తీసుకోవడంలో రిషభ్ పంత్ వైఫల్యం కారణంగా ఢిల్లీ భారీ మూల్యాన్నే చెల్లించుకుంది. 24 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇషాంత్ బౌలింగ్‌లో నరైన్ బ్యాట్ ఎడ్జ్ తీసుకొగా.. పంత్ రివ్యూ తీసుకోవడంలో ఆలస్యం చేశాడు. ఇక, రసిక్ బౌలింగ్‌లో అయ్యర్ క్యాచవుట్ విషయంలో కూడా రివ్యూకు నిరాకరించాడు.

పెన్షన్లపై జగన్నాటకం!

- కావాలనే పింఛన్ల పంపిణీలో జాప్యం.. ఖజానా నుంచి నిధులు పక్కదారి
- 1వ తేదీ ఇవ్వరాదని ముందే నిర్ణయం
- చంద్రబాబే కారణమని ఎన్నికల వేళ నిందలు వేసేందుకు కుట్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఎన్నికల ముందు జగన్ 'కోడికత్తి', 'గొడ్డలివేటు' డ్రామాలను రక్తికట్టించారు. అప్పటి చంద్రబాబు సర్కారుపై అసత్యాలు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందారు. ఇప్పుడు ఎన్నికల వేళ మరోసారి వికృత క్రీడ ఆడుతున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేస్తూ చంద్రబాబుపై నిందలు వేస్తున్నారు. పెన్షన్ల పంపిణీ విషయంలో ఉద్దేశపూర్వకంగా జగన్ ప్రభుత్వం ఆడుతున్న నాటకం బట్టబయలైంది. పెన్షన్ల పంపిణీలో జాప్యానికి వలంటీర్లను తప్పించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సంబంధం లేదని తేలిపోయింది. అలాగే పెన్షన్లకు డబ్బుల్లేవంటూ సర్కారు చెబుతున్నవి కాకమ్మ కబుర్లేనని అర్థమవుతోంది. 'ఎలాగైనా పెన్షన్ల పంపిణీలో జాప్యం జరగాలి. లబ్ధిదారులు ఇబ్బందులు పడాలి. ఆ నెపాన్ని ప్రతిపక్షాలపై నెట్టి రాజకీయ లబ్ధి పొందాలి' అన్నదే జగన్ పార్టీ ప్రధాన అజెండా. అవ్వాతాతలకు పెన్షన్లు జాప్యం చేయడానికి ప్రభుత్వం సైలెంట్‌గా సొంత కాంట్రాక్టర్లకు, పాత అప్పులకు నిధులు మళ్లించేసింది. మార్చి నెలాఖరులో రూ.వేల కోట్లు చెల్లించింది. మద్యం కంపెనీలకు ఐదేళ్లుగా ఉన్న బకాయిలు, మద్యం సీసాలపై వేసే హోలోగ్రామ్స్ బిల్లులు మంజూరుచేస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసిన విషయం బయటపడింది. డబ్బుల్లేవంటూ డ్రామాలు ఆడుతున్న ప్రభుత్వం ఐదేళ్ల నాటి బకాయిలను ఇప్పుడే ఎందుకు చెల్లించాల్సి వచ్చింది? ఇంతకాలం ఆ కంపెనీలు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదేమంటే ఒక్కటే సమాధానం! పెన్షన్లు ఇవ్వడానికి డబ్బుల్లేవని ఖజానా ఖాళీ చేసి చూపించడం అన్నమాట. అలాగే అస్మదీయులైన కాంట్రాక్టర్లకు రెండురోజుల్లోనే రూ.వేల కోట్ల బిల్లులు విడుదల చేసింది.

ఫోన్ ఆదేశాలతోనే...

రూ.489.51 కోట్లను ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి ఎక్సైజ్ కమిషనర్ ఖాతాకు బదిలీ చేసేందుకు మార్చి 30న ఎక్సైజ్ స్పెషల్ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు. అదేదో అత్యవసర అంశంలా నిధులు విడుదల చేయాలంటూ ఆర్థిక శాఖ కార్యదర్శి టెలిఫోన్‌లో ఆదేశాలిచ్చారు. ఆ వెంటనే ఆగమేఘాలపై నిధులు విడుదల చేశారు. పెన్షన్లకు డబ్బుల్లేవని మాయమాటలు చెబుతున్న ప్రభుత్వం మద్యం ద్వారా వచ్చిన ఆదాయాన్ని మాత్రం సొంత అవసరాలకు వాడుకుంటోంది. ఆ నగదును పెన్షన్లకు సర్దుబాటు చేసే అవకాశం ఉన్నప్పటికీ ఆ ఆలోచన చేయట్లేదు. రాష్ట్రంలో రోజూ సగటున రూ.75కోట్ల విలువైన మద్యం విక్రయిస్తారు. తద్వారా రూ.60కోట్లకు పైగా ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుంది. నెలకు రూ.2వేల కోట్ల వరకూ వస్తాయి. పెన్షన్లకు నెలకు రూ.1800కోట్లు అవసరం. నిజంగా పెన్షన్లను సకాలంలో అందించే చిత్తశుద్ధి ఉంటే ఒకనెల మద్యం ఆదాయాన్ని సర్దుబాటు చేస్తే సరిపోతుంది. కానీ ఆ ఆదాయాన్ని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించుకున్న ప్రభుత్వం పెన్షన్లకు మాత్రం ఆర్‌బీఐ అప్పు ఇస్తేనే అంటూ మెలిక పెట్టింది.

చేతిలో డబ్బున్నా...

మార్చి 30న ప్రభుత్వం దగ్గర రూ.1600 కోట్లు అందుబాటులో ఉంది. ట్రెజరీ బిల్స్‌లో పెట్టిన ఈ డబ్బును పెన్షన్ల కోసం గాకుండా బిల్లులు చెల్లించేందుకే జగన్ సర్కార్ వాడింది. గతనెల 30న మొత్తం 6,000 కోట్లు, ఆ మరుసటి మరో 1,200 కోట్లు బిల్లులు చేశారు. పెన్షన్లను జాప్యం చేసి, నిధులు పక్కదారి పట్టించి కాంట్రాక్టర్ల జేబుల్లో వేశారు. 3నుంచి పెన్షన్లు పంపిణీ చేస్తామంటూ సర్క్యులర్ ఇచ్చిన ప్రభుత్వం ఆ మాటా నిలబెట్టుకోలేదు. ఏప్రిల్ 2నాటికి కూడా పంచాయతీల ఖాతాల్లో పెన్షన్ డబ్బులు జమ కాలేదు. అంటే.. 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయరాదని జగన్ సర్కార్ ముందుగానే నిర్ణయించిందన్నమాట. ఈసీ ఆదేశాల మేరకు పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను పక్కనబెట్టినా.. దాదాపు లక్షన్నర మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉన్నారు. అయినా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసింది. మరోవైపు ఆర్‌బీఐ నుంచి రూ.4,000కోట్ల అప్పు తెచ్చినా ఈ నెల కూడా ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు అందలేదు.


ఏలూరులోని ఒక సచివాలయంలో వేలిముద్రలు వేసేందుకు వేచి ఉన్న మహిళలు


తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలులో నగదు రాలేదని చెప్పడంతో వెనుతిరుగుతున్న 92 ఏళ్ల వృద్ధుడు కొశిరెడ్డి వెంకట్రావు




విజయవాడలో వృద్ధురాలి ఇంటికి వెళ్లి వేలిముద్ర తీసుకుంటున్న సిబ్బంది, యనమలకుదురులో పెన్షన్ తీసుకున్న మహిళ


కోనసీమ జిల్లా పేరూరు-4 సచివాలయం వద్ద సొమ్మసిల్లిన మూర్తి

నీచం జగన్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వైసీపీ నీచ రాజకీయం మరోసారి బట్టబయలైంది. పింఛను సొమ్ము సకాలంలో విడుదల చేయకుండా.. అవ్వాతాతలకు అందించే వీల్లేకుండా చేసి... 'ఇదంతా విపక్షాల వల్లే. వలంటీర్లు లేనందువల్లే' అంటూ దుష్ప్రచారానికి తెగబడింది. పింఛన్ల సొమ్మును అరకొరగా పంపించి గంటల కొద్దీ సమయాన్ని హరించింది. ఫలితంగా పింఛను కోసం వచ్చిన లబ్ధిదారులు లబోదిబోమన్నారు. తీవ్రమైన ఎండవేడికి తాళలేక.. నానా యాతనపడ్డారు. కనీసం పింఛన్ల పంపిణీ కేంద్రాల వద్ద సరైన వసతులు కూడా కల్పించకపోవడం ప్రభుత్వ కుట్రలో భాగమేనని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

అంతా అరకొరగా...

నెల్లూరు జిల్లాలోని కొన్ని మండలాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా, ఆత్మకూరు వంటి మండలాల్లో సాయంత్రం 5 గంటల నుంచి గానీ పంపిణీ మొదలవలేదు. నగదు ఆలస్యంగా రావడం, వచ్చింది కూడా తక్కువేనని తెలియడంతో చాలా మంది లబ్ధిదారులు తమకు ఎక్కడ పింఛను అందదోనని ఆందోళన చెందారు. నంద్యాల జిల్లాలో దాదాపు రూ.62 కోట్లు అవసరంకాగా.. రూ.50 కోట్లు మాత్రమే జమ అయినట్లు తెలుస్తోంది. సాయంత్రం 6 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 26% మాత్రమే పంపిణీ జరిగింది.

ఏలూరు, నూజివీడు, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో లబ్ధిదారులు ఉదయం 8 గంటలకే సచివాలయాలకు చేరుకున్నారు. తీరా బ్యాంకుల్లో సొమ్ములు సకాలంలో జమ కాకపోవడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రారంభమైంది. వైసీపీ నేతలు కొందరు సచివాలయానికి చేరుకుని విపక్షాలను తిట్టిపోయాలంటూ కొందరు పింఛన్‌దారులను ప్రేరేపించారు. గణపవరం మండలం కొండేపాడులో పింఛన్‌దారులకు రూ.6 లక్షలు సొమ్ములు ఇవ్వాల్సి ఉండగా, కేవలం బ్యాంకు నుంచి రూ.12వేలు మాత్రమే అందాయి.

గోదావరి జిల్లాల్లో...

కాకినాడ జిల్లాలో నిధులు ఇంకా బ్యాంకు ఖాతాలకు రాలేదని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో పలువురు ఊసూరుమంటూ వెనుదిరిగారు. మరికొందరు అరుగులు, చెట్లు నీడన ఎదురుచూస్తూ ఉండిపోయారు. జిల్లాలో సాయంత్రానికి పంపిణీ ప్రారంభించారు. అది కూడా మండలాలు, పట్టణాలు, నగరాలు వారీగా విడుదల చేయాల్సిన నిధుల్లో 50 శాతంలోపుగానే జమ చేసినట్టు సమాచారం. కోనసీమ జిల్లాలో మధ్యాహ్నం 2 గంటల వరకు బ్యాంకుల నుంచి నిధులు సచివాలయాలకు చేరలేదు. 3 గంటల తర్వాత రూ.71,43,58,500 అందాయి. అనంతరం పెన్షన్ల పంపిణీ ప్రారంభించినా 60,137 మందికి రూ.18,13,11,000 పంపిణీ చేశారు.

శ్రీకాకుళం జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కేవలం 30.29 శాతం మాత్రమే జరిగింది. బుధవారం సాయంత్రం నుంచే పింఛన్ల పంపిణీ మొదలుపెట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పలుచోట్ల సామాజిక పింఛన్ల సొమ్ము విత్ డ్రా కోసం కొన్నిచోట్ల బ్యాంకుల వద్ద బుధవారం రాత్రి వరకు పంచాయతీ కార్యదర్శులు పడిగాపులు కాశారు. విజయనగరం జిల్లాలో పింఛన్ అందించేందుకు రూ.84.84 కోట్లు అవసరం. బుధవారం సాయంత్రం వరకు పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును బ్యాంకులకు జమ చేయలేదు. శృంగవరపుకోట మండలంలో 20 గ్రామ సచివాలయాల వరకు ఉన్నాయి. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు నగదు పంపిణీ చేసేందుకు రూ.10.78 లక్షలు మాత్రమే జమయ్యాయి. ఈ సొమ్మును తీసుకువెళ్లి ఎవరికి పంపిణీ చేయాలో అర్థంకాక సచివాలయ ఉద్యోగులు తలలు పట్టుకున్నారు.

రెచ్చగొట్టు-రచ్చచెయ్యి!

పింఛన్ల పంపిణీ ఆలస్యానికి కర్త, కర్మ, క్రియ జగన్ ప్రభుత్వమే. అయితే.. ఎన్నికల నేపథ్యంలో విపక్షాలపై దీనిని నెట్టేసే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో కొన్ని అనుకూల మీడియా చానెళ్ల ద్వారా లబ్ధిదారులను రెచ్చగొట్టి, రచ్చచేసే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు.

- ఏలూరు నగరంలో నూకాలమ్మ ఆలయం సమీపాన ఉన్న సచివాలయంలో వైసీపీ అనుకూల చానెల్ పింఛన్ల పంపిణీ జాప్యానికి టీడీపీనే కారణం అన్నట్టుగా లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరించింది. వైసీపీ నేతలు కొందరు సచివాలయ ప్రాంగణానికి చేరకుని పింఛన్‌దారులను రెచ్చగొట్టారు. స్థానిక వైసీపీ నేత నేతర సురేశ్ ఈ తతంగాన్ని నడిపించారు. దీంతో అక్కడకు చేరుకున్న టీడీపీ నేత అజయ్ లబ్ధిదారులను రెచ్చగొడుతున్నారంటూ వాగ్వాదానికి దిగారు. పోలీసులు ఇరుపక్షాలను పంపించివేశారు.
- జంగారెడ్డిగూడెం మండలం ఏ.పోలవరం సచివాలయంలో నాగార్జున అనే వ్యక్తి పింఛన్‌దారులను రెచ్చగొట్టారు. టీడీపీపై నిందలు ఎలా వేయాలో వివరించారు. అతనికి మరికొందరు వైసీపీ నేతలు వత్తాసు పలికారు. దీన్ని గమనించి స్థానిక పాత్రికేయులు సచివాలయం సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నాగార్జునను పోలీసులకు అప్పగించారు.

6వ తేదీ దాకా పింఛన్లు

- ఉదయం 7 నుంచే అందిస్తాం

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో భాగంగా తొలి రోజు బుధవారం 25.66 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించినట్టు పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం ప్రభుత్వం రూ.1951.69 కోట్లు విడుదల చేసిందన్నారు. మొత్తం 14,994 గ్రామ, వార్డు సచివాలయాలకు గాను 13,669 సచివాలయాల్లో పంపిణీని ప్రారంభించినట్టు తెలిపారు. గురువారం నుంచి ఉదయం 7 గంటలకే పింఛన్లను పంపిణీ చేయనున్నట్టు వివరించారు. ఈ నెల 6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని శశిభూషణ్ కుమార్ వెల్లడించారు.

అడుగడుగునా అబద్ధాలే!

సామాజిక పింఛన్లను బుధవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేస్తామని సెర్ప్ సీఈవో ముందుగానే పేర్కొన్నారు. అయితే, వైసీపీ రెచ్చగొట్టే రాజకీయం చేయడంతో పలు జిల్లాల్లో లబ్ధిదారులు ఉదయం నుంచే ఆయా సచివాలయాలకు చేరుకుని వేచి చూశారు. అయితే, ప్రభుత్వం ఉద్దేశ పూర్వక నిర్లక్ష్యం ఇక్కడ కూడా కనిపించింది. సచివాలయాల్లో టెంట్లు వేయాలని, తాగు నీరు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించినా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సిబ్బంది దీనిని అసలు పట్టించుకోలేదు. దీంతో కనీసం తాగునీరు కూడా లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇక ఇదే అదునుగా అధికార పార్టీ నేతలు పింఛన్ల పంపిణీ ఆలస్యానికి విపక్ష టీడీపీనే కారణమంటూ అబద్ధాలు, అసత్యాలను ప్రచారం చేశారు.

విపక్షాలపై 'ఐవీఆర్ఎస్' విషం!

పెన్షన్ల జాప్యానికి ప్రతిపక్ష పార్టీల అధినేతలే కారణమంటూ పెన్షనర్లకు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ వచ్చాయి. విపక్ష పార్టీలపై బురదజల్లుతూ.. రాజకీయ ఘర్షణలకు తావిచ్చేలా కుట్రపూరితంగా ఈ ఐవీఆర్ఎస్ కాల్స్ రావడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఈ ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ల కారణంగానే.. పెన్షనర్లకు ఈ పరిస్థితి వచ్చిందంటూ.. వేర్వేరుగా వారి మీద బురదజల్లుతూ కాల్స్ వచ్చాయి.

సర్కారు నిర్లక్ష్యాలు ఇవీ

- నెల్లూరు జిల్లాలో తొలిరోజు 26% మాత్రమే పింఛన్లు పంపిణీ.
- ఏలూరు జిల్లా గణపవరంలో రూ.6 లక్షలకు గాను రూ.12 వేలే నిధులు.
- కాకినాడ జిల్లాలో 50 శాతం నిధులే రాక.
- కోనసీమ జిల్లాలో 25.38 శాతం మాత్రమే పంపిణీ
- అమలాపురం రూరల్ పేరూరు-4 సచివాలయానికి వచ్చిన వృద్ధుడు కురసాల నరసింహమూర్తి ఎండ వేడిమికి తాళలేక స్పృహ కోల్పోయారు.
- శ్రీకాకుళంలోని మెజారిటీ సచివాలయాల్లో రాత్రి 8 గంటల తర్వాత నిధులు జమ.
- టెక్కలి మండలం నర్సింగపల్లి సచివాలయానికి రూ.15.23 లక్షలు ఇవ్వాల్సి ఉండగా 6.15 లక్షలే అందింది.
- టెక్కలి మండలంలో కొన్ని సచివాలయాలకు రూ.లక్ష లోపే నగదు జమైంది. దీంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు.
- శృంగవరపుకోట పంచాయతీలోని ఓ సచివాలయానికి చెందిన పింఛన్‌దారులకు రూ.19.51 లక్షలు అవసరం. కానీ, బ్యాంకులో రూ.80.662 మాత్రమే జమకావడంతో పంపిణీ చేపట్టలేదు.
- విజయనగరంలో అరకొర నిధులతో ప్రారంభం కాని పింఛన్ల పంపిణీ.
- రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా టెంట్లు కానీ, తాగునీటి వసతి కానీ కల్పించలేదు.

సీఎస్‌ను ఎన్నికల విధులకు దూరంపెట్టండి

- సీఈవో మీనాకు ఎన్డీయే కూటమి నేతల ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని తక్షణం బదిలీ చేసి ఎన్నికల విధులకు దూరంగా పెట్టాలని ఎన్డీయే కూటమి డిమాండ్ చేసింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి వాసు తదితర నాయకులు బుధవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాను కలసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. కొంతమంది అధికారులు, వైసీపీ నాయకులు కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని అదనపు ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశామని చెప్పారు. సీఎస్ ఎప్పుడూ జగన్ భజన చేస్తుంటారని, పింఛన్ల పంపిణీ వ్యవహారంలో ప్రభుత్వం ఇంతలా అభాసుపాలు కావడానికి జవహర్‌రెడ్డే కారణమని ఆరోపించారు. సస్పెండ్ అయిన వలంటీర్లందరూ పింఛనుదారులను తీసుకెళ్లి అల్లరి చేయండని ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడిన ఫోన్ సంభాషణలను ఈసీకి ఇచ్చామని వివరించారు. చంద్రబాబు పెన్షన్లు ఆపించారని చెబుతున్న మంత్రి జోగి రమేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, కౌన్సెలింగ్ పేరుతో టీడీపీ కార్యకర్తలను రాత్రంతా కొట్టిన కర్నూలు ఎస్పీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని చెప్పారు.

వైసీపీ డీఎన్‌ఏలోనే శవ రాజకీయం: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ డీఎన్ఏలోనే శవ రాజకీయం ఉందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. "2014లో తండ్రి శవం, 2019లో బాబాయ్ శవం, 2024లో పెన్షనర్ శవం... వైసీపీ బతుకే ఫేక్. సహజంగా మరణించిన ఒక వృద్ధురాలి ఇంటికెళ్లిన మంత్రి జోగి రమేశ్... 'ఆమె శవాన్ని ఇస్తే, చంద్రబాబు ఇంటికి వెళ్తాం' అని డ్రామా వేశాడు. మృతురాలి బంధువులు బండ బూతులు తిట్టి పంపించారు" అని బుధవారం ఎక్స్ వేదికగా లోకేశ్ వ్యాఖ్యానించారు.

జగన్నాటకానికి పింఛనుదారులు బలి: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పింఛను తీసుకొనే వృద్ధులను పొద్దున్నే గ్రామ, వార్డు సచివాలయాల వద్దకు పరుగులు తీయించిన కుట్ర ఎవరిదని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీపై బురద చల్లాలన్న ఆత్రంలో సీఎం జగన్ ఆడిన నాటకానికి పింఛనుదారులు బలయ్యారు. ఈ కుట్రలో కొందరు అధికారులు కూడా పాత్రధారులు. వారికి కొద్ది రోజుల్లోనే తగిన శాస్తి తప్పదు' అన్నారు. ఇదే అంశంపై టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీలో జగన్ సర్కార్ కుట్ర చేస్తోందన్నారు.

పింఛన్లు ఇవ్వడానికి ఉద్యోగులు లేరా?: పవన్

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛన్ల పంపిణీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన సూటి ప్రశ్నలు సంధించారు. 'ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ గారూ.. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇళ్ల దగ్గర పింఛను అందించడానికి ఉన్న ఇబ్బంది ఏమిటి? పవన్ కల్యాణ్ సినిమా రిలీజ్ అయితే థియేటర్ల వద్ద రెవెన్యూ ఉద్యోగులకి డ్యూటీలు వేస్తారు. మరి పించన్లు ఇవ్వడానికి ఉద్యోగులు లేరా? గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ యంత్రాంగం ద్వారా పెన్షన్లు ఇవ్వొచ్చు' అని పవన్ అన్నారు. కాగా, పింఛన్లు తీసుకోవాల్సిన వృద్ధులకు, దివ్యాంగులకు తోడుగా ఉండాలని పవన్ జనసైనికులకు పిలుపునిచ్చారు.

వైసీపీ ఓటమే లక్ష్యంగా బరిలోకి!

- రేపటి నుంచి షర్మిల ఎన్నికల ప్రచారం

కడప, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. కడప ఎంపీ స్థానానికి ఆమె కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. కడప పార్లమెంటు పరిధిలో విస్తృతంగా బస్సుయాత్ర చేపట్టనున్నారు. శుక్రవారం బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలంలోని అమగంపల్లె నుంచి 9.45 గంటలకు బస్సుయాత్ర మొదలుపెడతారు. 12వ తేదీ వరకు కడప పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ బస్సుయాత్ర సాగుతుంది. చిన్నాన్న వైఎస్ వివేకా కోసమే తాను కడప ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నట్లు షర్మిల ఇప్పటికే వెల్లడించారు.

అప్పుడు బాబాయిని.. ఇప్పుడు వృద్ధుల్ని..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గానీ, అధికార యంత్రాంగానికి గానీ బాధ్యత లేదా అని నిలదీశారు. డ్రామాలు ఆడుతున్న వారికి మీరు కూడా సహకరిస్తున్నారా అని నిలదీశారు. ఇంత మంది అధికారులు ఉన్నారు. ఒక నెల పింఛను ఇంటింటికి తిరిగి ఇవ్వలేరా అని ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం కోనసీమ జిల్లా రావులపాలెంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్‌పై ఆయన మండిపడ్డారు. 'అధికార పార్టీ నీచమైన రాజకీయాలతో దిగజారిపోయింది. పింఛన్ల పంపిణీని కావాలనే అడ్డుకుంటోంది. వలంటీర్లను రెచ్చగొట్టి రాజీనామా చేయించింది. గ్రామాల్లో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయడానికి గ్రామ సచివాలయాలు ఉన్నాయి. రాష్ట్రంమొత్తమ్మీద వాటిలో 1,26,000 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. గ్రామంలో 40-50 మంది వృద్ధులకు వీళ్ల పింఛన్లు పంపిణీ చేయలేరా? వీరి ద్వారా నాలుగు రోజుల్లో పంచొచ్చు. కానీ ఎందుకలా చేయలేదు? నీకు చేతకాకపోతే దద్దమ్మలా దిగిపో. ఒక్కరోజులో మొత్తం పెన్షన్లు పంచి చేసి చూపిస్తా. సామాజిక పెన్షన్లను ఎన్టీఆర్ మొట్టమొదటిసారి రూ.35తో ప్రారంభించారు. నేను సీఎం అయ్యాక రూ.200 ఉండే పింఛనను రూ.2,000కు పెంచాను. 3 వేలకు పెంచుతున్నానన్న జగన్.. గద్దెనెక్కాక ఏడాదికి రూ.250 వంతున పెంచుతూ వచ్చారు. ఆ రోజు మేం రూ.2,000 పింఛను ఇచ్చినప్పుడు.. అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి రూ.5కే భోజనం అందించాం. రోజూ మూడుపూటలా రూ.15 వంతున నెలకు రూ.450 భోజనం కోసం ఖర్చయ్యేది. మిగిలిన రూ.1,500 వారి చేతుల్లో ఉండేవి. దీంతో వారిని ఇంట్లో గౌరవంగా చూసుకునేవారు. అలాంటి వృద్ధులతో సీఎం జగన్ శవ రాజకీయం చేస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చాక పెన్షన్ రూ.4,000 ఇస్తా. ప్రతి నెలా మొదటి తారీఖునే ఇంటికి వెళ్లి అందించేలా చర్యలు తీసుకుంటా. వలంటీర్ వ్యవస్థకు నేను వ్యతిరేకిని కాదు. వలంటీర్లు రాజకీయం చేయడానికే నేను వ్యతిరేకం. దానిలో రాజీలేదు. మీరు తటస్థంగా ఉండండి. వచ్చే ఎన్డీయే ప్రభుత్వంలో మీకు న్యాయం చేస్తాం. బాగా చదువుకున్న వలంటీర్లూ ఉన్నారు. వారు రూ.50 వేలు సంపాదించుకునేలా న్యాయం చేస్తా. పింఛన్లు పంపిణీ చేసే వరకూ వృద్ధులు, దివ్యాంగులకు టీడీపీ శ్రేణులు తోడుగా ఉండాలి' అని పిలుపిచ్చారు.

మంచాల డ్రామాలేంటి?

- డబ్బులు సిద్ధం కాకుండానే లబ్ధిదారులను ఎందుకు రమ్మన్నారు?
- సీఎస్, సీఈవోలకు టీడీపీ లేఖలు

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తమ రాజకీయ ప్రయోజనాల కోసం పింఛన్‌దారులను మంచాలపై మోసుకొస్తూ వైసీపీ చేస్తున్న డ్రామాలకు ఎలా అనుమతించారని టీడీపీ ప్రశ్నించింది. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేయాలని ఆదేశాలుంటే వారిని మంచాలపై సచివాలయాలకు వైసీపీ కార్యకర్తలు మోసుకు రావడం ఏమిటని నిలదీసింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎన్నికల ప్రధానాధికారికి లేఖలు రాశారు. 'లేవలేని స్థితిలో ఉన్న పింఛనుదారులకు ఇంటికి వెళ్లి పింఛను ఇవ్వాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. వాటిని ధిక్కరించి లేవలేని స్థితిలో ఉన్న పింఛనుదారులను వైసీపీ కార్యకర్తలు మంచాల మీద మోసుకొని గ్రామ సచివాలయాల వద్దకు తీసుకువచ్చి డ్రామాలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇటువంటి డ్రామాలను ఎలా అనుమతిస్తున్నారు' అని వర్ల తన లేఖలో ప్రశ్నించారు. పింఛను పంపిణీ చేసే అధికారులకు బుధవారం సాయంత్రం డబ్బు చేతికి వస్తే వైసీపీ నేతలు... పింఛనుదారులను బుధవారం ఉదయం ఎనిమిది గంటలకే సచివాలయాల వద్దకు రప్పించారని ఆయన విమర్శించారు. 'బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు పింఛన్ల పంపిణీ మొదలవుతుందని ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆ సమయానికి ఏ సచివాలయం అధికారి వద్ద పంపిణీకి డబ్బులు లేవు. అయినా పింఛనుదారులకు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని వేసవి ఎండల్లో తీవ్రమైన ఇబ్బందికి గురి చేశారు. ప్రభుత్వం తక్షణం చాలినంత డబ్బును సచివాలయాలకు పంపాలి. పింఛనుదారులకు వారి ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలి' అని రామయ్య తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

వలంటీర్లు లేని రాష్ట్రాల్లోనూ పెన్షన్ ఇస్తున్నారు కదా?

- పంపిణీ బాధ్యతల నుంచి తొలగించడం సబబే
- ఈసీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. వలంటీర్ వ్యవస్థ లేని ఇతర రాష్ట్రాల్లో పెన్షన్ల పంపిణీ జరుగుతోందని, లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పెన్షన్లు తీసుకుంటున్నారు కదా? అని వ్యాఖ్యానించింది. పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను నిలువరిస్తూ ఈసీ జారీ చేసిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఈసీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కొట్టేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. వలంటీర్లపై అనేక ఫిర్యాదులు రావడంతోనే పెన్షన్ల పంపిణీ బాధ్యతల నుంచి ఈసీ వారిని తొలగించిందని పేర్కొంది. అనారోగ్య సమస్యలున్న, ఇంటి నుంచి బయటకురాలేని వారికి సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేసే విషయంలో ఈ నెల 2న రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేసిందని గుర్తు చేసింది. పెన్షన్ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను తొలగించడంతో వృద్ధులు, దివ్యాంగులు బాధపడుతున్నారన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను నిలువరిస్తూ ఈసీ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా కుంచెనపల్లి, మున్నంగికి చెందిన వంగా వరలక్ష్మీ, బిందు, అల్లు సునీత పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది జి.శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈసీ ఉత్తర్వులతో వృద్ధులు, దివ్యాంగులు, పక్షవాత, కిడ్నీ రోగులు సచివాలయాల వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకొనేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. వలంటీర్ వ్యవస్థలేని ఇతర రాష్ట్రాల్లో పెన్షన్ల పంపిణీ జరుగుతోంది కదా? అని వ్యాఖ్యానించింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ఈసీ చెప్పిన వివరాలతో తాము సంతృప్తి చెందామని ప్రకటించింది. పిల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ... తన వాదనలు నమోదుచేయాలని కోరారు. రాజకీయ ప్రోద్బలంతో వలంటీర్లపై సిటిజన్ ఫర్ డెమొక్రసీ ఈసీకి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలకే పరిమితం కావాలని స్పష్టం చేస్తూ వ్యాజ్యాన్ని కొట్టివేసింది.


వృద్ధురాలి మృతదేహం వద్ద జోగి రమేశ్, బోడె ప్రసాద్

ఓట్లే కావాలనుకుంటే శవాన్ని తీసుకెళ్లు!

- మంత్రి జోగి రమేశ్‌తో మృతురాలి బంధువులు

విజయవాడ/కంకిపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'ఇంట్లో మనిషి చనిపోయిన బాధలో మేముంటే మీ రాజకీయాలేంటి?.. ఓట్లే కావాలంటే శవాన్ని తీసుకెళ్లండి' అంటూ.. మంత్రి, పెనమలూరు వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్‌కు మృతురాలి బంధువులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. వివరాలివీ.. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని గోసాల గ్రామంలో బుధవారం వేంపటి వజ్రమ్మ (75) అనే వృద్ధురాలు మృతి చెందితే.. వైసీపీ నేత జోగి రమేశ్ ఓట్ల కోసం శవరాజకీయం చేయబోయి భంగపడ్డారు! వాస్తవానికి బుధవారం ఉదయం పింఛను కోసం తన ఇంటి నుంచి 50 అడుగుల దూరంలోని సచివాలయానికి వజ్రమ్మ వెళ్లారు. డబ్బులు రాలేదు మధ్యాహ్నం 2 గంటలకు రమ్మని సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఆమె తిరిగి 2 గంటలకు వెళితే ఇంకా డబ్బులు రాలేదు 4 గంటలకు రావాలని చెప్పారు. ఇంటికెవెళ్లి మంచినీళ్లు తాగిన వజ్రమ్మ ఉన్నట్టుండి కుప్పకూలి చనిపోయారు. విషయం తెలుసుకున్న టీడీపీ, వైసీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. తొలుత పెనమలూరు టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ వజ్రమ్మ ఇంటికి వచ్చి మృత దేహాన్ని సందర్శించారు. ఆ తర్వాత పెనమలూరు వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ అక్కడకు చేరుకుని.. చంద్రబాబు రాజకీయం కారణంగానే వృద్ధురాలు మృతి చెందిందంటూ ఆరోపణలు చేశారు. మరోవైపు బోడె ప్రసాద్ కూడా జోగి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ చేతకానితనం వల్లే వజ్రమ్మ మృతి చెందిందన్నారు. మృతదేహాన్ని చంద్రబాబు నివాసం వద్దకు తీసుకెళ్లి నిరసన తెలుపుదామని జోగి రమేశ్ తెలిపారు. దీంతో వజ్రమ్మ బంధువులు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం శవ రాజకీయాలు చేయవద్దన్నారు. ఇంట్లో మనిషి చనిపోయిన బాధలో తాముంటే ఇక్కడ రాజకీయాలు ఏమిటని ప్రశ్నించారు. ఓట్లే ముఖ్యమనుకుంటే శవాన్ని తీసుకెళ్లి ఓట్లు వేయించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. అయినా జోగి వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

పిచ్చి వేషాలేస్తే బట్టలిప్పి తంతాం!: వెంకన్న

గోసాలలో వృద్ధురాలి మృతికి నిరసనగా చంద్రబాబు ఇంటి వద్ద ధర్నా చేస్తానన్న జోగి రమేశ్ వ్యాఖ్యలతో టీడీపీ నాయకులు అప్రమత్తమయ్యారు. మంగళగిరికి చెందిన పలువురు నాయకులతోపాటు, విజయవాడకు చెందిన బుద్దా వెంకన్న, దేవినేని ఉమ, తదితరులు చంద్రబాబు నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ.. 'జోగి రమేశ్ ఓ జోకర్. ఓసారి చంద్రబాబు ఇంటి వద్దకు వచ్చి హడావుడి చేసినందుకే మంత్రి పదవి వచ్చింది. అప్పట్లో పోలీసుల అండతో జోగి దాడికి ప్రయత్నించారు. అయినా గట్టిగా ప్రతిఘటించాం. ఇప్పుడు మళ్లీ ఓట్లకోసం చంద్రబాబు ఇంటికి వెళ్తాను.. ధర్నా చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడు. ఈసారి వస్తే జోగి గుడ్డలూడదీసి కొడతాం' అన్నారు.


బుధవారం రాత్రి చంద్రబాబు నివాసం వద్ద బుద్దా వెంకన్న తదితరులు

వైసీపీ ఐపీఎస్‌లు!

22 మందిని పక్కకు తప్పించండి.. ఆ అధికారులతో 'ఓటుకు చేటు'.. ఈసీకి బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

తమకున్న భక్తిని చాటుకున్నారని చెప్పారు. గత నెల 26వ తేదీన పురందేశ్వరి ఎన్నికల కమిషన్‌కు ఈ ఫిర్యాదు చేశారు. కాగా... ఈ జాబితాలోని ఆరుగురు ఐపీఎస్‌లను ఈసీ ఇప్పటికే పక్కకు తప్పించిన సంగతి తెలిసిందే. మున్ముందు మరెందరిపై చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే! పురందేశ్వరి తన ఫిర్యాదులో పేర్కొన్న అధికారులు, వారిపై చేసిన అభియోగాల వివరాలు ఇవి...



విశాల్ గున్నీ
విశాఖ రేంజ్ డీఐజీ



భయంకరమైన అవినీతిపరుడు. విజయసాయి రెడ్డి జేబులో మనిషిలా మారిపోయారు. పొరుగు రాష్ట్రంలోని తన సమీప బంధువులకు ముడుపులు వెళ్లిపోతాయి.

రాజేంద్రనాథ్ రెడ్డి, డీజీపీ



ఈయన 2022 ఫిబ్రవరి నుంచి రాష్ట్ర ఇన్‌చార్జి డీజీపీగా పని చేస్తున్నారు. పూర్తిస్థాయి డీజీపీ నియామకం కోసం అర్హులైన పోలీసు అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపనేలేదు. ముఖ్యమైన స్థానాల్లో 'అనుకూల' పోలీసు అధికారులనే నియమించి... వారు ఈ ఎన్నికల్లో పూర్తి ఏకపక్షంగా పని చేసేలా రాజేంద్రనాథ్ రెడ్డి అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. అంతేకాదు... పోలీసు శాఖకు సంబంధించిన 'సీక్రెట్ రిజర్వ్ ఫండ్' నుంచి భారీ మొత్తాన్ని సొంతానికి వాడేసుకుని... సంబంధిత ఫైళ్లను ధ్వంసం చేశారు. అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలను మాయం చేశారు. అంతేకాదు... తనకు ఏ సమయంలోనైనా బదిలీ అవుతుందని ఆయన కూడా భావిస్తున్నారు.

పి.సీతారామాంజనేయులు
ఇంటెలిజెన్స్ డీజీ



ప్రధానమంత్రి పాల్గొన్న బహిరంగ సభకు 'అనుకూల' పోలీసు అధికారులను మాత్రమే నియమించి... వేర్వేరు చోట్ల చెక్‌పోస్టులు పెట్టి విపక్షాల కార్యకర్తలు సభా మైదానానికి రాకుండా, అడ్డుకునేందుకు ఈ అధికారి ప్రయత్నించారు. అంతేకాదు... ఈ ఎన్నికలను మేనేజ్ చేసేందుకు, తప్పుడు సర్వేలు చేయించేందుకు భారీగా డబ్బు పుచ్చుకున్నారు. చాలామంది విపక్ష నేతల అక్రమ అరెస్టుకు బాధ్యుడు. మూడేళ్లుగా ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న సీతారామాంజనేయులు అపరిమిత అధికార బలం అనుభవిస్తున్నారు. దీని ద్వారా... ఎస్పీలను, ఇతర పోలీసు అధికారులను బెదిరించి... వారి ద్వారా విపక్ష నేతలపై అక్రమ పద్ధతుల్లో వేధిస్తున్నారు.

సిద్ధార్థ్ కౌశల్
ఎస్పీ కడప జిల్లా



ఈయన అవినీతికి పాల్పడినట్లు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు ఉన్నప్పటికీ.. సీఎం జగన్ తన సొంత జిల్లా కడపలో నియమించారు. వైసీపీ ఎంపీలు మిథున్ రెడ్డి, అవినాశ్ రెడ్డి ఇప్పటికే ఈయనకు డబ్బులు ఇచ్చారు. ఆ డబ్బును దుబాయ్‌లోని బినామీ ఖాతాలో డిపాజిట్ చేశారు. వివేకా హత్యవల్ల వచ్చిన ప్రతికూలతను నివారించడానికి ఓటర్లను శాంతియుతంగా ఓటుహక్కు వినియోగించుకోకుండా అడ్డుకోవడమే ఈయన లక్ష్యం. పోలింగ్ రోజు అర్హులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకునే పని ఈయనకు అప్పగించారు. వైసీపీ అభ్యర్థులు ప్రత్యర్థులను బెదిరించడంలోనూ, వారి ప్రచారాన్ని అడ్డుకోవడంలోనూ సహకరించనున్నారు.

జాషువా
ఎస్పీ, చిత్తూరు



ఈయన అత్యంత అవినీతిపరుడు. ఇటీవలే కృష్ణా జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయనకు అప్పగించిన ప్రధాన బాధ్యత... చంద్రబాబును, ఆ పార్టీ నేతలను ఓడించడం! ముఖ్యంగా కుప్పంలో వైసీపీ నేతల అరాచకాలను చూసీ చూడనట్లు వ్యవహరించారు. దీంతో టీడీపీ నాయకత్వం ఒక్క కుప్పం నియోజకవర్గంపైనే దృష్టి సారించాల్సిన పరిస్థితి వచ్చింది. గతంలో కృష్ణా జిల్లా ఎస్పీగా ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలకు అండగా నిలిచారు. ఆ సమయంలో ప్రతిపక్ష నేతలు కిడ్నాపునకు గురయ్యారు. కనీసం ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కూడా వారికి లేకుండా పోయింది.

రవిశంకర్‌రెడ్డి
ఎస్పీ, పల్నాడు జిల్లా



ప్రధాని పాల్గొన్న సభకు జనం హాజరు కాకుండా రవిశంకర్‌రెడ్డి భారీగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి అడ్డుకున్నారు. సభ జరుగుతున్న సమయంలో కార్యకర్తలు, అభిమానులు అక్కడ ఉన్న కరెంటు స్తంభాలపైకి ఎక్కడం ప్రధాని గమనించారు. ఇది ప్రమాదకరమని, స్తంభాలు ఎక్కిన వారు వెంటనే కిందకు దిగాలని స్వయంగా ప్రధాని కోరాల్సి వచ్చింది. ఆ సమయంలో ఐజీ పాల్‌రాజుతో పాటు రవిశంకర్‌రెడ్డి కూడా అక్కడే ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పరిస్థితిని చక్కదిద్దడానికి పోలీసు బలగాలను పంపలేదు. దీనికోసం పది నిమిషాల పాటు సభను నిలిపివేయాల్సి వచ్చింది. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు అనేకమందిని రవిశంకర్ రెడ్డి నిర్దాక్షిణ్యంగా తప్పుడు కేసుల్లో ఇరికించారు.

పీవీ సునీల్ కుమార్
డీజీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్



'అంబేద్కర్ ఇండియా మిషన్' సంస్థను స్థాపించి... దాని ద్వారా దళిత వాడల్లో వైసీపీ తరఫున ప్రచారం చేస్తున్నారు. 'దళిత వాడలకు పంచాయతీ హోదా కల్పించాలి' అనే మిషతో ఈ తతంగం నడుపుతున్నారు. హిందుత్వను వదిలిపెట్టాలని, బ్రిటిష్ కాలంలోనే దళితుల పరిస్థితి బాగుండేదని చెబుతూ ఆయన చేసిన ప్రసంగాలపై విచారణ జరుగుతోంది.

సంజయ్
సీఐడీ అదనపు డీజీ



రకరకాల కేసులు బనాయిస్తూ మీడియా సంస్థలను బెదిరిస్తున్నారు. ఆయన ప్రస్తుతానికి కొంత తగ్గినట్లుగా కనిపిస్తున్నటికీ... వైసీపీ కోసం ఏం చేసేందుకైనా సదా సిద్ధంగా ఉంటారు. ఎందుకంటే... ఆయన తన కుటుంబ సభ్యుల ద్వారా లంచాలు తీసుకున్నట్లుగా ఏసీబీ ఆధారాలు సంపాదించింది.

విజయారావు, డీఐజీ, కర్నూలు

ఈయన అధికార పక్షానికి పూర్తిగా లొంగిపోయారు. కర్నూలు, ఆత్మకూరు, శ్రీశైలం, మంత్రాలయం, ఆదోని స్థానాల్లో వైసీపీని గెలిపించే బాధ్యతను ఆయనకు అప్పగించారు. దానికి అనుగుణంగా ఆయన ఆయా నియోజకవర్గాల్లో సీఐలు, ఎస్ఐలను నియమించారు. భయంకరమైన అవినీతిపరుడు. నిఘా విభాగం డీజీ, విజిలెన్స్ ఐజీ ఏ ఆదేశాలిచ్చినా తలొగ్గి అమలు చేస్తారు.

అన్బురాజన్, ఎస్పీ, అనంతపురం

వైసీపీ నేతల నుంచి 'వేతనాలు' పుచ్చుకునే వారి జాబితాలో ఈయనా ఉన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌లోనూ ప్రమేయం ఉంది. హత్యలు జరిగినా పట్టించుకోని పోలీసు అధికారి. ప్రతిపక్ష అభ్యర్థులు ప్రచారానికి రాకుండా చూసే బాధ్యత ఈయనకు అప్పగించారు. ఇందుకోసం ఎంతటి అధికార దుర్వినియోగానికైనా పాల్పడతారు. రాయలసీమ మొత్తంలో అనంతపురం జిల్లాలోనే వైసీపీ అభ్యర్థులందరికీ ఘోర పరాజయం తప్పదని తేలింది. ఈ నేపథ్యంలోనే వారిని వేధింపులకు గురిచేసి.. ప్రచారం చేయకుండా నిరోధించే బాధ్యతను అధికార పక్షం ఈయనకు కట్టబెట్టింది.

ఆనంద్ రెడ్డి, ఎస్పీ, నాన్ కేడర్

ఈయన వైసీపీ కీలక నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయిరెడ్డి మనిషిగా పేరు తెచ్చుకున్నారు. ఎవరూ ఊహించని రీతిలో రెండుసార్లు చకచకా పదోన్నతి లభించింది. విశాఖపట్నంలోనే మూడేళ్లు పనిచేశారు. ప్రస్తుతం కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్నారు. కానీ, ఈయనకు విశాఖపట్నం బాధ్యతలనే అప్పగించారు. విపక్ష నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టడం, విపక్ష నేతలను నియంత్రించడమే పనిగా పెట్టుకున్నారు.

రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, కౌంటర్ ఇంటెలిజెన్స్

ఈయన ఇంతకుముందు చిత్తూరు జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఇటీవలే కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగానికి వచ్చారు. ఈయనకు ప్రభుత్వం భారీగా ఎత్తున నిధులు అందుబాటులో ఉంచింది. విపక్షాలకు చెందిన నేతల ఫోన్లను ఈయన ట్యాప్ చేస్తున్నారు. విపక్ష అభ్యర్థి ఫోన్‌ను నేరుగా ట్యాప్ చేయకుండా... ద్వితీయ శ్రేణి నేతల నంబర్లను ట్యాప్ చేసి, వారికి అందుతున్న అధికారిక సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. చిలకలూరిపేటలో ప్రధాని మోదీ సభకు బయల్దేరిన విపక్ష ముఖ్య శ్రేణుల సెల్ ఫోన్లను పర్యవేక్షించి.. చెక్‌పోస్టుల వద్ద వారిని ఆపేయాలని పోలీసులను ఆదేశాలిచ్చారు.

పాల్ రాజ్, గుంటూరు రేంజ్ ఐజీ

ఇటీవల ప్రధానమంత్రి సభ జరిగిన ప్రాంతం ఈ అధికారి పరిధిలోకే వస్తుంది. ఇంటెలిజెన్స్ డీజీ (సీతారామాంజనేయులు), ఎస్పీ రవిశంకర్ రెడ్డి, ఐపీఎస్ అధికారులు పరమేశ్వర్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డిలతో విపక్ష కార్యకర్తలు ప్రధాని సభకు రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చాలా తెలివైన అధికారి. పైకి రూల్స్ ప్రకారం పని చేస్తున్నట్లుగా కనిపిసిస్తారు. కానీ... విపక్షాలను అడ్డుకునేందుకు చాపకింద నీరులా తతంగం నడిపిస్తారు. వైసీపీ నేతలు పెట్టే తప్పుడు ఫిర్యాదుల ద్వారా విపక్షాలకు చెందిన కీలక నేతలను అరెస్టు చేయిస్తారు.

అమ్మిరెడ్డి, డీఐజీ, అనంతపురం



ఈయన కుప్పం, తిరుపతి, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున అలజడులకు ప్రణాళిక రచించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తదితర వైసీపీ సీనియర్ నేతల నుంచి నేరుగా ఆదేశాలు స్వీకరిస్తారు. ఈయన కూడా భయంకరమైన అవినీతిపరుడు. ఆదాయానికి మించి ఆస్తులను భారీగా పోగేశారు.

ఫక్కీరప్ప
జాయింట్ సీపీ, విశాఖపట్నం

అత్యంత అవినీతిపరుడు, అధికార పార్టీకి అమ్ముడుపోయారు. వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డికి తొత్తులా మారారు. ఆయనకు అందాల్సిన ముడుపులన్నీ పొరుగు రాష్ట్రంలోని ఆయన బంధువులకు చేరుతున్నాయి.

కె.రఘురామిరెడ్డి, విజిలెన్స్ ఐజీ

సోదాలు, దాడులు నిర్వహించేందుకు అవసరమైన అపరిమితమైన అధికారాలను ఆయనకు కట్టబెట్టారు. రూ.30 కోట్ల దాకా నిధులను ఆయనకు అందుబాటులో ఉంచారు. మరో ఐపీఎస్ అధికారి రిషాంత్ రెడ్డితో కలిసి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారు. దీని ఆధారంగా విపక్షాల అభ్యర్థులపై దాడులకు దిగి, వారి ప్రచారాన్ని దెబ్బతియాలని ప్రణాళిక రచించారు.

తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ, నెల్లూరు

చట్టాన్ని, చట్ట నిబంధనలను తుంగలో తొక్కి విపక్ష నేతలపై విరుచుకుపడ్డారు. నెల్లూరు జిల్లాలో ప్రతిపక్ష నాయకులను అడుగడుగునా అణిచివేశారు. అధికార పార్టీ వైసీపీ అసమ్మతి నాయకులను అరెస్టు చేసేందుకు సైతం పోలీసులను పురమాయించారు. వైసీపీ అసమ్మతి నేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర రెడ్డిలను అక్రమంగా గృహ నిర్బంధం చేయించారు. అంతేకాదు, ప్రజల్లోకి వెళ్లకుండా నిర్బంధించారు. వైసీపీపై పల్లెత్తు మాటన్నా కేసుల కొరడా ఝుళిపించారు.

జి.కృష్ణకాంత్, ఎస్పీ, కర్నూలు జిల్లా

ఈయన వైసీపీ నేతలకు పూర్తిగా లొంగిపోయారు. అత్తింటివారితో సన్నిహిత సంబంధాలున్న వైసీపీ ఎమ్మెల్సీ చొరవతో ఈయనకు కర్నూలులో పోస్టింగ్ దక్కింది.

రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం

ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును ఓడించాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారు.

క్రాంతిరాణా, కమిషనర్ విజయవాడ

చిన్నాచితకా కారణాలతోనైనా సరే.. విపక్ష నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, వారి ప్రచారాన్ని అడ్డుకోవడం, ప్రచారాన్ని దెబ్బతీయడం అనే బాధ్యతలను ఈ అధికారికి అప్పగించారు. వైసీపీతో బాగా అంటకాగుతున్నారు. ప్రతి విషయాన్నీ సీఎం పేషీకి చేరవేస్తారు. అక్కడి నుంచి ధనుంజయ రెడ్డి, సజ్జల రామకృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు నడుచుకుంటారు.

రఘువీరా రెడ్డి, ఎస్పీ, నంద్యాల

ఈయన ఈ ఏడాది జూన్ 30న రిటైర్‌కానున్నారు. దీంతో తన జిల్లాలోని మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు వైసీపీకి అనుకూలంగా వచ్చేలా చూస్తానని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వాగ్దానం చేశారు. అతి త్వరలో రిటైర్ కానున్నందున ఎన్నికలు జరిగే జిల్లాలో ఈయనకు విధులు అప్పగించకూడదు. ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధం.

పరమేశ్వర్ రెడ్డి, ఎస్పీ ప్రకాశం



తిరుపతి నుంచి ప్రకాశం జిల్లా ఎస్పీగా ఈయన బదిలీపై వచ్చారు. ఎన్నికల్లో నిష్పాక్షికంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని పోలీసు ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలిచ్చి వారిలో తీవ్ర స్థాయి భయాందోళనలు రేపారు. వైసీపీ ఎమ్మెల్యేల అవసరాలకు అనుగుణంగానే డ్యూటీ చేయాలని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ చిలకలూరిపేట సభ బందోబస్తు బాధ్యతల్లో అయన్ను కూడా నియమించారు. భద్రత అదుపు తప్పేలా చేశారు.

టీడీపీ తరఫునే రఘురామ పోటీ

- ఉండి నుంచి అసెంబ్లీకి పోటీ?

అమరావతి/భీమవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నరసాపురం సిటింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు ఈసారి టీడీపీ నుంచి పోటీ చేయబోతున్నారు. మంగళవారం రాత్రి ఆయన హైదరాబాద్‌లో చంద్రబాబుతో భేటీ సందర్భంగా ఈ నిర్ణయం జరిగినట్లు సమాచారం. శుక్రవారం ఆయన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. అదే జిల్లా ఉండి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారని అంటున్నారు. వాస్తవానికి ఆయన్ను నరసాపురం లోక్‌సభ అభ్యర్థిగా నిలపాలని టీడీపీ అధినేత గట్టి ప్రయత్నమే చేశారు. అయితే ఆ సీటు పొత్తులో బీజేపీకి వెళ్లింది. తమ అభ్యర్థిగా శ్రీనివాస వర్మ పేరును ప్రకటించింది. ఆయన్ను మార్చేందుకు సుముఖత చూపలేదని సమాచారం. దీంతో అసెంబ్లీ బరిలో రఘురామరాజును నిలపాలని నిశ్చయించినట్లు చెబుతున్నారు. కాగా.. రఘురామ గురువారం భీమవరం రానున్నారు.

వైసీపీకి కృపారాణి గుడ్‌బై

- 3 నెలలుగా దక్కని సీఎం జగన్ అపాయింట్‌మెంట్

శ్రీకాకుళం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల వేళ.. సిక్కోలు జిల్లాలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు కిల్లి కృపారాణి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆమె మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. తనను పథకం ప్రకారం అణిచివేతకు గురిచేశారని.. సీఎం జగన్‌ని పూర్తిగా నమ్మానని.. 3 మాసాల నుంచి జగన్ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూసినా లభించలేదన్నారు. పార్టీలో చేరినప్పుడు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, క్యాబినెట్ ర్యాంక్ ఇస్తామని నమ్మబలికారన్నారు. సీఎం జగన్ తనను తీవ్రంగా అవమానించారని, వైసీపీ రాజ్యాంగం అంటే ఇదేనేమో అని అన్నారు. అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు స్పష్టంచేశారు. కాగా, కృపారాణి త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశముంది.

పవన్ కల్యాణ్‌కు తీవ్ర జ్వరం..!

- తెనాలి, ఉత్తరాంధ్ర పర్యటనలు రద్దు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరం బారిన పడ్డారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం వరకూ పిఠాపురంలో ఆయన పర్యటించారు. చివరి రోజు 10 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. సోమవారం నుంచే జ్వరంతో ఇబ్బందిపడుతున్న ఆయన మంగళవారమూ తన పర్యటనను కొనసాగించారు. బుధవారం నాటికి జ్వరం మరింత తీవ్రం కావడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ వెళ్లారు. ఆయనకు విశ్రాంతి అవసరమని డాక్టర్లు సూచించారు.దీంతో పవన్ పర్యటనలు రద్దయ్యాయి.

మలి వేటు ఎవరిపై!

- సీమలో ఓ డీఐజీ, కోస్తా ఐజీ బదిలీ ఖాయం!!
- అదనపు డీజీ ర్యాంకు అధికారిపైనా ఈసీ డేగకన్ను
- అదే దారిలో మరో ముగ్గురు ఎస్పీలు కూడా?
- ఐపీఎస్ వర్గాల్లో జోరుగా చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అధికార పార్టీతో అంటకాగుతున్న ఐపీఎస్ అధికారుల్లో ఇంకెవరిపై వేటు పడనుందనే చర్చ పోలీసు ఉన్నతస్థాయి వర్గాల్లో జోరుగా సాగుతోంది. గడిచిన ఐదేళ్లలో ఏకపక్షంగా వ్యవహరించిన వారెవరు..? ఇటీవలి బదిలీల్లో వ్యూహాత్మక అంతర్గత ఒప్పందంతో కీలక పోస్టులు దక్కించుకున్నది ఎవరు..? ప్రతిపక్షాలు ఇంకా ఎవరెవరిపై ఫిర్యాదు చేశాయి..? ఎన్నికల కమిషన్ (ఈసీ) నిఘా చట్రంలో ఇంకా ఎవరు ఉన్నారు.. అనే అంశాలపై ఐపీఎస్ వర్గాల్లో ఒకటే చర్చ. జగన్ ప్రభుత్వంలో అరాచకాలకు వంత పాడలేక.. చూస్తూ చేతులు ముడుచుకోలేక లూప్‌లైన్‌లో పడిపోయి ఉద్యోగం చేసుకుంటున్న అధికారులు ఇప్పుడు సంతోషిస్తున్నారు. ఉద్యోగం చేయలేక నిస్సహాయత వ్యక్తం చేసినా క్షమించొచ్చు గానీ.. న్యాయాన్యాయాలు చూడకుండా అధికార అక్రమాలకు అంటకాగిన వారిని వదిలిపెట్టకూడదని వ్యాఖ్యానిస్తున్నారు. రాయలసీమలో ఓ డీఐజీ, రాజధాని అమరావతి ప్రాంతానికి చెందిన ఓ ఐజీ, ఇంకో ముగ్గురు ఎస్పీలతో పాటు అత్యున్నతమైన అదనపు డీజీ ర్యాంకు అధికారిపైనా ఒకట్రెండు రోజుల్లో వేటుపడనుందని భావిస్తున్నారు. మంగళవారం బదిలీ వేటు పడిన గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు.. సీఐల బదిలీల్లో అధికార పార్టీ సిఫారసులకు ఇచ్చిన ప్రాధాన్యం.. సామర్థ్యానికి ఇవ్వలేదనే అభియోగం ఎదుర్కొన్నారు. ఎస్పీలు సైతం ఆయన్ను లెక్కచేయలేదని, అందుకే పల్నాడులో జరిగిన ప్రధాని సభలో భద్రతా వైఫల్యం కనిపించిందని చెబుతున్నారు. తిరుపతిలో వైసీపీ అక్రమాలపై నమోదైన కేసులు ఎత్తివేసి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి స్వామిభక్తి చాటుకున్నారు. ప్రకాశం జిల్లాలోనూ రాజకీయ హత్యలు జరగడంతో ఆయనపై వేటు పడింది. మరోవైపు జాషువా కృష్ణా జిల్లాలో అధికార పార్టీ నేతలతో చెట్టపట్టాల్ వేసుకు తిరగడమే కాకుండా చిత్తూరు జిల్లాలో వైసీపీ గెలవడానికి లోపాయకారీగా అనుకూల ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డికి ప్రభుత్వం కేటాయించిన బంగళాలోనే వైసీపీ నేతలు సమావేశం ఏర్పాటు చేయడం లాంటివి ఆయన స్థాన భ్రంశానికి కారణాలయ్యాయి. అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ కడప నుంచి చూపిన స్వామిభక్తి ఢిల్లీ సీబీఐ పెద్దలనే ముక్కున వేలేసుకునేలా చేసింది. ఇదే విధంగా పని చేస్తున్న మరికొందరిపైనా వేటు పడొచ్చనే ప్రచారం ఇప్పుడు జోరందుకుంది. ఉత్తరాంధ్రలో ఒక ఎస్పీ అక్కడి వైసీపీ నేతలు అడగడం ఆలస్యం.. ప్రత్యర్థులపై కేసుల నమోదు.. పోలీసుల బదిలీలు చేసేస్తారనే పేరుంది. ఉభయ గోదావరి జిల్లాల్లోనూ మరో ఎస్పీపై ఇవే ఆరోపణలున్నాయి. రాయలసీమలో సీఎం జగన్‌కు బాగా పట్టున్న జిల్లాకు చెందిన ఎస్పీ తీరుపైనా విమర్శలున్నాయి. మరో జిల్లా ఎస్పీని ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) పిలిపించి ఆయన పరిధిలో జరిగిన రాజకీయ హత్యపై అక్షింతలు వేసి పపారు. రాయలసీమలో పోస్టింగ్ కోసం ఒక డీఐజీ అధికార పార్టీతో చేసుకున్న ఒప్పందం ఐపీఎస్ వర్గాల్లో తాజాగా చర్చనీయాంశమైంది. ఎన్నికల్లో మీకు ఎలా కావాలంటే ఆ విధంగా పని చేస్తానంటూ ఆయన పోస్టింగ్ తెచ్చుకున్నట్లు చెబుతున్నారు. ఆ డీఐజీ తీరు, నిర్ణయాలపై ఈసీ ఆరా తీస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఆయన సహా ఆరుగురు అధికారులపై వేటు వేయవచ్చుని విశ్వసనీయ సమాచారం. మరో అదనపు డీజీ స్థాయి అధికారి వ్యవహారం కూడా వివాదాస్పదమైంది. ఇటీవల విశాఖ పోర్టుకు డ్రగ్స్ వచ్చిన సమాచారంతో సీబీఐ రంగంలోకి దిగినప్పుడు.. వారి పనికి ఆటంకం కలిగించడం.. తాము శాంపిల్స్ తీస్తామంటూ కొందరు అధికారులతో కలిసి పోర్టుకు వెళ్లడమే ఇప్పుడాయన కొంప ముంచనుందని అంటున్నారు. ఆయన బదిలీని ఆపడం అధికార పార్టీ నేతల వల్ల కాదని పోలీసు వర్గాలు అంటున్నాయి.

ఆ ఐజీకి ఉద్వాసన?

రాజధాని ప్రాంతంలో ఓ ఐజీ ర్యాంకు అధికారిని తప్పించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని అంటున్నారు. గత ఎన్నికల్లో రాయలసీమలో ఆయన చూపించిన పనితనం, స్థానిక సంస్థల్లో ఆ అధికారి వ్యవహరించిన విధానం, తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సందర్భంగా నిష్పాక్షికంగా పనిచేసే అధికారులను ఆయన అదుపు చేసిన వైనం ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఆ అధికారిని.. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఈసీ మందలించింది. దీంతో ఆయన బదిలీ తప్పదని, ఆ విషయం ఆయనకూ తెలిసిపోయిందని అంటున్నారు. మరోవైపు బదిలీ వేటుపడిన పాలరాజు స్థానంలో గుంటూరు రేంజ్ ఐజీగా ఎవరొస్తారోనని ఐపీఎస్ వర్గాలు ఆసక్తిగా చూస్తున్నాయి.

పూనం మాలకొండయ్యకు హైకోర్టు నోటీసులు

- మెడ్‌టెక్ అక్రమార్కులపై చర్యలు నిలిపివేత జీవోపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటులో అక్రమాలు, నేషనల్ హెల్త్ మిషన్ నిధుల దుర్వినియోగం వ్యవహారంలో సీనియర్ ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్య, మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్న పూనం మాలకొండయ్య, జితేంద్రశర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఏపీ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటులో అక్రమాలు, నేషనల్ హెల్త్ మిషన్ నిధుల దుర్వినియోగం వ్యవహారంలో సీనియర్ ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్య, మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ 2021లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 1645ను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. లీడర్ పత్రిక ఎడిటర్ వెంకట రమణమూర్తి ఈ పిల్ దాఖలు చేశారు. సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించేలా సీఎస్‌ను ఆదేశించాలని కోరారు. ఆయన తరఫున న్యాయవాది వీవీ నారాయణరావు వాదనలు వినిపించారు. మెడ్‌టెక్ జోన్ ఏర్పాటులో అక్రమాలు, నేషనల్ హెల్త్ మిషన్ నిధుల దుర్వినియోగం జరిగాయని నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక సమర్పించిందన్నారు. బాధ్యులపై చర్యలకు సిఫారసు చేసిందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పనిని ప్రేమిస్తే ఒత్తిడి ఉండదు: సత్యవాణి

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 3: పనిని ప్రేమిస్తే ఒత్తిడిని అధిగమించవచ్చునని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సహాయ జనరల్ సెక్రటరీ సత్యవాణి అన్నారు కోచింగ్ సెంటర్, వ్యాగన్‌డిపోలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డ్రైవ్‌లో ఆమె పాల్గొన్నారు. మహిళా కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటే విధులు సక్రమంగా నిర్వహించగలుగుతారన్నారు. ఇటు విధులు, అటు ఇంట్లో సాధారణంగా సమస్యలు వస్తూనే ఉంటాయని, వాటిని చిరునవ్వుతో ఎదుర్కోవాలని సూచించారు. మ హిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘ్ కృషి చేస్తోందన్నారు. ఉద్యోగుల నుంచి గ్రీవెన్స్ స్వీకరించారు. వీటిపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. బ్రాంచి కార్యదర్శి కర్నూలు సుకుమార్, కార్యవర్గ సభ్యులు ఫణిరాజ్‌కుమార్ మణి కుమార్, మునికృష్ణ ఆకుల హైమవతి, రాధిక, సుప్రియ, టికెట్ చెకింగ్ బ్రాంచ్ కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ హోంగార్డుకు 'దీవెన' సహాయం



విజయవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు కమిషనరేట్‌లో ట్రాఫిక్ విభాగం లో పనిచేస్తున్న హోంగార్డు మ హమ్మద్ బాషకు దీవెన ఫౌండేషన్ రూ.10వేల ఆర్థిక సహాయం బుధవారం అందజేసింది. భాష కు 10 రోజుల క్రితం ఒక పాప జన్మించింది. ప్రస్తుతం ఆ చిన్నా రి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తోంది. చిన్నారి వైద్యం కో సం దీవెన ఫౌండేషన్ తరఫున ట్రాఫిక్ కానిస్టేబుళ్ల బ్రహ్మం, న రేంద్ర హోంగార్డుకు రూ.10వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు.

నగరంలో 91 రోజుల పాటు సెక్షన్ 30 అమలు

గుణదల: నగరంలో ప్రజా జీవనానికి ఇబ్బంది లేకుండా చూడాల న్న ఆలోచనతో ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు 91 రోజులపాటు నగరంలో సెక్షన్ 30 అమలులో ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ కాం తిరాణా తెలిపారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పుడు సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన, ధర్నాలకు పోలీసు వారి ముందస్తు అనుమతులు లేకుండా నిర్వహించడం నేరమన్నారు. నిషేధాజ్ఞలు అతిక్రమించి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయం

వన్‌టౌన్, ఏప్రిల్ 3: జిల్లాలో కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని, పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో 34, 35వ డివిజన్ల కార్యకర్తలతో బుధవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి కార్యకర్తలు, నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. పశ్చిమ అభివృద్ధి ధ్యేయంగా తన ఎజెండా ఉంటుందన్నారు. అన్ని డివిజన్లలోనూ కూటమి అభ్యర్థి సుజనా చౌదరికి భారీ మెజారిటీ వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సుజనా చౌదరి సామాజిక బాధ్యత ఉన్న వ్యక్తి అని, కేశినేని నాని ఒక ఊసరవెల్లి అని పేర్కొన్నారు. కేశినేని నానికి దమ్ముంటే అవినీతిపరుడు జగన్‌ను ప్రశ్నించాలన్నారు. ప్రజలందరూ చంద్రబాబును సీఎంగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రపంచంలోనే అవినీతి, అత్యధిక ధనవంతుడైన సీఎం ఎవరని గూగుల్‌లో సెర్చ్ చేస్తే జగన్ పేరు వస్తుందని, కేశినేని నాని ముందు ఈ అవినీతి సీఎంను ప్రశ్నించాలన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు నివసించే కొండప్రాంతంలో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలున్నాయని వీటికి సొంత నిధులను వ్యయం చేయాల్సిన అవసరముందని అందుకే సుజనా చౌదరిని నిలబెట్టారని, అలాగే కేంద్రంలో మంచి పలుకుబడి, ప్రధానమంత్రి వద్ద పరపతి ఉన్న వ్యక్తి కాబట్టి పశ్చిమలో సుజనాచౌదరి అభివృద్ధిలో పరుగులు పెట్టించాలని కోరారు. పోలీసు ఉన్నతాధికారులు, ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నికలు ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో జరిగేందుకు కృషి చేయాలన్నారు. పరిశపోగు రాజేష్, నరసింహచౌదరి, పైడిమాల సుభాషిణీ, మహమ్మద్, విజయలక్ష్మి, వై.రత్న, షేక్ సుభాని, రంగ పాల్గొన్నారు.

● పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)



మాట్లాడుతున్న కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేశినేని శివనాథ్ (చిన్ని), పార్టీ శ్రేణులు,

ఎస్టీల నాలుగేళ్ల పోరాటానికి త్వరలో ఫలితం

ఎస్టీలు నాలుగేళ్లుగా చేస్తున్న పోరాటానికి మరో 42 రోజుల్లో ఫలితం రాబోతోందని కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి ఎస్టీలను నమ్మించి మోసం చేశారని, గిరిజనులకు సంబంధించిన 16 సంక్షేమపథకాలు రద్దు చేశారన్నారు. గిరిజన తండాలు ఐదేళ్ల నుంచి అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. తండాల్లో సాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని, తాగునీరు అడిగితే ట్రాక్టర్‌తో గుద్ది చంపించిన ఘైనం చోటు చేసుకుందన్నారు. నా ఎస్టీ, నా ఎస్టీ అంటూ చెప్పే జగన్‌రెడ్డికి బడుగు, బలహీన వర్గాలంటే చులకన భావమని, నకిరేకల్లులో తండా మహిళలు తాగునీరు అడిగితే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో గుద్దించి చంపేశారన్నారు. ప్రతి తండాకు ఇంటింటికీ సురక్షిత మంచినీరు అందించేందుకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తామన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని తండాల్లో కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారానికి డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని, బాధితులకు 3 నెలలకు సరిపడ మందులు, పౌష్టికాహారం అందిస్తామన్నారు. తిరువూరు కిడ్నీ బాధితుల సమస్యను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లామని త్వరలో ఆయన కిడ్నీ బాధితులను కలిసేందుకు వస్తారన్నారు. తిరువూరులో ఎస్టీలకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతోనే కొలికపూడి శ్రీనివాసరావును టీడీపీ అభ్యర్థిగా తానే తీసుకువచ్చినట్టు చెప్పారు. కొలికపూడి శ్రీనివాసరావు భార్య ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మహిళ కాబట్టి ఎస్టీలందరికీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ జగన్‌కు మహిళలు ఖాళీ బిందెలతో, చెప్పులతో స్వాగతం పలుకుతున్నారన్నారు. వలంటరీ వ్యవస్థను జగన్ నాశనం చేశాడని వారంతా తమ పార్టీ కార్యకర్తలని జగన్ చెప్పిన మాట నిజంకాదా అని ప్రశ్నించారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ మాట్లాడుతూ నేతల తలరాత మార్చే శక్తి ఎస్టీలకు ఉందన్నారు. నమ్మి ఓట్లు వేస్తే జగన్ నట్టేట ముంచాడన్నారు. తండాల్లో డిగ్రీ చదివిన యువకులు ఉద్యోగాలు లేక కూలిపనులకు వెళుతున్నారని ఈ పరిస్థితి మారాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. సిమ్మపర్తి వెంకటేశ్వరరావు, మొగిలి శ్రీనివాస్, గుగులోతు డోలానాయక్, బరోతు పిక్లానాయక్, బానోతు వెంకటరావ్, కె.రాంబాబు, బాలకోటయ్య, శ్రీనివాస్ నాయక్, మాడు లక్ష్మణరావు, రావూరి గోపీ, రావూరి కుసుమలత పాల్గొన్నారు.

9వేల మందితో 28న లలిత సహస్రనామ మహాపారాయణం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 3: జయహో భారతీయం, ముమ్మినేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, లింక్ ఫీల్డ్స్, శ్రీధర్ సీసీఈ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ గ్రౌండ్స్‌లో 9వేల మందితో లలిత సహస్రనామ మహాపారాయణం నిర్వహిస్తున్నట్టు ఏపీ హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అక్కెన వేణుగోపాలరావు తెలిపారు. లోకకల్యాణం, సమస్త ప్రజానీక సంక్షేమం కోసం ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. వేలాదిమందిగా మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాంప్లేట్‌ను ఆయన ఆవిష్కరించారు.యాబలూరి లోక్‌నాథ్‌శర్మ, వెల్లంకి నాగభూషణరావు, సుందర రామశర్మ, వెల్లంకి శ్రీ లలిత, వల్లీశ్వర్, శ్రీనివాస్ అగస్త్యన్, రుతల లలిత, యాబలూరి లోక్‌నాథ్ శర్మ, గోళ్ల నారాయణరావు, సుందరి, గౌతమి, కృష్ణభవానీ, లక్ష్మీగాయత్రి, రాధిక, తారాదేవి, నాగలక్ష్మి, మంగళగిరి గోపాలకృష్ణ, పెదబాబు, పి.రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టి

కృష్ణలంక, ఏప్రిల్ 3: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టిపెట్టామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ తప్పక పాటించాల్సిందేనని భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మార్గదర్శకాలను పాటిస్తూ ప్రచారాలు నిర్వహించుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల నుంచి తీసుకోవాల్సిన ముందస్తు అనుమతులపై బుధవారం జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రచారంలో భాగంగా బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రదర్శనల నిర్వహణ, లౌడ్ స్పీకర్లు, వాహనాల వంటి వాటికి సంబంధించి తప్పనిసరిగా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో వినియోగించే ప్రచార వాహనాలకు హెలీప్యాడ్, హెలీకాప్టర్, ఎల్ఈడీ, ఎయిర్ బెలూన్ వినియోగానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఒక నియోజకవర్గ పరిధిలో బహిరంగ సభలు, ర్యాలీలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ఏర్పాటు వాహనాలకు అనుమతి బహిరంగ సభల్లో స్పీకర్లు బ్యారికేట్స్ నిర్మాణంతో పాటు ఇంటింటి ప్రచారానికి, ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులను తీసుకోవాలన్నారు. ఒకటికిపైగా నియోజకవర్గాల్లో ప్రదర్శనలు, ర్యాలీలను నిర్వహించాల్సి వస్తే ఆయా రాజకీయ పార్టీలు పార్లమెంటరీ రిటర్నింగ్ ఎన్నికల అధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలు ముద్రించి పంపిణీ చేసేటప్పుడు ఆయా వాల్‌పోస్టర్లపై ముద్రణ సంస్థ పేరు, ముద్రించిన ప్రతుల సంఖ్యను ముద్రించాల్సి ఉంటుందని ఇందుకు సంబంధించి ముద్రణ సంస్థకు రాజకీయ పార్టీలిచ్చిన ప్రింట్ ఆర్డర్ కాపీని రిటర్నింగ్ అధికారికి అందచేయాలన్నారు. డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, డీవీ కృష్ణ (సీపీఐ-ఎం), వై.రామయ్య (టీడీపీ), సోమశేఖర్, జి.సురేష్ (ఐఎన్‌సీ), కె.వరమేశ్వరరావు (ఆప్), ఎల్.శివరాంప్రసాద్ (వైసీపీ), పీవీ శ్రీహరి (బీజేపీ), ఎం.వినోద్‌కుమార్ (బీఎస్‌పీ) పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన జేసీ డాక్టర్ సంపత్‌కుమార్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సంపత్ కుమార్

అక్రమ కట్టడాల అడ్డా 16వ డివిజన్

రామలింగేశ్వరనగర్, ఏప్రిల్ 3: ఆయనొక షాడో ప్రజాప్రతినిధి. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా, ధ్వంసం చేస్తున్న పట్టించుకోడు. అక్రమ కట్టడాలను మాత్రం ఆఘమేఘాలపై వేయిస్తాడు. అధికారులు ఏమైనా చర్యలు తీసుకుంటే వెంటనే ప్రత్యక్షమై నేనున్నానంటూ మళ్లీ వేయిస్తాడు. అందుకు ఆయనకు దక్కేదేంటో ఆయనకే తెలియాలి. ఈ డివిజన్‌కు కార్పొరేటర్ ఉన్నా ఎక్కడా కనిపించదు. గెలిచిన్పటి నుంచి పట్టుమని 10 సార్లు కూడా డివిజన్ ప్రజలకు కనిపించలేదంటే ఆ షాడో ప్రజాప్రతినిధి వ్యవహారశైలి అర్థమవుతుంది. డివిజన్ ఇంత పెద్ద ఎత్తున అక్రమ కట్టడాల నిర్మాణం జరుగుతున్నా ఆ కార్పొరేటర్ స్పందించకపోగా సహకరిస్తున్న తీరు టౌన్ ప్లానింగ్ అధికారులకు తలనొప్పిగా మారింది. నగరంలో ఎక్కడా జరగని అక్రమ నిర్మాణాలు 16వ డివిజన్‌లో జరుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో ఉండే సమయాన్ని అసరాగా తీసుకున్న సదరు ప్రజాప్రతినిధి ఈ నిర్మాణాల గురించి స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నాడు. ఈ కట్టడాలపై ఫిర్యాదుల అందుకున్న సదరు టౌన్ ప్లానింగ్ అధికారి వాటిపై చర్యలు తీసుకుంటూ వెంటనే ప్రత్యక్షమై వాటిని మళ్లీ వేయిస్తున్నాడు. ఇలాంటి వాటితో కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతున్నా తన స్వార్థమే లక్ష్యంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నాడు. డివిజన్‌లో కే బిల్డింగ్ రోడ్డు, గీతానగర్ కరకట్ట, డొంకరోడ్డులో అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకున్నా వాటిని మళ్లీ వేయిస్తున్న తీరుతో పై స్థాయి అధికారులను, నియోజకవర్గ అధికార పార్టీ ఇన్‌చార్జ్ ఎంత అండగా ఉన్నారో అర్థమవుతుంది. అక్రమ కట్టడాలపై వెంటనే స్పందించే ఆయన ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నా, ధ్వంసం చేస్తున్నా మాత్రం స్పందించడు. డివిజన్‌లో ప్రభుత్వానికి సంబంధించిన స్థలం లో కొందరు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్న, ఫీడర్‌రోడ్డులో లారీలు వెళ్లకుండా వైపు ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రోజులు గడుస్తున్నా వాటిని మాత్రం అలాగే వదిలేశాడు. ఈయన ఆధ్వర్యంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.



గతవారం చర్యలు తీసుకున్నా మళ్లీ తిరిగి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం





ట్రోఫీ, మెడల్స్‌తో ఏపీ సాఫ్ట్‌బాల్ టీమ్

జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంప్‌గా ఏపీ

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 3: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌గా ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు అవతరించింది. బాలుర జట్టు వరుస విజయాలతో గ్రాండ్ ఫైనల్‌కు చేరి మధ్యప్రదేశ్‌పై 12-02 తేడాతో ఘన విజయం సాధించి టైటిల్‌ను సాధించింది. ఈ సందర్భంగా ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈవో వెంకటేశులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు పాల్గొన్న ఈ టోర్నీలో రాష్ట్ర బాలుర టీమ్ అత్యుత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను చాటిందన్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో పలువురు ప్రముఖులతో పాటు ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ నాగేంద్ర, కోచ్‌లు మహేష్, సింహాద్రి, లక్ష్మి, బద్రి, సురేష్ పాల్గొన్నారు.





టీడీపీలో చేరిన సంకే, అప్పికట్ల

వన్‌టౌన్, ఏప్రిల్ 3: వైసీపీ జిల్లా డాక్టర్ సెల్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సంకే విశ్వనాథ్, యూనైటెడ్ క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు అప్పికట్ల జవహర్ బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి వారిద్దరూ ఉండవల్లిలోని నారా లోకేష్ నివాసానికి చేరుకుని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు డాక్టర్ సెల్ ప్రెసిడెంట్ సజ్జాల రామకృష్ణ, రామకృష్ణ ముఖ్య అనుచరులు కూడా పార్టీలో చేరారు.

నీనా నిగమ్‌కు స్వాగతం పలికిన కలెక్టర్, జేసీ



కృష్ణలంక, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్‌ను ఈసీఐ ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్ర త్యేక వ్యయ పరిశీలకులుగా నియమించింది. ఢిల్లీ నుంచి నగరానికి వచ్చిన ఆమెకు నోవాటెల్ హోటల్ వద్ద కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ స్వాగతం పలికారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలకు కసరత్తు

వన్‌టౌన్, ఏప్రిల్ 3: దుర్గగుడిలో ఉద్యోగుల అంతర్గత బదిలీలకు ఈవో రామారావు కసరత్తు చేస్తున్నారు. సూపరింటెండెంట్ స్థాయి నుంచి ఆ దిగువ స్థాయి వరకు ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారు. నేడో రేపో ఉత్తర్వులు రానున్నాయని సమాచారం. తాజాగా అర్చకులు, అంతకముందు ఏఈవో తదితరులను అంతర్గత బదిలీలు చేశారు. ఒక శాఖ నుంచి మరో శాఖకు, ఒక విభాగం నుంచి మరో విభాగాలకు బదిలీ జరిగాయి.

డ్రైవర్- సెక్యూరిటీ గొడవపై ఈవో విచారణ

కనకదుర్గానగర్‌లో కారు డ్రైవర్- సెక్యూరిటీ గార్డు మధ్య జరిగిన గొడవపై ఈవో రామారావు విచారణ చేస్తున్నారు. భక్తుడిపై సెక్యూరిటీ గార్డులు దురుసుగా వ్యవహరించారని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో నిజానిజాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఈవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు ఈ అంశంపై విచారణ చేస్తున్నారని, ప్రాథమిక విచారణలో అన్యమతస్థులు తమ చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శిస్తూ ఆలయం వద్దకు వస్తున్న సమయంలో సిబ్బంది నిలిపేశారని, దీంతో సంబంధిత వ్యక్తులు దుర్భాషలాడుతూ, దురుసుగా వ్యవహరించినట్టు తెలిసిందన్నారు. దీనిపై విచారణ జరుగుతోందన్నారు. భక్తుల మనోభావాలకు పెద్దపీట వేస్తున్నామని, దురుద్దేశపూర్వకంగా దేవస్థానంపై చేసే ప్రచారాలు నమ్మవద్దని సూచించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గగుడిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నగరంలోని పాయకాపురానికి చెందిన పాములపాటి కాశీలింగాచారి, ఆయన కుటుంబ సభ్యులు రూ.1,11,111 విరాళం, అనంతపురానికి చెందిన దుర్గా ఆటోమోటివ్ అధినేత ఎన్. వెంకటేశ్వరరావు ఆయన కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. అమ్మవారి దర్శనానంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం,ఆశీస్సులు అందజేశారు.



శలగల సురేఖ కచేరీ

ధర్మపథం వేదికపై శలగల సురేఖ గాత్ర కచేరీ

ధర్మపథం వేదికపై బుధవారం శలగల సురేఖ గాత్ర కచేరి జరిగింది. పలు భక్తిగీతాలను ఆమె ఆలపించారు. మంతెన రివేష్ వయోలిన్‌పైన, కే జగన్మోహిని మృదంగంతో సహకరించారు.

యోగా క్రీడాకారులకు సత్కారం

ధర్నాచౌక్, ఏప్రిల్ 3: జాతీయ యోగా చాంపియన్‌షిప్‌లో 6వ స్థానం సాధించిన షాలెం రాజు, శ్రీకృష్ణ జోడిని అమరావతి యోగా అండ్ ఏరోబిక్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. స్థానిక ఐజీఎంసీ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ఘనంగా జరిగింది. గత నెలలో బెంగాల్‌లోని హుగ్లీలో జరిగిన 48వ జాతీయ సీనియర్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న పారుపల్లి షాలెంరాజు, శ్రీకృష్ణల జోడి ఆర్టిస్టిక్ యోగాలో ఆలిండియాలో 6వస్థానం సాధించడం జరిగింది. త్వరలో సింగపూర్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ యోగా కాంపిటేషన్స్‌కు కూడా వీరిద్దరు ఎన్నికయ్యారు. వీరికి పూర్తి సహాయ,సహకారాలు అందిస్తామని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. ఎల్లారావు, పి.రమణ, లావణ్యకుమార్, పి.ప్రశాంత్, సిరాజ్, యోగా గురువులు అంకాల సత్యనారాయణ, రవికిరణ్, కృష్ణాజిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీ పాల్గొన్నారు.

ఫుడ్‌కోర్టులో షాపుల ఎదుట బండ్లు..!

● ఇరుపక్షాలకు ప్రతిరోజూ గొడవే..

లబ్బీపేట, ఏప్రిల్ 3: నిర్ణీత సమయం కంటే ముందుగా తమ షాపుల ముందు బండ్లు పెడుతూ అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారంటూ ఫుడ్‌కోర్టు బండ్లపై డ్వాక్రా బజార్ షాపుల నిర్వాహకులు కార్పొరేషన్ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వ్యాపారులకు కార్పొరేషన్ అధికారులు రాత్రి 10.30 గంటల నుంచి 12 గంటల వరకు వ్యాపారాన్ని చేసుకునేలా సమయం కేటాయించారు. బందర్ రోడ్డు మొదలు డ్వాక్రా బజార్ వరకు 70కి పైగా బండ్లపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరిలో కొందరు నిర్ణీత సమయానికి ముందుగానే వ్యాపారం చేస్తున్నారు. స్టేడియం కాంప్లెక్స్‌తో పాటు డ్వాక్రా బజార్‌లో ఉండే షాపులకు ఇబ్బందిగా మారింది. వ్యవహారం నిత్యకృత్యం కావడంతో విసుగుచెందిన కొందరు షాపుల నిర్వాహకులు కార్పొరేషన్ ఎస్టేట్ అధికారికి బుధవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి చర్యలు తీసుకుంటామని, వాటిని స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని సూచించారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యార్లగడ్డ జ్ఞానేశ్వరి

పింఛన్లు పంపిణీ చేయలేని స్థితిలో ప్రభుత్వం

● యార్లగడ్డ జ్ఞానేశ్వరి

గుణదల, ఏప్రిల్ 3: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయ సిబ్బందిచేత పింఛన్లు సరైన సమయంలో పంపిణీ చేసేందుకు రూపకల్పన చేసి ఉంటే ఇంత జాప్యం జరిగి ఉండేది కాదని యార్లగడ్డ జ్ఞానేశ్వరి అన్నారు. ఎన్నికల ప్రచారం భాగంగా ఆమె రూరల్ మండలంలోని రామవరప్పాడులో గల వంగూరు లక్ష్మీపతిరావు వీధిలో బుధవారం ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ సంయుక్తంగా బరిలోకి దింపిన అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందనున్నారని జోస్యం చెప్పారు. మరో 50 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానుందని తెలిపారు. గన్నవరం రూపురేఖలు మార్చేందుకు యార్లగడ్డ వెంకట్రావు సిద్ధంగా ఉన్నారన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాబిగాని కొండ, అద్దేపల్లి సాంబశివ నాగరాజు (సాంబు), కొల్లా ఆనంద్ కుమార్, అరుణ, తుపాకుల శివలీల, తంబాబత్తుల జ్యోతి, రేగళ్ల రాజు, సుబ్బారావు, పట్టపు చంటి, గంధం గోవర్ధన్, హరి, రాంబాబు, రవిశంకర్, రత్నం నాగేశ్వరరావు, బీజేపీ నేతలు డాక్టర్ ఫణి, మల్లి, నాగరాజు పాల్గొన్నారు.



ట్రాక్ నిర్వహణ పనులు చేస్తున్న సిబ్బంది

డివిజన్‌లో 210 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 3: డివిజన్‌లో ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ 210 కిలోమీటర్ల రైల్వేట్రాక్ పునరుద్ధరించినట్టు రైల్వే డివిజన్ ప్రజా సంబంధాల కార్యాలయం బుధవారం ఒక ప్ర కటన విడుదల చేసింది. డివిజన్ అంతటా ట్రాక్ నిర్వహణలో ఉత్తమ ఫలితాలున్నాయని గత 20ఏళ్లలో అత్యధికంగా 2023-24లోనే పురోగతి సాధించామన్నారు. ఎఫ్‌వై స్లీపర్ పునరుద్ధరణలోనూ రికార్డు సాధించామని 148 కిలోమీటర్ల పొడవులో పాత కాంక్రీట్ స్లీపర్‌లను తొలగించి కొత్త స్లీపర్‌లను అమర్చినట్టు తెలిపారు. రైల్ రెన్యూవల్ ప్రక్రియ ద్వారా చెడిపోయిన పట్టాలను బాగుచేసి లేదా వాటి స్థానే కొత్త పట్టాలు వేశామన్నారు. రైల్ రెన్యూవల్ ప్రక్రియ విశేషాలను గురించి ఈ సందర్భంగా వివరించారు. కొత్తగా ప్రారంభించిన ట్రాక్ రిలేయింగ్ ట్రెయిన్, ప్లాసర్ క్లిక్ రిలేయింగ్ సిస్టమ్ సహాయంతో రైల్వే డివిజన్ అరుదైన ఘనతను సాధించిందన్నా రు. పాత పట్టాలను బాగుచేయడంలో ఇవి ఎంతో సహకరిస్తున్నాయన్నా రు. ఇంకా అనేక అంశాల్లో ట్రాక్ నిర్వహణ గణనీయంగా పురోగతి సాధించిందన్నారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, కో-ఆర్డినేషన్ డీఈఎం ఎస్.వరుణ్‌బాబు ట్రాక్ మిషన్ ఇంజనీరింగ్ సిబ్బందిని అభినందించారు. డీప్ స్క్రీనింగ్ పనులు, రైల్ కం స్లీపర్ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పనివేళల మార్పు: కలెక్టర్

కృష్ణలంక, ఏప్రిల్ 3: ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పనివేళలను ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పనిచేసేలా మార్పులు చేసినట్టు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు ఈ నెల 4 నుంచి మే 31 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తాయని, మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలను ఇంటికి పంపుతారన్నారు. అంగన్వాడీలకు మే 1 నుంచి 15 వరకు, అంగన్వాడీ సహాయకులకు మే 16 నుంచి 30వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించడం జరిగిందన్నా రు. ఈకాలంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు అంగన్వాడీల ద్వారా లబ్ధిదారులకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ పంపిణీలో అంతరాయం లేకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో పిల్లల కు అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, తాగునీటిని అందుబాటులో ఉండేలా చూడాలని, జి ల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు.

తెలుగులో ఫామ్ 26...

- వివరాలు సమర్పించండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించిన అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ను(ఫామ్-26) తెలుగులో అందుబాటులో ఉంచే అంశంపై వివరాలు సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను మే మొదటి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించి అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ను(ఫామ్-26) తెలుగులో అందుబాటులోకి ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన ఎస్ రమేష్‌బాబు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపిస్తూ... అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసులు, ఆస్తుల వివరాలు అన్నింటినీ తెలుగు పత్రికలు, ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేసేలా ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులను ఆదేశించాలని కోరారు. అభ్యర్థులు సమర్పించే ఫామ్-26 అఫిడవిట్‌లను తెలుగులో అందుబాటులో ఉంచేలా ఈసీని ఆదేశించాలని కోరారు.

అప్పులు తెచ్చి అస్మదీయులకు పంపిణీ: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) హెచ్చరికలను సైతం లెక్క చేయకుండా జగన్ సర్కారు అప్పులు తెస్తూ... తన అస్మదీయులకు పంచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ బుధవారం విమర్శించారు. 'ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెలా 1న జీతాలు, పెన్షన్లు చెల్లించేందుకు కూడా అప్పులు వెదకాల్సిన దుస్థితి. ఉద్యోగులకు దాదాపు రూ.32వేల కోట్లు బకాయిలు చెల్లించాలి. ఉద్యోగులను విస్మరించి, తెచ్చిన అప్పులను అస్మదీయులకు చెల్లించడం దుర్మార్గం. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్తులతోపాటు వివిధ పద్ధతుల్లో తీసుకువచ్చిన అప్పులు మొత్తం కలిపి రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.10 లక్షల కోట్లు దాటింది. ఎఫ్‌ఆర్‌ఎంబీ రుణ పరిమితికి మించి అప్పులు చేస్తుండటం రాష్ట్ర ప్రభుత్వ తిరోగమన విధానాలకు నిదర్శనం. జగన్ సర్కార్ ఇప్పటి వరకు చేసిన రూ.14,500 కోట్ల చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలి. ప్రజలంతా జగన్మాయలను గమనించి ఎన్నికల్లో ఓట్లు వేయాలి' అని రామకృష్ణ కోరారు.

నేటి నుంచి కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాకు తాగునీటి విడుదల

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది తూర్పు, పశ్చిమ డెల్టాకు గురువారం నుంచి తాగునీటి విడుదల చేస్తున్నామని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర జలవనరుల శాఖ సమాచారమిచ్చింది. ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్, కృష్ణా, గుంటూరు, కృష్ణా తూర్పు, కృష్ణా పశ్చిమ డెల్టా, గుంటూరు చానల్ ద్వారా పులిచింతల నుంచి నీటిని విడుదల చేస్తున్నామని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వు జారీ చేశారు. గురువారం నుంచి ఈ నెల 10వ తేదీ దాకా తాగునీటి విడుదల చేస్తున్నందున కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

యాపిల్ యూజర్లకు కేంద్రం 'హైరిస్క్' అలర్ట్

- హ్యాకింగ్ బారిన పడకుండా అప్‌డేట్ చేసుకోవాలని సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: యాపిల్ వినియోగదారులకు కేంద్రం హైరిస్క్ అలర్ట్‌ను జారీ చేసింది. ఐఫోన్, మ్యాక్‌బుక్, ఐప్యాడ్, విజన్ ప్రో హెడ్‌సెట్ వంటి యాపిల్ ఉత్పత్తులకు రిమోట్ కోడ్ ఎగ్జిక్యూషన్‌కు సంబంధించిన భద్రతాపరమైన ముప్పు ఉందని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీ సంస్థ- కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్-ఇన్) వెల్లడించింది. దీని వల్ల యూజర్లకు ప్రమాదం పొంచి ఉందని, హ్యాకింగ్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. కాబట్టి లేటెస్ట్ సెక్యూరిటీ వెర్షన్స్‌తో అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

రాక్షస పాలనకు రోజులు దగ్గరపడ్డాయి.!

- జబర్దస్త్ కమెడియన్ రాంప్రసాద్

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని జబర్దస్త్ కమెడియన్ రాంప్రసాద్ (ఆర్‌పీ) పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో కాసేపు ముచ్చటించారు. నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్న కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి అసెంబ్లీ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ సేవాగుణం కలవారని తెలిపారు. అలాంటి వారిని గెలిపించుకుంటే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. వేసవిలో ఎండల కంటే వైసీపీ ప్రభుత్వం ప్రమాదకరమైందని, వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆర్‌పీ పిలుపునిచ్చారు.

హిందూజా వేరియబుల్ కాస్ట్ పెంపు!

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం హిందూజా నేషనల్ పవర్ ప్రాజెక్టు విద్యుదుత్పత్తిలో వేరియబుల్ వ్యయం రూ.3.03నుంచి రూ.3.16కు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఆ ఆదేశాలను వెబ్‌సైట్‌లో పొందుపరచింది.

ఇద్దరి అవయవదానం.. నలుగురికి వెలుగులు

అక్కిరెడ్డిపాలెం(విశాఖపట్నం), ఏప్రిల్ 3: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. విశాఖలోని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో మంగళవారం వీరిద్దరి అవయవాలను సేకరించారు. జీవన్‌దాన్ వైద్య అధికారులు, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు బుధవారం తెలిపిన వివరాలు.. విశాఖలోని సీతమ్మపేటకు చెందిన బీఎస్‌వీ కృష్ణ (50) ఒక జ్యూవెలరీ దుకాణంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 29వ తేదీన విధుల్లో భాగంగా రాజమహేంద్రవరం వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఎలమంచిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, కృష్ణ బ్రెయిన్‌డెడ్ కావడంతో మంగళవారం ఆయన కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఊపిరితిత్తులను సేకరించిన జీవన్‌దాన్ వైద్య సిబ్బంది వాటిని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన కొవ్వూరి రాణి (50) గత నెల 29వ తేదీన ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చేర్చగా...అక్కడ నుంచి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించారు. రాణికి బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించిన వైద్యులు ఆ విషయం కుటుంబసభ్యులకు తెలపగా.. అవయవదానానికి అంగీకారం తెలిపారు. రాణి కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులను సేకరించారు. కృష్ణ, రాణి అవయవాలను జీవన్‌దాన్‌లో నమోదు చేసుకున్న నలుగురికి అమర్చినట్టు వైద్యులు తెలిపారు.

అసంతృప్తులకు లోకేశ్ బుజ్జగింపు

- టీడీపీ ప్రభుత్వంలో ప్రాధాన్యమిస్తామని హామీ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జనసేన, బీజేపీ అభ్యర్థులు పోటీ చేసే చోట వారి గెలుపు కోసం కృషి చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తమ పార్టీ నేతలను కోరారు. ఎన్నికల్లో సీటు ఆశించి, భంగపడ్డ అసంతృప్త నేతలతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. అసంతృప్త నేతల్ని బుజ్జగించారు. వారి రాజకీయ భవిష్యత్‌కు భరోసా ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో తగు ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. లోకేశ్ హామీతో నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను కలిసినవారిలో కిమిడి నాగార్జున, కోరాడ రాజబాబు, బంగార్రాజు, ఎమ్మెస్ రాజు, జగన్మోహన్‌రాజు, నాగూల్ మీరా, మాధవనాయుడు తదితరులు ఉన్నారు.

విశాఖలో వైసీపీ తాయిలాలు

- ఓటర్లకు రైస్ కుక్కర్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడులు
- కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై దాడి

విశాఖపట్నం, ఏప్రిల్ 3: విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 22వ వార్డు తారామసీదు ఏరియాలో బుధవారం రాత్రి వైసీపీ నాయకులు రైస్‌కుక్కర్లు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆటోల్లో గంగ బ్రాండ్ రైస్ కుక్కర్లను (5.5 లీటర్స్) తీసుకొచ్చి రోడ్డుపై దింపారు. ఈ సమాచారం ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అందడంతో అక్కడకు చేరుకుని రైస్‌కుక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీస్తున్న మీడియా ప్రతినిధులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. 'ఈనాడు', 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై దాడి చేసి కెమెరాలు లాక్కున్నారు. దీంతో దాడులు చేసిన వారిని పోలీసులు చెదరగొట్టారు.

ఆప్‌ను నేలమట్టం చేసే కుట్ర

ఎన్నికలకు ముందే ఆ పని చేయాలని కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు

- ఢిల్లీ హైకోర్టులో అభిషేక్ సింఘ్వీ వాదనలు
- ఆయన పాత్రపై ఆధారాలున్నాయి: ఈడీ
- తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి



బుధవారం తిహాడ్ జైలు నుంచి బయటకు వస్తున్న ఆప్ నేత సంజయ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందే ఆమ్ ఆద్మీ పార్టీని (ఆప్‌ను) నేలమట్టం చేయాలనే దురుద్దేశంతోనే తనను అరెస్టు చేశారని ఆ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో బుధవారం సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. పిటిషన్‌ను ఈడీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వు చేశారు. అంతకుముందు కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆప్‌ను సర్వనాశనం చేసి ఢిల్లీలోని ఏడు లోక్‌సభ సీట్లలో విజయం సాధించాలనే లక్ష్యంలో భాగంగానే కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ సర్కార్ అరెస్టు చేయించిందని ఆరోపించారు. ఈ మేరకు, పోలింగ్ రోజు తొలి ఓటు పడటానికి ముందే ఆప్‌ను నేలమట్టం చేయడం ఈడీ ఉద్దేశమన్నారు. ఎన్నికలకు ముందు ఒక పార్టీ అధినేతను, ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం సరైంది కాదని, ఎన్నికల్లో అందరికీ సమానావకాశాలు కల్పించాలనే ప్రజాస్వామ్య మూలసూత్రాలను ఇది కాలరాస్తుందని సింఘ్వీ చెప్పారు. కేజ్రీవాల్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని, కానీ, దీనికోసం ఈడీ ఒక్కసారి కూడా ప్రయత్నించకుండా ఏకంగా అరెస్టు చేసిందని గుర్తు చేశారు. కొందర్ని అరెస్టు చేసి ఒత్తిడి తెచ్చి వారి నుంచి తమకు కావలసిన విధంగా ప్రకటనలు ఇప్పిస్తారని, అనంతరం వారికి బెయిల్ వచ్చేలా చూస్తారని, ఆ తర్వాత వారు అప్రూవర్లుగా మారేందుకు అంగీకరిస్తారని తెలిపారు. ఈ కేసులో అప్రూవర్లుగా మారిన వారిలో ఇద్దరికి బీజేపీతో ప్రత్యక్ష సంబంధాలున్నాయని, ఒకరు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని సింఘ్వీ తెలిపారు. ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం కేసులో ప్రధాన కుట్రదారని, ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో సీఎంను అరెస్టు చేయటమేమిటన్న వాదనను వ్యతిరేకిస్తూ.. ఒక రాజకీయ నాయకుడు ఎన్నికల ముందు హత్య చేసి తనను అరెస్టు చేయకూడదంటే అంగీకరిస్తామా అని ప్రశ్నించారు. ఒక ఉగ్రవాది ఆర్మీ వాహనాన్ని పేల్చి వేసి, ఎన్నికల్లో పోటీ పడుతున్నా కాబట్టి నన్నేమీ అనొద్దు అంటే ఊరుకుంటామా అని పేర్కొన్నారు. దీనికి సింఘ్వీ అభ్యంతరం తెలుపుతూ.. ఈ కేసుకు సంబంధం లేని విచిత్రమైన పోలికలు తెస్తున్నారని, మద్యం కేసులో కేజ్రీవాల్ అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు ఇంతవరకూ ఈడీ ఒక్క సాక్ష్యమూ సంపాదించలేదని గుర్తుచేశారు. ఏఎస్‌జీ వాదనలు కొనసాగిస్తూ.. మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్ పాత్రపై దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉన్నదని, అయితే, డబ్బులు చేతులు మారినట్లు తాము గుర్తించామని తెలిపారు. కుంభకోణం జరిగిందని, లాభాల వాటా శాతాన్ని పెంచి ముడుపులకు ఉపయోగించారని, హవాలా మార్గంలో ఎన్నికల సమయంలో డబ్బులు పంపారని పేర్కొన్నారు. ఈ మేరకు తమ వద్ద వాట్సాప్ చాట్‌లు, హవాలా ఆపరేటర్లు వెల్లడించిన వివరాలు ఉన్నాయన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు. మరోవైపు, టీ, నీళ్ల కాచుకోవటానికి ఒక ఎలక్ట్రిక్ కెటిల్, పుస్తకాలు చదువుకోవటానికి కుర్చీ, టేబుల్ కావాలన్న కేజ్రీవాల్ విజ్ఞప్తికి ఢిల్లీలోని స్థానిక కోర్టు అంగీకరించి, వాటిని సమకూర్చాలని తీహాడ్ జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, బుధవారం ఉదయం తన గదిని కేజ్రీవాల్ చీపురుతో స్వయంగా శుభ్రం చేసుకున్నారని జైలు అధికారవర్గాలు తెలిపాయి.

కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తోంది: ఆప్

అరెస్టు అనంతరం కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నదని, ఆయన ఇప్పటికే 4.5 కిలోల బరువు తగ్గిపోయారని ఆప్ ఆందోళన వ్యక్తం చేసింది. తీవ్రమైన మధుమేహం సమస్యతో ఉన్న కేజ్రీవాల్‌ను జైలు పాలు చేసి ఆయన ప్రాణాలతో బీజేపీ చెలగాటమాడుతున్నదని ఆరోపించింది. ఈ మేరకు ఆప్ నేత, ఢిల్లీ మంత్రి ఆతిషీ బుధవారం మీడియాతో మాట్లాడారు. 'తీవ్రమైన మధుమేహం ఉన్న వారిలో షుగర్ లెవల్ 50 ఎంజీ/డీఎల్ కన్నా తగ్గితే అది అత్యంత ఆందోళనకరం. ఈడీ కస్టడీలో ఉన్నప్పుడే కేజ్రీవాల్ షుగర్ లెవల్స్ మూడుసార్లు పడిపోయాయి. ఒకసారి ఏకంగా 46 ఎంజీ/డీఎల్‌కు తగ్గిపోయింది. గత 12 రోజుల్లో కేజ్రీవాల్ 4.5 కిలోల బరువు తగ్గారు' అని తెలిపారు. కేజ్రీవాల్‌కు ఏమైనా జరిగితే బీజేపీ వాళ్లను యావత్ దేశం మాత్రమే కాదు, దేవుడు కూడా క్షమించడన్నారు. అయితే, సోమవారం తీహాడ్ జైలుకు వచ్చినప్పటి నుంచీ కేజ్రీవాల్ బరువు స్థిరంగా 65 వద్దే కొనసాగుతుందని, ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, ఇద్దరు డాక్టర్లు కూడా ఆయనను పరీక్షించారని జైలు అధికార యంత్రాంగం బుధవారం ప్రకటన విడుదల చేసింది. కాగా, కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఈ నెల 7వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆప్ సమష్టి నిరాహారదీక్షను చేపట్టనున్నట్లు ప్రకటించింది. దీనికి దేశవ్యాప్తంగా ప్రజలు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చింది. మంగళవారం బెయిల్ మీద జైలు నుంచి విడుదలైన ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ, త్వరలో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా తదితర ఆప్ నేతలు కూడా విడుదలవుతారని ఆశిస్తున్నానని పేర్కొంటూ.. తీహార్ జైలు తాళాలు త్వరలో తెగిపడతాయని పేర్కొన్నారు.

ఆతిశీకి బీజేపీ పరువునష్టం నోటీసులు

ఈడీ అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే బీజేపీలో చేరాలంటూ తనకు ఆఫర్ వచ్చిందని, ఈ మేరకు ఓ వ్యక్తి ద్వారా ఆ పార్టీ రాయబారం పంపిందని ఆతిశీ చేసిన ఆరోపణలపై బీజేపీ పరువునష్టం నోటీసులు పంపించింది. తప్పుడు వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది.

రోగం రోగికా?.. ఆస్పత్రికా!?

- రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఇదీ తీరు



ఈ ఫొటో చూస్తుంటే రోగం రోగికా? లేక ఆస్పత్రికా?.. అనే సందేహం వస్తుందా?.. నిజమే మరి..! జగన్ జమానాలో ప్రభుత్వాస్పత్రులకు పట్టిన పీడకు ఈ ఫొటో అద్దం పడుతోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఓ రోగి కుడి చేతికి సెలైన్ సూది (క్యానిలా) పెట్టారు. ఎడమ చేతిలో ఆ సెలైన్ బాటిల్ పెట్టారు. చేతికి ఏవో కాగితాలు ఇచ్చారు. వాటిని పట్టుకొని పాపం ఆ రోగి తన బెడ్ ఎక్కడ అంటూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. సిబ్బంది ఎవరూ అతడిని పట్టించుకోలేదు. ఆ సమయంలో ఇలా బేలగా చూస్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటపడ్డారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

సత్యసాయి ఆంగ్ల అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్ కన్నుమూత



పుట్టపర్తి, ఏప్రిల్ 3: పుట్టపర్తి సత్యసాయి బాబా ఆధ్యాత్మిక ప్రసంగ అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్ (82) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆయన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు భగవాన్ సత్యసాయికి అత్యంత సన్నిహితంగా మెలిగారు. సత్యసాయి ప్రసంగాలను ఆంగ్లంలోకి అనువదించేవారు. పుట్టపర్తిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

బీజేపీలో చేరుతున్నా: సుమలత

మండ్య, ఏప్రిల్ 3: సినీనటి, కర్ణాటకలోని మండ్య నియోజకవర్గ స్వతంత్ర ఎంపీ సుమలతా అంబరీశ్ బీజేపీలో చేరనున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఆ నియోజకవర్గం నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామికి ఆమె మద్దతు ప్రకటించారు. బుధవారం తన మద్దతుదారులతో సమావేశమైన ఆమె ఈ విషయాలను వెల్లడించారు. 'నేను మండ్యను వీడి ఎక్కడికీ వెళ్లను. రానున్న రోజుల్లోనూ మీకోసం ఇక్కడే పనిచేస్తాను. బీజేపీలో చేరాలని నేను నిర్ణయించుకున్నా' అన్నారు. తాను స్వతంత్ర ఎంపీని అయినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ.4వేల కోట్ల వరకూ గ్రాంట్లు ఇచ్చిందని, మండ్యకు సంబంధించిన ఏ నిర్ణయంలోనైనా బీజేపీ నేతలు తనను విశ్వాసంలోకి తీసుకొంటున్నారని తెలిపారు. 'బీజేపీకి నీ అవసరం ఉందని ప్రధానమంత్రి చెప్పారు. ఆయన మాటను నేను గౌరవించాల్సి ఉంది' అన్నారు. 'నేను కాంగ్రెస్‌లో చేరాలని కొంతమంది కోరారు. అయితే, సుమలత అవసరం ఉందని పార్టీ భావించడం లేదని సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. ఈ మాటలు విన్నాక ఆత్మగౌరవం ఉన్న వ్యక్తులు కాంగ్రెస్‌లోకి ఎలా వెళ్లగలరు?' అంటూ సుమలత భావోద్వేగానికి గురయ్యారు.

వీవీ ప్యాట్లపై వచ్చే వారం విచారిస్తాం

- ఈ విచారణ ఎంతో అత్యవసరం
- స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వీవీ ప్యాట్ల అంశంపై విచారణ చేపట్టడం ఎంతో అత్యవసరమని తమకు తెలుసని, దీనిపై వచ్చేవారం తప్పకుండా విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) కౌంటింగ్ మాత్రమే కాకుండా ఓటర్ వెరిఫియబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీపాట్)లను సైతం లెక్కించిన తర్వాతే విజేతను ప్రకటించాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ), 21 ప్రకారం వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కుల్లో భాగం. 2013లో సుబ్రమణియన్ స్వామి వర్సెస్ భారత ఎన్నికల సంఘం కోర్టు ఆదేశాలతో ఓటరు తాను ఏ అభ్యర్థికి ఓటు వేశారో తెలుసుకునే హక్కును పొందారు. కాబట్టి ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల కౌంటింగ్ మాత్రమే కాకుండా వీవీ ప్యాట్‌లను సైతం లెక్కించి విజేతను ప్రకటించాలి' అని ఏడీఆర్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారమే విచారణ జరగాల్సి ఉంది. అయితే.. జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పెషల్ బెంచ్‌కు నేతృత్వం వహిస్తుండడంతో అది బుధవారం బెంచ్ మీదకు రాలేదు. ఈ క్రమంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రత్యేకంగా ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించారు. పిటిషన్‌ను త్వరగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌ను వచ్చే వారంలో విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలో మరో ఇద్దరు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, గోపాల్ శంకర్ నారాయణన్ కలుగజేసుకుని ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, ఆలస్యమైతే పిటిషన్ దాఖలు చేసి కూడా వృథా అవుతుందని, అందువల్ల వీలైనంత త్వరగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. అయితే.. పరిస్థితి తమకు తెలుసని, వచ్చేవారం తప్పకుండా విచారణ చేపడతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు.

హింస రహితంగా ఎన్నికల నిర్వహణ లక్ష్యం

- స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించాలి
- భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్
- ఢిల్లీ నుంచి వీడియో సమావేశం



కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్, సీఈవో, డీజీపీ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా, హింసారహితంగా నిర్వహించడమే లక్ష్యంగా పని చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల యంత్రాంగానికి స్పష్టం చేశారు. లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శాంతి భద్రతలు, భద్రతా బలగాల మోహరింపు, ఎన్నికల వ్యయ నిర్వహణ, నోడల్ అధికారుల నియామకం తదితర అంశాలపై బుధవారం ఢిల్లీ నుంచి సహచర ఎన్నికల కమిషనర్లతో కలిసి ఆయన వివిధ రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, సీఈవోలు తదితర అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే పురాతన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఈసారి ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయోనని ప్రపంచ దేశాలన్నీ మన వైపు చూస్తున్నాయన్నారు. ఇప్పటికే మొదటి, రెండవ దశ ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, డబ్బు, మద్యం, డ్రగ్స్ వంటివి ఓటర్లను ప్రభావితం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బందాలు ఎక్కడైనా తనిఖీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి బృందాలపై జిల్లా యంత్రాంగాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లు స్వేచ్ఛగా వచ్చి, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే ప్రశాంతమైన వాతావరణాన్ని పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన రాష్ట్రం నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు రూ.258 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్ తదితరాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఏపీతో ఐదు రాష్ట్రాలు అంతర్ రాష్ట్ర సరిహద్దులను కలిగి ఉన్నాయని, రాష్ట్ర సరిహద్దుల్లో 150 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో 132 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, 632 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని వివరించారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. సరిహద్దు రాష్ట్రాలైన ఒడిసా, ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న 91 పోలింగ్ కేంద్రాలను గుర్తించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల మహారాష్ట్రకు 10 కంపెనీల పోలీసు బలగాలను పంపామని, వాటిని తిరిగి పంపాలని కోరారు. కాగా, శాంతిభద్రతలు, వ్యయ పర్యవేక్షణకు సంబంధించి పలు ఆదేశాలను సీఈసీ జారీ చేసింది.

శాంతిభద్రతలపై ఆదేశాలు ఇవీ..

- అంతర్జాతీయ, అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి.
- నేరస్థులు, సంఘ విద్రోహ శక్తులపై నిఘా సమాచారాన్ని సరిహద్దు జిల్లాల మధ్య పంచుకోవాలి.
- సరిహద్దు జిల్లాల రెగ్యులర్ అంతర్-రాష్ట్ర సమన్వయ సమావేశాలు నిర్వహించాలి.
- పోలింగ్ రోజున అంతర్ రాష్ట్ర సరిహద్దులను మూసి వేయాలి.
- లైసెన్స్ పొందిన ఆయుధాలను సకాలంలో డిపాజిట్ చేయడం, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు
- పరారీలో ఉన్న హిస్టరీ షీటర్లు, ఎన్నికల నేరాలకు పాల్పడిన నేరస్థులపై చర్యలు.
- ముప్పు అవగాహన ఆధారంగా రాజకీయ కార్యకర్తలు, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించడం.

వ్యయ పర్యవేక్షణపై ఆదేశాలు ఇవీ...

- అంతర్ రాష్ట్ర , అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అక్రమ మద్యం, నగదు, డ్రగ్స్ ప్రవాహాన్ని అరికట్టడం
- సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో చెక్ పోస్టుల వద్ద పర్యవేక్షణను బలోపేతం చేయడం.
- పోలీసు, ఎక్సైజ్, రవాణా, జీఎస్టీ, అటవీశాఖల సంయుక్త తనిఖీ ఆపరేషన్లు చేయడం.
- హెలిప్యాడ్‌లు, విమానాశ్రయాలు, బస్ స్టేషన్లు రైల్వే స్టేషన్లపై గట్టి నిఘా.
- మద్యం, నగదు, డ్రగ్స్, తాయిలాల రవాణాను అడ్డుకునేందుకు గట్టి నిఘా.

అమెరికా ఎన్‌ఎస్‌ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో.. ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్‌ఎస్‌ఎస్ స్పేస్ కాంటెస్ట్-2024లో శ్రీచైతన్య వరుసగా పదకొండోసారి వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీలో మొత్తం 28కి పైగా దేశాలు పాల్గొనగా అందులో తమ సంస్థ విద్యార్థులు నంబర్ వన్ స్థానంలో నిలిచారని శ్రీచైతన్య డైరెక్టర్ సీమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో 3 క్యాష్ అవార్డులను ఎన్‌ఎస్‌ఎస్ ప్రకటించగా అందులో 2 అవార్డులను వరుసగా రెండో సంవత్సరం కూడా శ్రీచైతన్య సాధించిందని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఘనతను ఎవరూ సాధించలేదని పేర్కొన్నారు. అలాగే వరల్డ్ ఒకటి, రెండు, మూడు ప్రైజ్‌లలో గానీ, విన్నింగ్ ప్రాజెక్టుల సంఖ్యలో, విజయం సాధించిన విద్యార్థుల సంఖ్యలో, క్యాష్ అవార్డుల్లో గానీ భారతదేశంతోపాటు ప్రపంచంలోనే మరే ఇతర విద్యా సంస్థ తమ సంస్థ ఫలితాలకు దరిదాపుల్లోలేదని ఆమె తెలిపారు. ఈ ఫలితాలే శ్రీ చైతన్య స్కూల్‌ను ప్రపంచంలోనే నంబర్ 1గా నిలిపాయన్నారు.

అమెరికా ఎన్‌ఎస్‌ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో... 34 ప్రాజెక్టులతో నారాయణ గ్లోబల్ లీడర్

అమెరికా నాసా ప్రోత్సహించిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కె. ఓ నీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్-2024లో తమ సంస్థ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణలు ఓ ప్రకటనలో తెలిపారు. సైన్స్ ప్రాజెక్టులో వరల్డ్ నంబర్ 1 స్థానంలో 2 సెలక్షన్స్ తమ విద్యార్థులు దక్కించుకున్నట్టు పేర్కొన్నారు. ఇండియాలో మరే ఇతర విద్యా సంస్థ ఇలాంటి అరుదైన రికార్డును సాధించలేదన్నారు. ఈ కాంటెస్ట్‌లో మొత్తంగా 34 ప్రాజెక్టుల్లో విజయ కేతనం ఎగురవేసినట్టు తెలిపారు. ఈ ఘన విజయంతో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ నారాయణ విద్యార్థులు విజయప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతుందని తెలిపారు. గత 11 సంవత్సరాలుగా అద్భుత ఫలితాలను సాధిస్తూ ఇప్పటి వరకు 334కు పైగా ప్రాజెక్టులను గెలుచుకుని వరల్డ్ నంబర్ వన్ స్కూల్‌గా నారాయణ మళ్లీ నిరూపించుకుందని చెప్పారు.

కమీషన్ల రూపంలో కోట్లు!

- దండుకున్న టీటీడీ చైర్మన్
- రాజకీయ పునరావాస కేంద్రంగా తిరుమల
- ఈవోను పదవి నుంచి తొలగించాలి: బీజేపీ

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 3: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి కమీషన్ల రూపంలో కోట్లు దండుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్మన్ గత ఎనిమిది నెలలకాలంలో తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారన్నారు. రూ.1,500 కోట్లు ఇంజనీరింగ్ శాఖకు కేటాయించి, సివిల్ పనులకు 10శాతం, రోడ్డు పనులకు 15శాతం కమీషన్ చైర్మన్‌కు ఇస్తే తప్ప పనులు ముందుకు వెళ్లడం లేదన్నారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాలకు ఇంకా 15ఏళ్ల పాటు జీవితకాలం ఉన్నప్పటికీ, రూ.50కోట్ల కమీషన్‌కు కక్కుర్తి పడి ఆ సత్రాలను తొలగించారన్నారు. అత్త సొమ్ము అల్లుడి దానంలా రూ.180 కోట్లు టీటీడీ నిధులను రోడ్లపై ఖర్చు పెట్టారని విమర్శించారు. టీటీడీ ఈవో అధికార పార్టీకి సేవలు చేస్తున్నారని, దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంకా ఆరువారాల పాటు ఈవో సేవలు అవసరమంటూ కేంద్రానికి సీఎం జగన్ లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కూడా తిరుమలకు ముడిపెట్టారని, ఇష్టానుసారంగా అర్హతలేని వ్యక్తులకు సైతం బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు పీవోలను పెట్టుకుని ఎలాంటి అవినీతికి పాల్పడ్డారో ఆధారాలతో సహా బయట పెడతానని చెప్పారు. బడా పారిశ్రామికవేత్తలతో స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతూ అధికార పార్టీకి వందల కోట్ల రూపాయల నిధులు ఇప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించి ఈవో ధర్మారెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు మార్గదర్శకాలు!

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్థిక సంవత్సరం 2024-25 లో మొదటి 4 నెలల కోసం ఆమోదించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మార్గదర్శకాలను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం జీవో జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఈ బడ్జెట్ అమల్లో ఉంటుందని పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2.86 లక్షల కోట్ల బడ్జెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇందులో మూడోవంతు బడ్జెట్‌ను మొదటి నాలుగు నెలలకు వాడుకునేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. పెండింగ్ బిల్లులను కొత్త ఆర్థిక సంవత్సరంలోకి మైగ్రేట్ చేస్తున్నట్టు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరానివి రూ.60 వేల కోట్ల పెండింగ్ బిల్లులున్నాయి. కానీ, వీటన్నింటికీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయించలేదు. పైగా మూడోవంతు బడ్జెట్‌కే ఆమోదం తెలిపారు కావున, ఇందులో మూడోవంతు పెండింగ్ బిల్లులే మైగ్రేట్ అయ్యే అవకాశం ఉంది. బడ్జెట్ లేని బిల్లులను మళ్లీ మొదటి నుంచి ఫైలు పెట్టి కొత్తగా బిల్ నెంబర్ తీసుకుని తిరిగి వ్యవస్థలోకి తెచ్చుకోవాలి.

ఇప్పటికి రూ.34 కోట్లు సీజ్!

- 3,300 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు
- సీ-విజిల్ యాప్ ద్వారా పెద్ద ఎత్తున ఫిర్యాదులు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.34 కోట్ల విలువైన నగదు, వస్తువులు సీజ్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. రూ.11 కోట్ల నగదు, రూ. 7 కోట్ల మద్యం, రూ.10 కోట్ల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలను తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయన్నారు. వీటికి సంబంధించి 3,300 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసీకి సీ-విజిల్ యాప్ ద్వారా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఇప్పటికి 5,500 ఫిర్యాదులు అందగా, 3,040 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలపై 1,600 ఫిర్యాదులు, అనుమతులు లేకుండా ప్రచారం చేస్తున్న వాటిపై 107 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనుమతి లేకుండా వాహనాల వాడకంపై 43, మతపరమైన ప్రచారాలపై 28, నగదు పంపిణీపై 29, మద్యం పంపిణీపై 17 ఫిర్యాదులు వచ్చాయని మీనా వివరించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 4 ఏప్రిల్ 2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్‌గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఇందులో లాంగ్వేజ్ స్కిల్స్, ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు సంబంధించిన ఫౌండేషనల్ సబ్జెక్టులు, ఎథికల్ అండర్‌స్టాండింగ్ అంశాలు బోధిస్తారు.

జిప్‌మ్యాట్



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో కూడా కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి ఇంగ్లీష్ సహా ఏవేని అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జిప్‌మ్యాట్ 2024 వివరాలు: దీనిని సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **పరీక్ష ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 22
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 23 నుంచి 25 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 2
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/JIPMAT/

డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో జాయింట్ ప్రోగ్రామ్

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ (ఎంఎస్‌డీఎస్ఎం)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఆన్‌లైన్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు అనుకూలంగా ఉంటుంది. రెగ్యులర్ అభ్యర్థులు, విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. జాతీయ పరీక్ష స్కోర్/సంస్థ నిర్వహించే డీమ్యాట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అడ్మిషన్స్ ఇస్తారు.



ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. బేసిక్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. మొదటి నాలుగు ట్రైమెస్టర్లలో అడ్వాన్స్‌డ్ మెషిన్ లెర్నింగ్, ఆల్గారిథమ్స్, బిజినెస్ అనలిటిక్స్, బిజినెస్ రీసెర్చ్, డేటా స్ట్రక్చర్స్, డేటా విజువలైజేషన్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, డిజైన్ థింకింగ్, ఎథిక్స్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, జనరేటింగ్ బిజినెస్ వేల్యూ విత్ స్టోరీ టెల్లింగ్ అండ్ ఇన్‌సైట్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఫర్ మేనేజర్స్, ఇంట్రడక్షన్ టు ఏఐ, లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ బిజినెస్, లీనియర్ ఆప్టిమైజేషన్, మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, మేనేజీరియల్ కమ్యూనికేషన్, మేనేజీరియల్ ఎకనామిక్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, మేథమెటికల్ అండ్ స్టాటిస్టికల్ మెథడ్స్ ఫర్ డేటా సైన్స్ 1&2, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామింగ్ ఫండమెంటల్స్ ఫర్ డేటాసైన్స్, రీసెర్చ్ మెథడాలజీ, స్ప్రెడ్ షీట్ మోడలింగ్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ అండ్ ఫంక్షన్స్ ఆఫ్ ఫైనాన్స్ కోర్సులు ఉంటాయి. నాలుగు, అయిదు ట్రైమెస్టర్లలో రెండు సంస్థలు అందించే అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో కొన్నింటిని ఎలక్టివ్స్ కింద ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆరో ట్రైమెస్టర్‌లో రెండు సంస్థల ఫ్యాకల్టీ మెంబర్ల ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

- వారానికి 14 నుంచి 15 గంటల ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. ప్రతి రోజూ సాయంత్రం ఏడు గంటలనుంచి ఎనిమిది గంటల వరకు; ఎనిమిది గంటల పదిహేను నిమిషాల నుంచి తొమ్మిది గంటల పదిహేను నిమిషాల వరకు సెషన్స్ ఉంటాయి. శనివారాల్లో మాత్రం ఉదయం పది గంటల నలభై అయిదు నిమిషాల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 900 గంటల సెషన్స్ నిర్దేశించారు. నెలరోజులపాటు క్యాంపస్ టీచింగ్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్/బీఫార్మసీ/బీఆర్క్/బీడిజైన్/బీఎఫ్‌టెక్/నాలుగేళ్ల బీఎస్సీ /ఎమ్మెస్సీ/ఎంసీఏ/ఎంబీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గత మూడేళ్లలో నిర్వహించిన క్యాట్/గేట్/జీమ్యాట్/జీఆర్ఈ/జామ్ పరీక్షల్లో ఒకదానిలో అర్హత పొంది ఉండాలి. లేదంటే ఐఐటీ ఇండోర్ నిర్వహించే డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీమ్యాట్) 2024 రాయాల్సి ఉంటుంది.

డీమ్యాట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం 90 నిమిషాలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** భారత అభ్యర్థులకు రూ.12 లక్షలు; విదేశీ అభ్యర్థులకు రూ.15.6 లక్షలు
- **దరఖాస్తు ఫీజు:** భారత విద్యార్థులకు రూ.1770; విదేశీ విద్యార్థులకు రూ.2300; డీమ్యాట్ 2024 రాసే అభ్యర్థులు అదనంగా రూ.590లు చెల్లించాల్సి ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 10 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **డీమ్యాట్ 2024 తేదీ:** జూన్ 23
- **అడ్మిషన్ రిజిస్ట్రేషన్:** ఆగస్టు 8 నుంచి
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 10 నుంచి
- **వెబ్‌సైట్:** msdsm.iiti.ac.in, msdsm.iimi.ac.in

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ)- డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు పది హేను నుంచి పందొమ్మిదేళ్ల మధ్య ఉండాలి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

సీఐటీడీలో డిప్లొమాలు

కోర్సులు

- నాలుగేళ్ల డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్ (డీటీడీఎం)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (డీఈసీఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్ (డీఏఆర్ఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ (డీపీఈ)

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి నిర్దేశిత డాక్యుమెంట్స్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 20
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 26
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ప్రిన్సిపల్ డైరెక్టర్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037
- **వెబ్‌సైట్:** www.citdindia.org



ఎన్ఐఏఎంటీలో అడ్వాన్స్‌డ్ డిప్లొమా


రాంచీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ(ఎన్ఐఏఎంటీ)-అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. మూడు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబ్ వర్క్‌లు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ప్లాంట్ ట్రెయినింగ్, ఇంటర్న్‌షిప్ ఉంటాయి. ఫౌండ్రీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 58 సీట్లు, ఫోర్జ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 57 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.3000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఈ/బీటెక్/డిప్లొమా(ఆటోమొబైల్/ మెకానికల్/ మెటలర్జికల్/ మాన్యుఫాక్చరింగ్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్)/బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

రిటెన్ టెస్ట్: ఇందులో మేథమెటికల్ స్కిల్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూన్ 9
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీ, పుణె, రాంచీ
- **రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **అడ్మిషన్స్:** జూలై 23 నుంచి 26 వరకు
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.niamt.ac.in



జాబ్ కార్నర్

హెచ్ఎస్‌సీసీలో ఎగ్జిక్యూటివ్‌లు

నోయిడాలోని హాస్పిటల్ సర్వీసెస్ కన్సల్టెన్సీ కార్పొరేషన్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన 38 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.



ఎంపిక: రాత, నైపుణ్య పరీక్షలు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటరాక్షన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 20

వెబ్‌సైట్: http://www.hsccltd.co.in/

ఖాళీల వివరాలు

1. ఎగ్జిక్యూటివ్(సివిల్): 5
2. ఎగ్జిక్యూటివ్(హెచ్ఆర్ఎం): 2
3. ఎగ్జిక్యూటివ్(బయో మెడికల్): 2
4. ఎగ్జిక్యూటివ్(ఫార్మసీ): 1
5. ఎగ్జిక్యూటివ్(లీగల్): 2
6. ఎగ్జిక్యూటివ్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్): 1
7. ఎగ్జిక్యూటివ్(మెకానికల్): 2
8. ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్): 2
9. ఎగ్జిక్యూటివ్(సిస్టమ్): 2
10. డిప్యూటీ మేనేజర్(సివిల్): 3
11. డిప్యూటీ మేనేజర్(బయో మెడికల్): 1
12. డిప్యూటీ మేనేజర్(ఫార్మసీ): 1
13. డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్): 1
14. డిప్యూటీ మేనేజర్(కార్పొరేట్ కమ్యూనికేషన్): 1
15. డిప్యూటీ మేనేజర్(కంపెనీ సెక్రెటరీ): 1
16. మేనేజర్(సివిల్): 2
17. మేనేజర్(హెచ్ఆర్ఎం): 1
18. మేనేజర్(బయో మెడికల్): 1
19. మేనేజర్(ఫార్మసీ): 1
20. మేనేజర్(ఫైనాన్స్): 1
21. మేనేజర్(లీగల్): 1
22. సీనియర్ మేనేజర్(సివిల్): 1
23. సీనియర్ మేనేజర్(హెచ్ఆర్ఎం): 1
24. సీనియర్ మేనేజర్(బయో మెడికల్): 1
25. డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్): 1

నాగ్‌పూర్, ఎన్ఈఈఆర్ఐలో ప్రాజెక్టు జూనియర్ రీసెర్చ్ ఫెలో

నాగ్‌పూర్, నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ప్రాజెక్టు జూనియర్ రీసెర్చ్ ఫెలో: 1

అర్హత: ఎంఎస్సీ, బీటెక్ ఉత్తీర్ణతలతోపాటు గేట్, నెట్ స్కోర్ తప్పనిసరి.

జీతం: నెలకు రూ.31,000

వయసు: 35 సంవత్సరాలు మించకూడదు

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 13

వెబ్‌సైట్: recruitment.neeri.res.in/appform/

బీహెచ్ఈఎల్, హైదరాబాద్‌లో డిప్యూటీ మేనేజర్ పోస్టులు

భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, హైదరాబాద్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

డిప్యూటీ జనరల్ మేనేజర్: 1

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతలు.

జీతం: నెలకు రూ.80,000 - 2,20,000

వయసు: 50 ఏళ్లకు మించరాదు.

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.bhel.com/

నిట్, కాలికట్‌లో సీనియర్ మెడికల్ ఆఫీసర్లు

కేరళలోని కాలికట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

1. టెక్నికల్ అసిస్టెంట్: 12
2. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 4

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీసీఏ, బీఎస్సీ, బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ.

జీతం: టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.30,000; సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,000.

వయసు: 55 సంవత్సరాలు మించకూడదు.

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://nitc.ac.in/recruitments/



లిటిల్స్




ఎలుగుబంటి, చిట్టెలుక!

ఒక అడవిలో ఎలుగుబంటి ఉండేది. దానికి కొంచెం కోపం ఎక్కువ. తేనె అంటే మహా ఇష్టం. తాను తినాలనుకున్న తేనెతుట్టె జోలికి వెళ్తే దానికి కోపం తలకెక్కేది. ఆ అడవిలోకి ఓ వేటగాడు వచ్చాడు. తేనెటీగల శబ్దం చూసి తేనె వెతకసాగాడు. ఓ రాయి తొర్రలో ఉండే తేనె కనపడింది. పొగబెట్టి తేనెటీగలను తరిమేసి తినేయాలని అనుకున్నాడు. నిప్పుకోసం రెండు రాళ్లు తీసుకొచ్చాడు. అంతలోనే చిట్టెలుక అక్కడికి వచ్చింది. 'ఎవరు స్వామి నువ్వు' అనడిగింది. 'నేను.. వేటగాడ్ని. పులిని



సైతం వేటాడే సత్తా నాది. ఈ ప్రాంతంలోని తేనె రుచిగా ఉంటుందని ఎవరో అనుకుంటే ఇటొచ్చా' అన్నాడు వేటగాడు. 'వేటగాడా.. దయచేసి ఆ రాయి తొర్రలో తేనెను కదపకండి. అది నా స్నేహితుడిది' అన్నది చిట్టెలుక. 'అయితే.. నేనేం చేయాలి. తేనె ఎవరి సొత్తు కాదు' అన్నాడు. 'ఎక్కడో ఉండే నువ్వు.. ఈ రాయి తొర్రలో ఉండే తేనెమీద పేరు రాయలేదు కదా. మా మిత్రుడు అసలే కోపిష్టి. తేనెటీగలు వాలినప్పటినుంచి ఎదురు చూస్తున్నాడు. ఈ లోపు నువ్వు వచ్చి తేనెను తీసుకుపోతే ఎలా?' అన్నది చిట్టెలుక. కోపంతో చిట్టెలుకను రాయితో కొట్టాడు. అది తప్పించుకుంది. ఇంతలోనే వేటగాడు, చిట్టెలుక వాదులాడుతుంటే చూశానంటూ ఎలుగుబంటి దగ్గరకు వెళ్లి ఓ పావురం సమాచారం అందించింది. వాయు వేగంతో ఎలుగుబంటి తేనెతుట్టె ఉండే రాయి దగ్గరకు వచ్చింది. వేటగాడు పొగబెట్టాడు. తేనెటీగలు కుడుతుంటే.. దూరంగా పరిగెత్తాడు. ఇదే అదను అనుకుని రాయి దగ్గరకు వెళ్లి ఒక్క ఉదుటున ఎలుగుబంటి తేనెతుట్టెను లాక్కొని పరిగెత్తింది. వేటగాడు బాణాన్ని ఎక్కుపెట్టాడు. ఇంతలోనే వేటగాడి కాలిని చిట్టెలుక గట్టిగా కొరికింది. గురితప్పింది. పైగా కోపంతో చిట్టెలుకను కాలితో రక్కాలని ప్రయత్నించి కిందపడ్డాడు. ఈ లోపు చిట్టెలుక తప్పించుకుంది. ఎలుగుబంటి తేనెతుట్టెను ఒక రాయిమీద ఉంచి వేగంగా వేటగాడి మీదకు దూకింది. గోళ్లతో రక్కింది. వేటగాడు బతుకుజీవుడా అనుకుంటూ పారిపోయాడు. ఆ తర్వాత ఎలుగుబంటి, ఎలుక తేనెను తిన్నాయి.


8 తేడాలు గుర్తించండి



జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 272

		6			9			8
				8			7	6
				3	6	9	5	
		7						5
	1		4	9	5		2	
9						6		
	3	5	6	4				
2	6			1				
7			3			1		

సుడోకు - 271 సమాధానం

3	7	4	8	9	6	2	5	1
8	2	1	7	4	5	6	9	3
5	6	9	1	3	2	7	4	8
7	4	6	9	5	3	1	8	2
9	3	2	6	1	8	5	7	4
1	8	5	4	2	7	3	6	9
6	1	7	3	8	4	9	2	5
4	5	3	2	6	9	8	1	7
2	9	8	5	7	1	4	3	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.